RNI.No. APTEL/2014/57702
ESTD: 1999




www.voodayam.com

# వుదయం




గుంటూరు | 01-08-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 140 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

# విదేశీ ఉపాధికి టామ్‌కాం భరోసా



## స్కిల్ యూనివర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

## ఏటీసీల్లో అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం

## డిమాండ్‌కు తగినట్లు నర్సింగ్ కళాశాలల ఏర్పాటు

## శక్తి శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 31 (వుదయం) :**

విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్టు, ఆయా దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను టామ్‌కాం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. శక్తి శాఖపై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సీఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్‌పోర్టులు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్ పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్‌కాం చేసుకోవాలని సీఎం సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కాం ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి.. వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సీఎం సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని సీఎం తెలిపారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలని సీఎం సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సీఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఏటీసీల్లో EV సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సీఎం సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, శక్తి కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పీఓకేలో పాక్ సైన్యం



**న్యూఢిల్లీ, జూలై 31 (ఎఎంఎస్) :**

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని (POK) నిరపరాధ పౌరులపై పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం సాగిస్తున్న దమన్‌కాండను భారతదేశం తీవ్రంగా ఖండించింది. అక్కడ అమాయక ప్రజలపై జరుగుతున్న నిరంకుశ దాడులను అంతర్జాతీయ సమాజం తక్షణమే గమనించాలని, ఈ అరాచకాలకు పాకిస్థాన్‌ను జవాబుదారీ చేయాలని భారత్ స్పష్టమైన పిలుపునిచ్చింది. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ అంశంపై మాట్లాడారు.

**40 మందికి పైగా పౌరుల బలి: విదేశాంగ శాఖ ధ్వజం**

పీఓకేలో స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని జులై 27 నుంచి పాక్ సైన్యం సాగిస్తున్న విచక్షణారహిత దాడుల్లో ఇప్పటివరకు 40 మందికి పైగా సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. శత్రువులుగా చూస్తున్న పాక్ సర్కార్: పీఓకేలోని సొంత ప్రజలను పాకిస్థాన్ రక్షణ మంత్రి ఏకంగా 'శత్రువులు'గా అభివర్ణించారని, ఆ వ్యాఖ్యల తర్వాతే అక్కడి సైన్యం పౌరులపై విరుచుకుపడుతూ దాడులను తీవ్రతరం చేసిందని రణధీర్ జైస్వాల్ ఆక్షేపించారు. కసి తీర్చుకుంటున్న భస్మాసుర హస్తం: భారత్‌ను దెబ్బతీసే కుట్రలో భాగంగా పాకిస్థాన్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చిందని జైస్వాల్ గుర్తుచేశారు. నాడు పాక్ పెంచి పోషించిన ఆ ఉగ్రవాద శక్తులే ఇప్పుడు సొంత దేశంపై తుపాకులు గురిపెట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టాయని ఎద్దేవా చేశారు.

# దేశ భవిష్యత్తు కంటే ప్రచారమే ఎక్కువైంది

**న్యూఢిల్లీ, జూలై 31 (ఎఎంఎస్) :**

ప్రశ్నపత్రాల లీకేజీ మాఫియాను పూర్తిగా అణచివేసే లక్ష్యంతోనే కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్టుపై 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఘాటుగా స్పందించారు. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల్లో 'యాంటీ పేపర్ లీక్ బిల్లు' ఆమోదం పొందిన నేపథ్యంలో, ప్రధాని మోదీ ఒక ప్రత్యేక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీనిపై దీప్కే స్పందిస్తూ.. "దేశ భవిష్యత్తును వెలిగించడం కంటే, మీ వ్యక్తిగత ప్రచారంతో మీరే ధగధగలాడిపోతున్నారు" అనేలా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కేంద్రంపై విమర్శలు తీవ్రతరం గతకొద్ది రోజులుగా కేంద్ర ప్రభుత్వంపై అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు కీలక డిమాండ్లను లేవనెత్తారు: విద్యార్థులపై వేధింపులు ఆపాలి: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వ వేధింపులను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు

## భావోద్వేగాల మధ్య మాజీ ఎమ్మెల్యే

# పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమయాత్ర


**హైదరాబాద్, జూలై 31 (వుదయం) :**





వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమయాత్ర కంటతడి పెట్టించే వాతావరణంలో కొనసాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ప్రియతమ నేతకు తుది వీడ్కోలు పలికారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. ఈ అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖ బీఆర్ఎస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని తలచుకుని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఉద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు.

ఆకస్మిక మరణం వెనుక అనారోగ్య నేపథ్యం పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి 12:50 గంటలకు సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆరోగ్య సమస్య తలెత్తిన వైనం: ఈ నెల 26వ తేదీ ఉదయం హనుమకొండలో ఉండగా ఆయనకు ఒక్కసారిగా తీవ్రమైన ఛాతీ నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల తీవ్ర శ్రమ: వైద్యులు పరీక్షించి ఆయనకు 'కార్డియాక్ అరెస్ట్' అయినట్లు నిర్ధారించారు. దాదాపు గంట పాటు శ్రమించి, తొమ్మిది సార్లు సీపీఆర్ (CPR) చేయడంతో కొద్దిగా స్పందన కనిపించింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు: మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి వెంటనే సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అంతిమంగా విషాదం: యశోద ఆసుపత్రిలో వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి అత్యవసర చికిత్స అందించినప్పటికీ, ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణించడంతో గురువారం అర్ధరాత్రి ఆయన కన్నుమూశారు. ఉద్యమ కాలం నుంచి పార్టీకి సేవ చేసిన ఒక యువ నాయకుడు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



## అమెరికా వెళ్లే విద్యార్థులకు

# ట్రంప్ పిడుగు

**హైదరాబాద్, జూలై 31 (వుదయం) :**

హెచ్1బీ వీసాదారులు, గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్న వారిపై ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా విదేశీ విద్యార్థులకు మరో పెద్ద షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అమెరికాలో విద్యాభ్యాసం పూర్తయ్యాక ఉద్యోగ అనుభవం కోసం 'ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్' చేయాలనుకునే విద్యార్థులపై ఏకంగా లక్ష డాలర్ల (సుమారు రూ.95 లక్షలు) ఫీజు విధించే ప్రతిపాదనను ట్రంప్ యంత్రాంగం తీవ్రంగా పరిశీలిస్తోందని అమెరికన్ మీడియా వెల్లడించింది.

అసలేమిటీ ఓపీటీ)? దాని ప్రాముఖ్యత ఏమిటి? ఎఫ్1 వీసాతో అమెరికాకు వెళ్లి డిగ్రీ లేదా పీజీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు.. చదువు పూర్తయ్యాక అక్కడే ఉండి తమ రంగంలో 1 నుంచి 3 ఏళ్ల పాటు పనిచేసి ప్రాక్టికల్ అనుభవం గడించేందుకు ఓపీటీ అవకాశం కల్పిస్తుంది. ముఖ్యంగా భారత్ నుంచి బీటెక్ పూర్తి చేసి.. అమెరికాలో స్టెమ్ కోర్సులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఇది ఎంతో కీలకం. స్టెమ్ విద్యార్థులు తొలి ఏడాది సంబంధిత సంస్థల్లో పనిచేసి, ఆ తర్వాత మరో రెండేళ్ల పాటు పొడిగింపు పొందుతారు. ఈ వ్యవధిలోనే వారు మెరుగైన ఉద్యోగావకాశాలు దక్కించుకుని హెచ్1బీ వీసా (H1B Visa) వైపు అడుగులు వేస్తారు.

తాజా ప్రతిపాదనలు అమలైతే.. అమెరికాలో చదువు పూర్తయ్యాక అక్కడే ఉద్యోగం చేయాలన్న విద్యార్థుల ఆశలు అడియాశలు కానున్నాయి.

**స్థానికులకే ఉద్యోగాలు.. కోర్టు తీర్పు నేపథ్యం**

విదేశీ ఉద్యోగులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్థానిక అమెరికన్లకే ఉద్యోగాలు దక్కాలనే ఉద్దేశంతో ట్రంప్ సర్కారు ఈ తరహా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో హెచ్1బీ వీసాలపైనా ఇలాగే లక్ష డాలర్ల ఫీజును ప్రతిపాదించగా, ఫెడరల్ కోర్టు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా అడ్డుకుంది. దీంతో న్యాయపరంగా ఎదురుదెబ్బ తిన్న ట్రంప్ యంత్రాంగం.. ఇప్పుడు ఓపీటీ పేరుతో కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకురావడం గమనార్హం.

**భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం**

ఈ లక్ష డాలర్ల ఫీజు ప్రతిపాదన అమలైతే అత్యంత భారీగా నష్టపోయేది భారతీయ విద్యార్థులే. పెరుగుతున్న సంఖ్య: 'ఓపెన్ డోర్స్' నివేదిక ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో 3.63 లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో నమోదయ్యారు. అమెరికాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు మనవారే కావడం విశేషం.

## తెలంగాణలో అవకాశాలు


# వైన్ టూరిజం



**హైదరాబాద్, జూలై 31 (వుదయం) :**

తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు.

అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు.



# కాంగ్రెస్ లో కుమ్ములాట వర్గ పోరు తో వెలువేతుతున్న విమర్శలు



- "కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ రెడ్డి"ల మధ్య, తీవ్ర వర్గ పోరు"
- "నాయకుల,ఆధిపత్య వర్గ పొరు,తో అయోమయం లో పార్టీ శ్రేణులు"

.కోహీర్ జులై 31 (వుదయం ప్రతినిధి ):

జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు పరాకాష్టకు చేరాయి. పార్టీ నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో కోహీర్ లో రాజకీయాలు వేడెక్కాయి.రెండు వర్గాలుగా విడిపోయిన పార్టీ. ఒకవైపు కోహీర్ మండలం,కాంగ్రెస్ పార్టీ.నాయకులు కె.ప్రసాద్ రెడ్డి వర్గం, మరోవైపు మాజీ మంత్రి,జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్. డా. ఏ.చంద్రశేఖర్ వర్గాలుగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విడిపోవడంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రకటించిన ఎన్నికల హామీలను నెరవేర్చి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో, నాయకుల మధ్య జరుగుతున్న ఈ అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా నియోజకవర్గం లోని ఆయా గ్రామ, మున్సిపల్, ప్రత్రిక, మీడియా మధ్యమిక కథనలో వచ్చిన, ఆయా సమస్యల వార్త విశేషాలను వాట్సాప్ ద్వారా పోస్ట్ చేస్తూ ప్రసాద్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు గురువారం రోజున జహీరాబాద్ మున్సిపల్ ఎం ఐ ఎం కౌన్సిలర్ భర్త మా వార్డు ఎలాంటి అభివృద్ధి కి నోచుకోలేదని మీడియా ముఖంగా తన చెప్పుతో తానే కొట్టుకోవడం లాంటి ఫోటో ను వాట్సాప్ ద్వారా పోస్ట్ చేస్తూ , కోహీర్ మండలం జహీరాబాద్ నియోజకవర్గం ప్రజల హామీలను నెరవేర్చి ,ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని,చెంద్ర శేఖర్ ను ఘాటుగా విమర్శించారు

పార్టీ శ్రేణులు ఒకరి ని ఒకరు కించపరుచుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని, ఈ అంతర్గత విభేదాలకు ముగింపు పలికి పార్టీని బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఫ్లోరోసెన్స్ గైడెడ్, రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

హైదరాబాద్/సంగారెడ్డి :వుదయం



క్యాన్సర్ చికిత్సలో రోబోటిక్ సర్జరీ, ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీ వినియోగం వల్ల శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా, సురక్షితంగా మారుతున్నాయని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి చెందిన సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డా. రాజేష్ గౌడ్ తెలిపారు.

గతంలో పెద్ద కోతలతో చేసే శస్త్రచికిత్సలను ప్రస్తుతం కేవలం 8 మిల్లీమీటర్ల చిన్న రంధ్రాల ద్వారానే నిర్వహించే అవకాశం ఈ సాంకేతికతతో లభిస్తోందన్నారు. దీనివల్ల రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. మహిళల్లో గర్భాశయ, అండాశయ క్యాన్సర్లకు రోబోటిక్ సర్జరీ ద్వారా క్లిష్టమైన ఆపరేషన్లు సురక్షితంగా నిర్వహించవచ్చని, గతంలో నాలుగు నుంచి ఐదు రోజుల ఆస్పత్రి చికిత్స అవసరమయ్యేదని, ప్రస్తుతం చాలా మంది రోగులు 24 గంటల్లోనే డిశ్చార్జ్ అవుతున్నారని వివరించారు.

రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీ ద్వారా ప్రభావితమైన సెంటినెల్ లింఫ్ నోడ్స్‌ను ఖచ్చితంగా గుర్తించి అవసరమైన వాటినే తొలగించవచ్చని తెలిపారు. దీంతో చేతి వాపు, నొప్పి వంటి సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు.

ప్రోస్టేట్, బ్లాడర్, కిడ్నీ, అడ్రినల్ క్యాన్సర్ల చికిత్సలో కూడా రోబోటిక్ సర్జరీ మెరుగైన ఫలితాలు ఇస్తోందన్నారు. ముఖ్యంగా కిడ్నీ క్యాన్సర్‌లో ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడే అవకాశం ఉందని చెప్పారు.కోలోరెక్టల్ క్యాన్సర్లలో ట్యూమర్‌ను అత్యంత ఖచ్చితంగా తొలగించడం ద్వారా అనేక సందర్భాల్లో శాశ్వత కోలోస్టమీ అవసరం లేకుండా చికిత్స చేయవచ్చని తెలిపారు. అలాగే ఛాతీ క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో కూడా చిన్న రంధ్రాల ద్వారానే ఊపిరితిత్తుల ఆపరేషన్లు నిర్వహించడం వల్ల రోగులు త్వరగా కోలుకుంటున్నారని వివరించారు.

ఫైర్‌ఫ్లై ఫ్లోరోసెన్స్ ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ టిష్యూలు, లింఫ్ మార్గాలను స్పష్టంగా గుర్తించే అవకాశం ఉందని, దీంతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా నిర్వహించవచ్చని తెలిపారు.రోబోటిక్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీల వల్ల తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, ఆస్పత్రిలో తక్కువ రోజులు ఉండడం, త్వరగా సాధారణ జీవితానికి చేరుకోవడం, మెరుగైన జీవన నాణ్యత వంటి ప్రయోజనాలు రోగులకు లభిస్తున్నాయని డా. రాజేష్ గౌడ్ పేర్కొన్నారు.

# గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



- ఆగస్టు 2 నుండి 18 వరక బస్సు యాత్ర

మెదక్ జిల్లా- అల్లదుర్గం / జులై 31(వుదయం ప్రతినిధి)

ఈరోజు అల్లాదుర్గం మండల కేంద్రంలో మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుండి 18 వరకు నిర్వహించే అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ ను . కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్. అల్లాదుర్గం సర్పంచ్ సౌమ్య సురేష్ గౌడ్. మాజీ ఎంపీటీసీ జోగినాథ్ గౌడ్. మాజీ ఎంపీటీసీ రామ గౌడ్. మెదక్ జిల్లాసంగంఉపాధ్యక్షులు సాయిలు గౌడ్. సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటేశం గౌడ్ సాయ గౌడ్ గార్ల ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెన్షన్ 4 వేలకు పెంచాలని ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు పెంచుతామని చెప్పిన దానిని అమలు చేయాలన్నారు.50 సంవత్సరాలు నిండినవారందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రతి సొసైటీకి 560 జీవో ప్రకారం ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని.

ప్రమాదాల నివారణకు వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 18 వరకు ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం ప్రతిష్టించాలని అన్నారు. ఆగస్టు 2న మానుకోటలో ప్రారంభమై అన్ని జిల్లాలు తిరుగుతూ. ఆగస్టు 13వ తేదీన సంగారెడ్డి జిల్లా మీదుగా. అల్లాదుర్గం పెద్ద శంకరంపేట్. నిజాంపేట్ మీదుగా బాన్సువాడ బోధన్ నిజాంబాద్ జిల్లాలోకి వెళుతుందని ఇలా అన్ని జిల్లాలు తిరుగుతూ 18వ తేదీ కిలాషాపూర్ కోటలో సభ నిర్వహించి అక్కడనుండి హైదరాబాద్ ట్యాంక్ బండ్ వరకు యాత్ర కొనసాగి ముగుస్తుందని ఆయన అన్నారు. ఈ యాత్రను గౌడ సోదరులు కల్లుగీతా కార్మికులు శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# గూడూరు శ్రీ గురు పీఠంలో చోరీ

- రెండు ఆలయాల హుండీలు పగులగొట్టి నగదు అపహరణ....
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం సిబ్బంది

వుదయం న్యూస్ శివ్వంపేట, జూలై 31....



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలోని శ్రీ గురు పీఠంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. రెండు ఆలయాల హుండీలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును అపహరించి పరారయ్యాడు.

శుక్రవారం ఉదయం ఆలయ కార్యనిర్వహకుడు సత్యనారాయణ గౌడ్ దేవాలయానికి వచ్చి పరిశీలించగా డోర్లు, హుండీలు పగులగొట్టిన విషయం గుర్తించాడు. వెంటనే ఆలయ చైర్మన్ శివకుమార్ గౌడ్‌కు సమాచారం అందించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మధుకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను సేకరించింది. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలించారు. ఈ ఘటన పై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్వామీజీ నీ దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న దంపతులు



వుదయం న్యూస్ శివ్వంపేట జులై 31.....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ పెద్దగోని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు నేడు.విశ్వయోగి విశ్వంజీ గుంటూరు విశ్వమందిరం పీఠాధిపతులను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం గురూజీ గురించి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ .విశ్వయోగి విశ్వంజీ ఆధ్యాత్మిక గురువు విశ్వయోగి విశ్వంజీ స్వామి ఒక ఆధ్యాత్మిక గురువుగా ప్రసిద్ధి పొందిన వ్యక్తి. ఆయన బోధనల్లో ఆత్మజ్ఞానం, ధ్యానం, యోగ సాధన, మానవ విలువలు ప్రధానంగా కనిపిస్తాయి. మనసుశరీరం ఆత్మల సమన్వయం ద్వారా వ్యక్తిగత అభివృద్ధి సాధ్యమని ఆయన బోధనల సారాంశం. ముఖ్యంగా ఆధ్యాత్మిక దృష్టికోణం: అంతర్గత శాంతి, స్వీయ అవగాహన, సద్గుణాల పెంపకం. యోగ & ధ్యానం: నియమిత ధ్యానం, శ్వాసాభ్యాసం ద్వారా మనోస్థైర్యం పెంపొందించడం. మానవతా విలువలు: సత్యం, అహింస, కరుణ, సేవాభావం. బోధనలు: వ్యక్తి తనలోని శక్తిని గుర్తించి, సమాజానికి ఉపయోగపడే జీవితం గడపాలనే సందేశం. సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, శిబిరాలు, ధ్యాన శిక్షణ కార్యక్రమాల ద్వారా అనేక మందికి మార్గదర్శనం చేసినట్లు పేర్కొనబడుతుంది. వారు వివరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన



కొడంగల్. వికారాబాద్ డిస్టిక్ వుదయం:

కొడంగల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్. శ్రీనివాస రాజు గారు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ గారు పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, భక్తులకు కల్పించనున్న సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించి, పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందరం ప్రశాంత్ గారు, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజు గారు, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ వసంత్ నాయక్ గారు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఇంజనీర్లు, పనుల నిర్వాహకులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ఆదేశించారు.

# చెట్టు కూలి విద్యుత్ పోల్ విరగడంతో ముగ్గురికి గాయాలు

- విద్యుత్ లైన్ ట్రిప్ కావడంతో తప్పిన పెను ప్రమాదం.....

వుదయం న్యూస్ శివ్వంపేట, జూలై 31 .....



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం కురిసిన గాలివానకు గ్రామానికి చెందిన ఎంచర్ల కృష్ణ వ్యవసాయ పొలంలో చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ ఘటనలో పొలంలో పనిచేస్తున్న ఎంచర్ల కృష్ణ, ఎంచర్ల కొమురమ్మ, మాసంగారి శైలజలు గాయపడ్డారు. సర్పంచ్ గునంగారి రాజు, స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా వారు చికిత్స తీసుకుంటున్నారు. చెట్టు విద్యుత్ వైర్లపై పడిన వెంటనే విద్యుత్ లైన్ ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ షాక్ ప్రమాదం నుంచి కూలీలు తృటిలో తప్పించుకున్నారు. ఘటన స్థలానికి విద్యుత్ శాఖ సిబ్బంది చేరుకొని పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ లైన్ల సమీపంలోని ప్రమాదకరమైన చెట్లను ముందస్తుగా తొలగించి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గునంగారి రాజు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మ్యానంగారి సంజీవ్ కుమార్. మల్లేష్ యాదవ్. వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సేవలే శాశ్వత సంతకం

- ఉద్యోగ విరమణతో బాధ్యతలకు ముగింపు.. సేవలకు కాదు
- ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషితకు ఘన వీడ్కోలు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రశంస

గద్వాల జూలై 31 (వుదయం బ్యూరో)



జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వ అధికారుల అంకితభావంతో కూడిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఉద్యోగ విరమణ అనేది కేవలం పదవీకాలానికి ముగింపేనని, సమాజానికి చేసిన సేవలకు మాత్రం ముగింపు ఉండదని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకురాలు (ఈడీ), జిల్లా సంక్షేమ శాఖ అధికారి నుషిత ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన అభినందన, సన్మాన సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల్లో నుషిత విశేష సేవలు అందించారని ఆయన కొనియాడారు. ఎస్సీ సంక్షేమ శాఖతో పాటు మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిగా అదనపు బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించారని ప్రశంసించారు. నిబద్ధత, నిజాయితీ, బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులు ప్రభుత్వ యంత్రాంగానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఉద్యోగ జీవితంలో సాధించిన అనుభవం, సేవాభావం సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని పేర్కొంటూ, నుషిత శేష జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. జిల్లా అధికార యంత్రాంగం తరపున ఆమెకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కలెక్టర్ నుషిత దంపతులను శాలువా కప్పి, జ్ఞాపిక, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, సర్వే ఏడీ నూకరాజు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, డీపీఓ శ్రీకాంత్, డీఐఈఓ హృదయ రాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ కొలువే లక్ష్యం

- గద్వాల యువతకు 'బీకేఎంఆర్' అభయం!
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చొరవ: ఆగస్టు 5 నుంచి ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్

గద్వాల జూలై 31 (వుదయం బ్యూరో)



నెత్తిన టోపీ, భుజాలపై నక్షత్రాలు, ఒంటిపై ఖాకీ దుస్తులు ధరించి సమాజానికి సేవ చేయాలనేది ప్రతి పేద, మధ్య తరగతి యువకుడి స్వప్నం! ఆ కలను నిజం చేస్తూ, పోటీ పరీక్షల పోరులో గద్వాల నియోజ కవర్గ యువతను విజేతలుగా నిలిపేందుకు బీకేఎంఆర్ అధ్యయన కేంద్రం సమర శంఖం పూరించింది. స్థానిక శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నేతృత్వంలో ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. ఆగస్టు 5వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఈ బృహత్తర కార్యక్రమం అధికారికంగా ప్రారంభం కానుంది. అనుభవజ్ఞుల బోధన.. గెలుపే ధ్యేయంగా పక్కా వ్యూహం!పోటీ పరీక్షల రణరంగంలో అభ్యర్థులను ముందంజలో ఉంచేలా నిర్వాహకులు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. రాష్ట్రస్థాయిలో సుదీర్ఘ అనుభవం కలిగిన సబ్జెక్ట్ నిపుణులతో సమగ్ర బోధన అందించనున్నారు. మారుతున్న పరీక్షల ధోరణికి అనుగుణంగా నూతన సిలబస్‌పై పట్టు సాధించేలా ప్రత్యేక మెళకువలు, ప్రతిరోజూ సాధన పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నూరుశాతం నింపి, విజేతలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ శిక్షణ సాగనుంది. శిక్షణ కేంద్రం సమాచారం: వేదిక: వాసవి కళ్యాణ మంటపం, సాయి కృప ఆసుపత్రి సమీపంలో, కొత్త బస్సు నిలయం ఎదురుగా, గద్వాల. వేళలు: ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు.లక్షలాది రూపాయలు వెచ్చించి నగరాల్లో కోచింగ్ తీసుకోలేని పేద అభ్యర్థులకు ఈ శిబిరం ఒక సంజీవని వంటిదని, గద్వాల నియోజకవర్గ యువతీ యువకులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ సాధనలో విజయకేతనం ఎగరవేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# సదాశివపేటలో ఘనంగా మున్నూరు కాపు సంఘం బోనాల ఊరేగింపు



- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చింత సాయినాథ్

సదాశివపేట వుదయం

సదాశివపేట పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు డప్పు చప్పుళ్లు, సాంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చింత సాయినాథ్ భక్తులతో కలిసి ఉత్సాహంగా చిందులు వేస్తూ బోనాల సంబరాల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చీల మల్లన్న , నగేష్, రాజు, పవన్ మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖాకీకి నిండైన ఖ్యాతి.. నాలుగు దశాబ్దాల 'కలంక రహిత' కాంతి!

- ఏఆర్ ఎస్సై ఆంజనేయులుకు జిల్లా పోలీసు శాఖ నీరాజనం
- 40 ఏళ్ల ప్రస్థానంలో ఒక్క మచ్చ పడని 'మహా సేవ'
- ఆయన క్రమశిక్షణే వ్యవస్థకు ఆదర్శం: ఎస్పీ టి. శ్రీనివాసరావు


గద్వాల, జూలై 31 (వుదయం బ్యూరో)



శాంతిభద్రతల రక్షణే ధ్యేయంగా, సమాజ శ్రేయస్సే ఊపిరిగా నాలుగు దశాబ్దాల పాటు సాగిన ఒక నిష్కళంక సేవా సమరానికి గద్వాల నేల ఘనంగా వీడ్కోలు పలికింది. ప్రతికూలతలను తట్టుకుని, సవాళ్లను అధిగమించి ఖాకీ చొక్కాపై ఒక్క మచ్చ పడకుండా 40 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఏఆర్ ఎస్సై టి. ఆంజనేయులు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా గురువారం ఆయనకు 'రాజసం ఉట్టిపడేలా' వీడ్కోలు సత్కారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఐపీఎస్, ఆంజనేయులును పూలమాలలతో ముంచెత్తి, జ్ఞాపికతో సత్కరించి నిండు మనస్సుతో అభినందించారు. మచ్చ లేని రికార్డు.. మహోన్నత నిబద్ధత! ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అంటే కేవలం డ్యూటీ చేయడం కాదు, పగలు రాత్రి తేడా లేకుండా సమాజ రక్షణ కోసం కరిగిపోయే ఒక యజ్ఞమని వ్యాఖ్యానించారు. 40 ఏళ్ల సర్వీసులో ఒక్క నెగెటివ్ రిమార్క్ కూడా రానివ్వకుండా బాధ్యతలను నిర్వర్తించడం సామాన్యమైన విషయం కాదని, ఆంజనేయులు నిబద్ధత ప్రతీ ఒక్క పోలీసు అధికారికి కంటికి రెప్పలాంటి మార్గదర్శకమని స్పష్టం చేశారు. 2019లో ఏఆర్ ఎస్సైగా పదోన్నతి పొంది జిల్లాకు అందించిన సేవలు చిరస్మరణీయ మని కొనియాడారు. శాఖతో అనుబంధం శాశ్వతం! ఉద్యోగ విరమణ అనేది కాగితాల వరకేనని, పోలీసు శాఖ కుటుంబంతో ఆంజనేయులు అనుబంధం ఎప్పటికీ చెక్కు చెదరదని ఎస్పీ ధీమా ఇచ్చారు. శేష జీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడుపుతూ, యోగా, వ్యాయామాలతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం వీడ్కోలు పొందిన ఆంజనేయులు భావోద్వేగానికి లోనవుతూ.. తనకు అడుగడుగునా తోడ్పడిన ఉన్నతాధికారులకు, సహచర సిబ్బందికి, శ్రమను పంచుకున్న కుటుంబానికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గంభీర కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, ఏఆర్ డీఎస్పీ నరేందర్‌రావు, ఏఓ పి. సాయి కృష్ణలతో పాటు పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని ఆంజనేయులుకు వీడ్కోలు పలికారు.

# భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ ఊరడమ్మ అమ్మవారు

జహీరాబాద్, జూలై 31 (వు దయం )



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడిలో వెలసిన శ్రీ ఊరడమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించారు.కూరగాయలు, ఆకు కూరలు, వంకాయలు, బెండకాయలు, మిరపకాయలు, క్యాబేజీ, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, పూలతో ప్రత్యేకంగా చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

శాకాంబరి దేవి అలంకరణ ప్రకృతి సంపద, వ్యవసాయాభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, సమృద్ధికి ప్రతీకగా భావిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పి.శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సిద్దు రవి, పాండు, ఫవాన్, సుధాకర్, నాగరాజు, విక్రమ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# యువశక్తే బీఆర్ఎస్‌కు బలం

- ప్రజా సేవలో యువత ముందుండాలి.
- పార్టీ బలోపేతంలో యువత పాత్ర కీలకం.
- మావురం. రాజుకు జన్మదిన శుభాకాంక్షలు శుభాకాంక్షలు.
- బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి



మెదక్ జిల్లా వుదయం బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువతే ప్రధాన శక్తి అని, ప్రజా సేవే యువ నాయకుల లక్ష్యంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మావురం రాజుతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి పార్టీ కోసం ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో మావురం రాజు చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.యువశక్తి చైతన్యంతోనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్న ఆయన.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని యువతకు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, మావురం రాజు పార్టీకి, ప్రజలకు మరింత విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తే బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మావురం రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ పిఎసిఎస్ చైర్మెన్ పప్పుల బాపురెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి,ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మెన్ బాలాగౌడ్, పాపన్నపేట్ మాజీ మార్కెట్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కొత్తూరి. శ్రీనివాస్ బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు గంజి నవీన్,రాజక్పల్లి సర్పంచ్ కనకరాజు, నాయకులు సాంగు స్వామి, రవి సెట్, మోహన్ రెడ్డి, నరేందర్, పరిశరములు, మధవత్ రాజు,వార్డు మెంబర్ పంపర నగేష్, నాస్కల్ ఏలం యాదవ్, బన్నీ, సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రాయితీలు అందించాలి



- ఉద్యాన, కూరగాయలు, ఆయిల్ పామ్‌పై అవగాహన పెంచాలి

నాగర్‌కర్నూల్, జులై 31 (వుదయం ప్రతినిధి) :

వ్యవసాయ, ఉద్యాన శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో అధికారులతో పాటు మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు సమాచారం అందించడానికి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రతి ఏ.ఈ.ఓ తమ పరిధిలో 100 ఎకరాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించాలని, కూరగాయల సాగుకు ఎకరాకు 3000 నుండి 5000 రూపాయల వరకు రాయితీ ఉందని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం ఉండరాదని, ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, ఉద్యాన అధికారి వెంకటేశం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## దుర్గమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**అమీన్పూర్**

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ ఏడుపాయల దుర్గమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవం, బోనాల కార్యక్రమంలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, దర్శన్, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సీఐ, ఎస్ఐలకు సన్మానం

**.పోలీసుల సేవలు సమాజానికి ఆదర్శం**
**– బండామీది వెంకటేష్ యాదవ్**
**.చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వక సత్కారం**

**శంకర్‌పల్లి, జులై 31 (వుదయం)**



చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని పోలీసు స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ నరేందర్ రెడ్డి, ఎస్ఐ కోటేశ్వర్ రావులను చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు, శంకర్‌పల్లి మండలం మొకిల గ్రామానికి చెందిన బండామీది వెంకటేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జ్ఞాపికను బహుకరించి నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడగా, పలువురు స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు హాజరై నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బండామీది వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, మొకిల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ కోటేశ్వర్ రావు ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ ఎంతో సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. ముఖ్యంగా మద్యపాన నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ అందరికీ ఆదర్శంగా నిలిచిందని అన్నారు.అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ నరేందర్ రెడ్డి నాయకత్వంలో పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ చట్టాన్ని కాపాడే పోలీసు అధికారులు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, యువతను మంచి మార్గంలో నడిపించే కార్యక్రమాల్లో పోలీసులు మరింత ముందుండాలని ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు.చివరగా బండామీది వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, ఎస్ఐ కోటేశ్వర్ రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, సీఐ నరేందర్ రెడ్డి తన కొత్త బాధ్యతల్లో విశేష విజయాలు సాధించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఇద్దరు అధికారులు మంచి ఆరోగ్యంతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేసే పోలీసు అధికారులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఇలాంటి సత్కారాలు పోలీసు సిబ్బందికి మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు.

## యువ కాంగ్రెస్ భారీ నిరసన



**.ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని ఖండించిన యూత్ కాంగ్రెస్.. కేంద్ర హోంమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్**
**.'రీజైన్ అమిత్ షా' బ్యానర్‌తో పత్తేపూర్ బ్రిడ్జిపై ఆందోళన.. శంకర్‌పల్లిలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన**

**శంకర్‌పల్లి, జులై 31 (వుదయం):**

శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలోని పత్తేపూర్ బ్రిడ్జిపై "రీజైన్ అమిత్ షా" అనే భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొనింటి శశికాంత్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా జరిగిన ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల పారదర్శకతను కాపాడడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.ఢిల్లీలో నీట్ పరీక్ష పత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడాన్ని చందిప్ప గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తర్‌పల్లి భరత్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి విద్యార్థికి ఉందని, అలాంటి పరిస్థితుల్లో పోలీసుల ద్వారా ఆందోళనలను అణచివేయడం సరికాదన్నారు. ఈ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీలు కూడా నీట్ పరీక్ష పత్రం లీకేజీ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నాయని నాయకులు తెలిపారు. శంకర్‌పల్లి నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్, చందిప్ప గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తర్‌పల్లి భరత్, మహాలింగాపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్, హాజర్, రాజు, కార్తిక్ తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పారదర్శక చర్యలు తీసుకోవాలని వారు కోరారు

## చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డిని పరామర్శించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**శివసేన రెడ్డి, పామేన భీమ్ భరత్‌తో పాటు కాంగ్రెస్ నేతల నివాళి**

**చేవెళ్ల, జూలై31(వుదయం)**

షాబాద్ మండల కేంద్రంలోని శుక్రవారంతెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిల మాతృమూర్తి పట్నం రుక్కమ్మ ఇటీవల మృతి చెందడంతో,టీపీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర చైర్మన్ శివసేన రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ షాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు,మండల అధ్యక్షుడు పెంటరెడ్డి, షాబాద్ మాజీ సర్పంచ్ రవీందర్, సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ రాహుల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, మల్లేష్,బాలరాజు, మండల సీనియర్ నాయకులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రక్త నమూనాల సేకరణపై అవగాహన



**గుమ్మడిదల, జూలై 31(వుదయం):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రక్త నమూనాల సేకరణ, రక్త వర్గీకరణ (బ్లడ్ గ్రూపింగ్) ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్త నమూనాలు ఎలా సేకరిస్తారు, రక్త వర్గాన్ని ఎలా నిర్ధారిస్తారనే అంశాలను ల్యాబ్ టెక్నీషియన్ మీనా కుమారి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి, నిధుల మంజూరుకు కృషి చేస్తాం...



**కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, జులై 31,(వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ పరిధి లోని రాజీవ్ గృహకల్ప లోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాజీవ్ గృహకల్పలో జరగనున్న బోనాల మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు హన్మంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, కుమార్ రెడ్డి, రాంచందర్ నాయక్, రమణ, ప్రభాకర్ రెడ్డి, కూరగాయల శివ, వారికుప్పల దశరథ్, తోట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులు



**ప్రగతినగర్, జులై 31,(వుదయం ప్రతినిధి ),**

బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మలిదశ తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన నరసంపేట మాజీ శాసన సభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులురంగరాయ ప్రసాద్, ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఅర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగతి నగర్ సెంటర్ లోని తెలంగాణ ఉద్యమ స్తూపం వద్ద వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా అశ్రునివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు అని వారి సేవలు చిరస్మరణీయం అని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ఎంసి కార్పొరేటర్లు బాలాజీ నాయక్, బిఅర్ఎస్ పార్టీ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాంబా శివారెడ్డి, సీనియర్ నాయకులు చంద్రయ్య, రాంనర్సయ్య, బిక్షపతి, ముత్యాలు, మహిళా నాయకులు పద్మావతి, భారతి, స్వర్ణ కుమారి, సుకన్య, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీటీ ఉపాధ్యాయుల జిల్లా సమ్మేళనానికి ఘన ఏర్పాట్లు





**ఉపాధ్యాయుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు**

**చేవెళ్ల, జూలై31(వుదయం)**

ఎస్‌జీటీ యూనియన్ రంగారెడ్డి జిల్లా సమ్మేళనం ఆగస్టు 2 (ఆదివారం) న చేవెళ్లలోని శ్రీ సాయి చైతన్య హైస్కూల్‌లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, సంఘ బలోపేతం, విద్యా రంగ అభివృద్ధికి హాజరై సంఘ ఐక్యతను చాటుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సమ్మేళనానికి హాజరయ్యే ఉపాధ్యాయులందరికీ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డి,గణేష్ డిస్టిక్ ప్రెసిడెంట్ ఎం, శ్రీనివాస్ డిస్టిక్ జనరల్ సెక్రెటరీ

## ముషీరాబాద్ డిపోలో ఉత్తమ ఉద్యోగులకు 'ప్రగతి చక్రం' అవార్డులు ప్రదానం



**ముషీరాబాద్, జూలై 31(వుదయం)**

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ, డిపోకు అత్యధిక ఆదాయం సమకూర్చిన ఉద్యోగులను ప్రోత్సహించే ఉద్దేశంతో ముషీరాబాద్ ఆర్టీసీ డిపోలో 'ప్రగతి చక్రం' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముషీరాబాద్ డిపో మేనేజర్ జె. విజయ్ ఆధ్వర్యంలో జరిగింది. డిపో అభివృద్ధికి విశేషంగా కృషి చేసి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లను ఎంపిక చేసి సన్మానించారు. ఈ సందర్భంగా పి. ఇందిర, ఎం. రేణుక, ఎన్. సువర్ణ, కె. బాలాజీ, ఎం. శ్రీనివాసులు, ఎన్.వి. నర్సింలు, కె.ఎస్. రావు, జి. సంధ్య, బి. రాధమ్మ, పి. కవిత, వై. స్వప్న, టి.ఎస్. గౌడ్, బి. ఆంధ్రావేణిలకు డిపో మేనేజర్ జె. విజయ్ శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రాలతో పాటు నగదు పారితోషికాలను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ జె. విజయ్ మాట్లాడుతూ, ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మెరుగైన పనితీరు కనబర్చేందుకు ప్రేరణ లభిస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించి డిపో అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

## తలసాని చేతుల మీదుగా ఐస్‌క్రీమ్ షాప్





**ముషీరాబాద్, జూలై 31(వుదయం)**

"యువత వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయం. ఉపాధి అవకాశాలను సృష్టించే ఇటువంటి సంస్థలు మరింత అభివృద్ధి చెందాలి" అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని భాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కళాశాల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌వీ ఐస్‌క్రీమ్ అండ్ స్వీట్ షాప్ను శుక్రవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు, ఉత్తమ సేవలు అందిస్తూ వారి విశ్వాసాన్ని సంపాదించాలని నిర్వాహకులకు సూచించారు. నిబద్ధతతో వ్యాపారాన్ని నిర్వహిస్తే ప్రజల ఆదరణతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, వ్యాపారవేత్తలు, యువకులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వ్యాపార సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

**IN THE COURT OF THE HON'BLE IIADDL. CHIEF JUDG:CITY CIVIL COURT. AT HYDERABAD**
**O.S. No. 418 Of 2025**

***Between:***
P.M. Sai Prasad Aged: 35 years, Occ: Philanthropist, R/o H No 1-5-84, Gangaputhra Colony, Old Alwal, Secunderabad-10.
**.... Plaintiff**
**AND**
E.N. Ravi & others
**.....Defendants**

To,
1. KR TV, Telugu Digital Media. Office. No. 7-1, Srinivas Nagar, Ameerpet, Hyderabad -38.
2. Kranthi Sandepalli, S/o. Not known to Plaintiff, Aged Major, Occ: TV Presenter and Director, Office. No. 7-1, Srinivas Nagar, Ameerpet, Hyderabad-38.
**(Defendants 12 & 13)**

Please take notice that Mr. P.M. Sai Prasad has filed O.S. No. 418 of 2025 on the file of Hon'ble II Addl. Chief Judge, City Civil Court, Hyderabad, seeking damages against and 2 of you and others. Please take notice that the said case is posted to 17-08-2026 and 1 and 2 of you are called upon to appear before the Hon'ble court at 10-30 A.M. in person or through your Counsels. Otherwise the Hon'ble Court would pass appropriate Orders.

***[By ORDERS OF THE HON'BLE COURT]***

***sd/-***
***C.V. NARAYAN RAO, ADVOCATE***
***COUNSEL FOR PLAINTIFF***
***Rlat No. 303, 4th floor***
***Laxminilayam***
***Narayanguda, Hyderabad***

**IN THE COURT OF THE HON'BLE XVII th SENIOR CIVIL JUDGECITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. No.681 OF 2026**

Between:
1. Marripalapu Nirguna vani, W/o.Late Marripalapu Venkateshwara Rao,R/o.H.No.17-1-338-7-B,Road No.1,Laxmi nagar Colony,Saidabad,Hyderabad.
2. Marripalapu Rrama Rao,S/o. Late Marripalapu Venkateshwara Rao
3. Moolinti Venkata Seshakumari, W/o.Moolinti Rangappa Murali
4. Marripalapu Balavenkata Bhanu Prakash,S/o. Late Marripalapu Venkateshwara Rao
**.... PLAINTIFFS**
**AND**
1. The Tahsildar, Saidabad Mandal
2. All concerned
**...Defendants**

ITo,
ALL CONCERNED
Please take notice that the above-named Plaintiffs filed the above Suit for declaration to declare them as legal heirs of the deceased viz., **Late Marripalapu Venkateshwara Rao,** before the above Hon'ble court, bearing O.S. No.681 of 2026. If any person or persons having any objection for such declaration in respect of legal status of the Plaintiffs, such person or persons are hereby requested to appear before the Hon'ble Court either in person or through an Advocate with such objections if any on at 31-08-2026 at 10:30 A.M., failing which the matter will be heard and decided as per law.

**[BY ORDER OF THE HON'BLE COURT]**

**sd/-**
**Mrs. N.MALATHI NAIDU, ADVOCATE**
**#C-106,Vamshi Enclave,Snehapuri Colony,Borabanda,Hyderabad**




## లీకు మాఫియాను తుదముట్టిస్తాం

"'విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న లీకు మాఫియాను తుదముట్టిస్తాం. లీకు గ్యాంగుల ఆటకట్టించటమే కొత్త చట్టం లక్ష్యం. జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించటం కూడా ఇప్పటి నుంచి శిక్షార్హమే అవుతుంది. జాతీయ గీతం జనగణమణతో సమానంగా వందేమాతరాన్ని కూడా పరిగణించాల్సిందే. ఉల్లంఘించిన వారికి మూడేండ్లపాటు జైలు శిక్ష పడుతుంది. మళ్లీ మళ్లీ అదే నేరాన్ని చేస్తే ప్రతీసారి కనీసం ఏడాది చొప్పున శిక్ష పడుతుంది. ఇప్పటి వరకు జనగణమణ విషయంలో మాత్రమే ఈ శిక్షలు ఉండేవి."

- నరేంద్ర మోడీ, ప్రధాన మంత్రి

## వే'మన'పద్యం

తమకుగల్గు పెక్కు తప్పులునుండగా
ఓగు నేరమెంచు నొరులగాంచిచక్కి
లంబుగాంచి జంతిక నగినట్లు
విశ్వదాభిరామ! వినురవేమ!!



## సంపాదకీయం

# అసమర్థ పాలనతో అభాసుపాలు

నీట్ లీకేజీ ఉదంతం, కాక్రోచ్ ఉద్యమం, యువత ఆగ్రహం, విద్యామంత్రి రాజీనామా వెరసి కేంద్ర ప్రభుత్వానికి నిద్ర పడుతున్నట్టు లేదు. మొన్నటివరకు జంతర్‌మంతర్ కేంద్రంగా పోరాడిన విద్యార్థులపై లాఠీలు ఝులిపించి, టియర్‌గ్యాస్‌లతో బెదిరించి, పెల్లెట్ గన్స్ ప్రయోగించి పోరాటాన్ని అణచివేయాలనుకున్న మోడీ సర్కార్‌కు అది సాధ్యపడకపోగా అసమర్థ పాలనతో దేశమంతా అభాసుపాలైంది. అయితే, ఇప్పుడు ఆ యువజన ఉద్యమంలో కీలకపాత్ర ఎవరిదన్న కోణంలో వేట మొదలు పెట్టింది. నీట్ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చెలరేగిన ఆగ్రహాన్ని ఎదుర్కోలేక, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు దిగడం కేంద్ర ప్రభుత్వ అసహనానికి నిదర్శనం. మొన్న ఢిల్లీలోని సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలోకి పోలీసు యంత్రాంగం అక్రమంగా చొరబడింది. యూనిఫాం లేదు, నేమ్‌బోర్డు లేదు, సివిల్ డ్రస్సుల్లో ప్రయివేటు వాహనాల్లో వచ్చి ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి, జేఎన్‌యూ ఎస్‌యూ మాజీ అధ్యక్షురాలైన ఐషీ ఘోష్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో వారు అక్కడినుంచి వెనుదిర గాల్సి వచ్చింది. అయితే ఢిల్లీ ఉద్యమానికి సంబంధించి విద్యార్థులు, యువతపై కేసులు పెట్టకూడదని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.ఇందులో ఏమీ చేయలేమనుకున్న ప్రభుత్వం ఐదేండ్ల నాటి కేసును తిరగదోడింది. కొన్ని నెలల క్రితం పాటియలా హౌస్‌కోర్టు జారీచేసిన నాన్ -బెయిలబుల్ వారెంట్‌ను చూపి ఐషీని అరెస్టు చేసి తీహార్ జైల్లో నిర్బంధించేందుకు కుట్ర పన్నినట్టు తెలుస్తోంది! ఆమె చేసిన తప్పేంటి? ప్రశ్నించడం నేరమా? విద్యా వ్యవస్థలో జరిగిన అక్రమాలను నిలదీయడం దేశద్రోహమా? పేపర్ లీక్ చేసిన వారిని వదిలేసి, పరీక్షల విశ్వసనీయత దెబ్బతింది. నిరాశ నిస్పృహలకు లోనై కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారితనం కొరవడింది. పరీక్షా నిర్వహణ సంస్థ తీరు అసంతృప్తిని రగిల్చింది. ప్రధాని మౌనవ్రతమే జవాబైంది. బాధ్యత వహించాల్సిన మంత్రి సీటు వదులుకోవడానికి ససేమిరా అన్నాడు. దీంతో దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసనబాట పట్టాయి. కాక్రోచ్ ఉద్యమం కూడా ఈ ఆవేదనకు ప్రతీకగా నిలిచింది. ఇదంతా నాణానికి ఒకవైపు అయితే, ఇప్పుడు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు, ఇప్పుడు వారినే నిందితులుగా చిత్రీకరించే పనిలో పడటం బాధాకరం.మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్రజాస్వామ్య దేశంలో ఒక చారిత్రక వారసత్వ గుర్తింపు పొంది, కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చిన ఒక జాతీయ పార్టీ కార్యాలయంలోకి తగిన చట్టపరమైన ప్రక్రియలను ఉల్లంఘిస్తే పోలీసులు ప్రవేశించడం అత్యంత ప్రమాదకర ధోరణి. ప్రజా సమస్యలపై ఉద్యమించడం రాజ్యాంగం కల్పించిన హక్కులు. విద్యార్థి ఉద్యమాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో కీలక పాత్ర పోషించాయి. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి అత్యవసర పరిస్థితి వరకు, విద్య హక్కు నుంచి సామాజిక న్యాయం వరకు అనేక ప్రజా ఉద్యమాల్లో విద్యార్థులు ముందున్నారు. అలాంటి ఉద్యమాలను కేసులతో అణచివేయాలని చూడడం చరిత్రను తిరస్కరించడమే.కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా విమర్శించే ప్రతి వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటోందనే విమర్శలు పెరుగుతున్నాయి.రైతుల ఉద్యమం, కార్మిక సంఘాల నిరసనలు, విద్యార్థుల ఆందోళనలు, జర్నలిస్టులపై కేసులు, సామాజిక కార్యకర్తల అరెస్టులు- ఈ పరిణామాలన్నీ విభిన్న అభిప్రాయాలను అణచివేసే ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. ఇప్పుడు విద్యార్థి ఉద్యమాలపై కూడా అదే విధానాన్ని అమలు చేయడం ఆందోళన కలిగించే విషయం.ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, లోపాలపై చర్చ జరగకుండా, ప్రశ్నించిన వారిపైనే దృష్టిపెట్టడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ముందు నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు రోడ్డెక్కడానికి కారణమెవరు? పరీక్షల విశ్వసనీయత దెబ్బతినడం, వరుస లీకేజీలు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడడం-ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాలే. వీటికి బాధ్యత వహించాల్సిన కేంద్రం, వాటిపై ప్రశ్నించిన విద్యార్థులను నిందితులుగా నిలబెట్టడం ద్వారా తన బాధ్యత నుంచి తప్పించుకోలేదు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు విమర్శలను భరించే సంస్కారం అవసరం. కేసులు, అరెస్టులు, పోలీసు వేధింపులు సమస్యలకు పరిష్కారం కావు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడం ప్రభుత్వ బాధ్యత. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి రాజకీయ కక్షతో వ్యవహరిస్తే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# "విత్తన" ప్రతిపాదనకు నో....




అంర్జాతీయ విత్తన ఒడంబడికకు 2025-నవంబర్ 24 నుంచి 29 వరకు పెరూ దేశంలోని లిమాలో జరిగిన 11వ పాలక మండలి సమావేశంలో వర్కింగ్ గ్రూపు ప్రతిపాదించిన సవరణల ముసాయిదాపై చర్చ జరిగింది. ఈ సవరణలను ప్రపంచ రైతు కూటమి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఒక దేశం యొక్క వ్యవసాయ వారసత్వాన్ని లేదా జన్యుపరమైన వనరులను ఇతర దేశాలకు ఇచ్చిపుచ్చుకోవటానికి ఎటువంటి నియమ నిబంధనలు పాటించా లో నిర్ణయించేందుకు ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ ( ఎఫ్ ఏ ఓ ) అంతర్జాతీయ ఒడంబడికను 2002లో కుదిర్చింది. దాని పేరే యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ ట్రీటీ ప్లాంట్ జనటిక్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్. ఈ ఒడంబడికపై భారత్ సహా 154 దేశాలు సంతకాలు చేశాయి. 2004 నుంచి ఈ ఒడంబడిక అమల్లోకి వచ్చింది. దీన్ని సభ్య దేశాలన్నీ విధిగా పాటించాలి. దీని ప్రభావం వారసత్వ మేధా హక్కులపై గణనీయంగా ఉంటుంది. 64 రకాల విత్తనాలు, మొక్కలు, వంగడాలు దీని పరిధి లోకి వస్తాయి. ప్రపంచంలో ఈ పంటలకు సంబంధించిన 70 లక్షలకు పైగా విత్తనాల నమూనాలు అంతర్జాతీయ స్థాయిలో విత్తన నిధుల్లో అందుబాటులోకి వచ్చాయి. ఈ విత్తనాలను ఉపయోగించుకుని సరికొత్త వంగడాల తయారీపై 28 వేలకు పైగా విత్తన సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి. వీటిల్లోని బేయర్, కోర్టెవా, సిజెంటా, బి ఎ ఎస్ ఎఫ్ కంపెనీలు విత్తన రంగంపై ఆధిపత్యం చలాయిస్తున్నాయి. విత్తనం ప్రకృతి మనుగడకు, ఆహార భద్రతకు, వ్యవసాయానికి, విత్తనంపై రైతుల సాంప్రదాయ పారంపర్య హక్కులకు మూలాధారం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ప్రత్యేక విత్తనాలు, వంగడాలు ఉన్నాయి. ఒక స్వతంత్రమైన దేశంలో అనాదిగా ఉన్న విత్తనాలు, మొక్కలు, వంగడాలు వాటి జన్య వనరులు ఆ దేశం సొత్తు. వేలాది సంవత్సరాలుగా వీటిని సాగు చేస్తూ, తమ పొలాల్లో సేద్యానికి, ఇతర రైతులతో పంచుకుంటూ జీవనం సాగిస్తున్న రైతాంగం సొత్తు విత్తనం. ఐక్యరాజ్యసమితిలో పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. అమెరికా, యూరోపియన్ దేశాలు ఐక్యరాజ్యసమితిని శాసిస్తున్నాయి. ఫలితంగా అది తీసుకునే నిర్ణయాలు పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటున్నాయి. దాని నేతృత్వంలో కుదిరిన విత్తన ఒడంబడిక కూడా అందుకు మినహాయింపు కాదు.

ఈ ఒప్పందం పెట్టుబడిదారీ దేశాల బహుళ జాతి విత్తన సంస్థల ఆధిపత్యాన్ని నెలకొల్పే విధంగా ఉంది. వెనకబడిన దేశాల విత్తన జన్యువులను సేకరించి తమ వద్ద ఉన్న టెక్నాలజీ తో అభివృద్ధి చేసిన విత్తనం పై బహుళ జాతి సంస్థలు పేటెంట్ హక్కులు పొంది, వాటి అనుమతి లేకుండా ఏ దేశ రైతులు ఉపయోగించినా నేరంగా పేర్కొన్నాయి. తమ విత్తన జన్యువుల ద్వారా తయారు చేసిన విత్తనాలను వెనుకబడిన దేశాలు ఉపయోగించుకునే హక్కును బహుళజాతి సంస్థల పొందిన పేటెంట్ హక్కు హరిస్తుంది. అమెరికా మరియు యూరోపియన్ యూనియన్ దేశాలు ముందుకు తెచ్చిన ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలు, విత్తనాలపై మేధో సంపత్తి అనే దాన్ని రక్షించడానికి అనేక నిబంధనలను కలిగి ఉన్నాయి. అటువంటి పెట్టుబడులను స్వాధీనం చేసుకుంటే లేదా జాతీయం చేస్తే లేదా వాటి నుండి ఆశించిన లాభాలు ప్రమాదంలో పడితే అప్పుడు ఆ దేశాలకు చెందిన బహుళజాతి విత్తన సంస్థలు, అవి పెట్టుబడి పెట్టిన దేశాలపై కోర్టులో దావా వేయవచ్చు. దీన్ని గమనిస్తే అంతర్జాతీయ విత్తన ఒడంబడిక బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసమే అన్న వాస్తవం వెల్లడి అయ్యింది. ఇంత ప్రమాదకరమైన బహుళజాతి సంస్థల విత్తన వ్యాపారాలకు భారతదేశ పాలకులతో పాటు అనేక దేశాల పాలకులు అనుమతించడం వారి రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒడంబడిక అమల్లోకి వచ్చి 22 సంవత్సరాలు గడిచిన తర్వాత సవరణల ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఈ సవరణ ప్రతిపాదనలు రైతాంగ హక్కులకు భంగం కలిగించేవిగా ఉన్నాయని ప్రపంచ వ్యాప్తంగా రైతు సంఘాలు, రైతాంగం వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 64 విత్తనాలతో పాటు ఇతర మొక్కల జన్యువులను కూడా చేర్చాలన్న ప్రతిపాదన సవరణల ముసాయిదాలో ఉందని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి .విత్తన ఒడంబడిక లో ప్రతిపాదించిన సవరణ ప్రతిపాదనలు రైతుల హక్కులను, ఆయా దేశాల విత్తన సార్వభౌమత్వాన్ని హరించి, విత్తనాలపై పూర్తిగా బహుళజాతి సంస్థల ఆధిపత్యం కోసమేనని రైతు సంఘాలు మండి పడుతున్నాయి. దేశాల సాంప్రదాయ విత్తనాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. బహుళజాతి సంస్థల విత్తనాలనే అధిక ధరలకు ప్రతి సంవత్సరం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. భారతదేశంలో పత్తి విత్తనాలను మోన్ శాంటో అధిక ధరలకు అమ్ముతున్న అనుభవం ఉంది. విత్తన ఒడంబడికలో చేయనున్న సవరణ ప్రతిపాదనలు ఆమోదం పొందితే, వేలాది సంవత్సరాల గా విత్తనాలపై సార్వభౌమాధికారం కలిగిన దేశాలు, రైతులు ఆ విత్తనాలపై హక్కును కోల్పోతారు. విత్తన పరాధీనత ఏర్పడుతుంది. రైతుల విత్తన హక్కులను హరించే అంతర్జాతీయ విత్తన ఒడంబడికను, దానికి తల పెట్టిన సవరణలను ఉపసంహరించాలని అన్ని దేశాల రైతాంగం యొక్క తక్షణ కర్తవ్యం అందుకు వ్యతిరేకంగా ఉద్యమించటమే.


*ఒక దేశం యొక్క వ్యవసాయ వారసత్వాన్ని లేదా జన్యుపరమైన వనరులను ఇతర దేశాలకు ఇచ్చిపుచ్చుకోవటానికి ఎటువంటి నియమ నిబంధనలు పాటించా లో నిర్ణయించేందుకు ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ ( ఎఫ్ ఏ ఓ ) అంతర్జాతీయ ఒడంబడికను 2002లో కుదిర్చింది. దాని పేరే యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ ట్రీటీ ప్లాంట్ జనటిక్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్.*



బొల్లిముంత సాంబశివరావు
9885983526

# డోపింగ్ తో ప్రతిష్ఠకు మచ్చ

ప్రపంచ క్రీడా వేదికపై భారతదేశం వేగంగా ఎదుగుతున్న శక్తిగా నిలుస్తోంది. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దేశ గౌరవాన్ని పెంచుతున్నాయి. అయితే ఈ విజయాలపై డోపింగ్ అనే మచ్చ మరింత గాఢమవుతోంది. నిషేధిత ఔషధాల వినియోగం కారణంగా వరుసగా నమోదవుతున్న కేసులు భారత క్రీడల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. పతకాలు సాధించడం ఎంత ముఖ్యమో, వాటిని నిజాయితీతో సాధించడం అంతకంటే ముఖ్యమనే సత్యాన్ని మరువరాదు.ప్రపంచ డోపింగ్ నిరోధక వ్యవస్థ నివేదికల ప్రకారం గత కొన్నేళ్లుగా డోపింగ్ ఉల్లంఘనల సంఖ్యలో భారత్ అగ్రస్థానాల్లో కొనసాగుతోంది. 2024లో భారత క్రీడాకారులపై నమోదైన డోపింగ్ ఉల్లంఘనలు 260కు చేరుకోవడం అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు దారితీసింది.




ఈ పరిణామాల నేపథ్యంలో భారత అథ్లెటిక్స్ సమాఖ్యను అత్యధిక ప్రమాద వర్గంలోకి చేర్చి మరింత కఠిన పర్యవేక్షణకు లోను చేశారు.ఇటీవలి సంఘటనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచకప్ స్వర్ణ విజేత భారత రోయర్ లక్ష్య డోపింగ్ పరీక్షలో విఫలమై తాత్కాలిక సస్పెన్షన్‌కు గురయ్యాడు. కామన్వెల్త్ క్రీడల ముందు పలువురు భారత వెయిట్‌లిఫ్టర్లు నిషేధిత పదార్థాల వినియోగంతో పట్టుబడటంతో భారత్‌కు ఒక కోటా స్థానం కూడా కోల్పోవాల్సి వచ్చింది. జూడో క్రీడాకారుడు అరుణ్ కుమార్ డోపింగ్ పరీక్షలో విఫలమవడం, పతక విజేత తులికా మాన్ 'వేర్‌అబౌట్స్' నిబంధనల ఉల్లంఘన కారణంగా జట్టుకు దూరమవడం దేశ ప్రతిష్ఠకు దెబ్బతీశాయి. ఈ పరిస్థితికి కేవలం క్రీడాకారులనే బాధ్యులుగా నిలబెట్టడం సరైంది కాదు. త్వరగా ఫలితాలు సాధించాలనే ఒత్తిడి, అవగాహనలేమి, అనధికారిక శిక్షణ కేంద్రాల్లో శాస్త్రీయ పర్యవేక్షణ లేకపోవడం, పోషకాహార సలహాల పేరుతో నిషేధిత పదార్థాల వినియోగం పెరగడం వంటి అంశాలు కూడా ప్రధాన కారణాలే. ఆందోళనకర విషయం ఏమిటంటే జూనియర్ క్రీడాకారుల్లో కూడా డోపింగ్ కేసులు పెరుగుతున్నాయి. ఇది భారత క్రీడల భవిష్యత్తుపై ప్రశ్నార్థకం వేస్తోంది.ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాలి. ప్రతి క్రీడా అకాడమీలో డోపింగ్ నిరోధక శిక్షణను తప్పనిసరి చేయాలి. కోచ్‌లు, ఫిజియోథెరపిస్టులు, పోషకాహార నిపుణులకు కూడా ధ్రువీకృత శిక్షణ ఇవ్వాలి. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థకు ఆధునిక ప్రయోగశాలలు, సాంకేతిక సామర్థ్యాలు, తగిన సిబ్బంది కల్పించాలి. ఆకస్మిక పరీక్షల సంఖ్యను పెంచడంతో పాటు నిషేధిత ఔషధాల అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే "స్వచ్ఛమైన క్రీడలు" అనే భావనను విద్యలో భాగం చేయాలి.2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే భారత ఆకాంక్ష ఉన్న వేళ, ప్రపంచం మన క్రీడా వ్యవస్థను నిశితంగా పరిశీలిస్తోంది. పతకాల సంఖ్యతో పాటు నైతిక విలువలు కూడా అంతే కీలకం. డోపింగ్ రహిత క్రీడా సంస్కృతిని నిర్మించగలిగితేనే భారత త్రివర్ణ పతాకం అంతర్జాతీయ క్రీడా వేదికపై మరింత గర్వంగా రెపరెపలాడుతుంది. క్రీడల్లో విజయం శక్తితో రావాలి గానీ, నిషేధిత మందుల సహాయంతో కాదు. అదే భారత క్రీడల నిజమైన విజయం.

*ప్రపంచ డోపింగ్ నిరోధక వ్యవస్థ నివేదికల ప్రకారం గత కొన్నేళ్లుగా డోపింగ్ ఉల్లంఘనల సంఖ్యలో భారత్ అగ్రస్థానాల్లో కొనసాగుతోంది. 2024లో భారత క్రీడాకారులపై నమోదైన డోపింగ్ ఉల్లంఘనలు 260కు చేరుకోవడం అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు దారితీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత అథ్లెటిక్స్ సమాఖ్యను అత్యధిక ప్రమాద వర్గంలోకి చేర్చి మరింత కఠిన పర్యవేక్షణకు లోను చేశారు. ఇటీవలి సంఘటనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచకప్ స్వర్ణ విజేత భారత రోయర్ లక్ష్య డోపింగ్ పరీక్షలో విఫలమై తాత్కాలిక సస్పెన్షన్‌కు గురయ్యాడు. కామన్వెల్త్ క్రీడల ముందు పలువురు దూరమవడం దేశ ప్రతిష్ఠకు దెబ్బతీశాయి. ఈ పరిస్థితికి కేవలం క్రీడాకారులనే బాధ్యులుగా నిలబెట్టడం సరైంది కాదు.*



హెచ్.ప్రతాప్
బాచిలర్స్ ఇన్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్( ఉస్మానియా)

# భారత జాతీయోద్యమ పిత



*బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది.*

బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 - ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యగమూర్తులతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్యనభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే.తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో-వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రుదయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలన ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమే నన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3-డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజపత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసుకున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్-బాల్-పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది.

తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవపరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నతాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం-856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి.1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు "బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ దానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు.బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది.

అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

## నిప్పుల నడక

చీకటిని తాకట్టు పెట్టి
సింహాసనాలు గెలుచుకున్న
పాలకులారా!
మీ అబద్ధాల కోటల పునాదుల కింద
నలిగిపోతున్నది కాగితాల కట్టలు
కావు -
ఒక తరం నగ్నంగా కాలే భవిష్యత్తు!

నోటికి తాళాలేసి,
కళ్లకు రంగులద్దే మీడియా
తోడేళ్లారా!
మీ విషపూరిత వార్తల అరుపుల
వెనుక
అమ్ముడుపోయిన అక్షరాల కుళ్ళిన
దుర్వాసన కంపుకొడుతోంది.

సత్యం గొంతు నులిమితే
చరిత్ర ముసుగు తన్ని పడుకుం
టుందని అనుకుంటున్నారా?
బాధ ఎప్పుడూ నిశ్శబ్దంగా చనిపోదు
-
అది ఎగిసిపడే అగ్నిపర్వతమై విరుచు
కుపడుతుంది.

మా సమస్య ఒక పరీక్ష కాదు, ఒక
ప్రకటన తేదీ కాదు...
మీ లంచాల అగాధంలో
పాతిపెట్టబడిన లక్షల కన్నుల ఆశల
సమాధి!
వ్యవస్థ శవమై పడి ఉంటే
మీరు సింహాసనాలపై నవ్వుతున్నారు.

గుర్తుంచుకోండి...
చెరసాల ఇనుప కడ్డీలు
ఉడుకురక్తపు ఉప్పెనను ఆపలేవు.
మీ సైనిక బూట్ల కింద నలిపిన ప్రతి
ఆశ
ఉక్కు పిడికిలై తిరిగి లేస్తుంది.
ఇది కేవలం వీధుల నిరసన కాదు -
అన్యాయపు సామ్రాజ్యాల శవయాత్ర!
ఇది కేవలం క్షణిక ఆగ్రహం కాదు -
తిరగబడ్డ పీడితుల అంతిమ తీర్పు!
మీరు దారంతా నాటిన ఇనుప
ముళ్లను
మా అడుగుల నిప్పులతో బూడిద
చేస్తాం.
చీకటి పీక నొక్కి
ఆ బూడిదలోంచి కొత్త ఉదయాన్ని
వెలిగిస్తాం!

తరలి వస్తున్నాం...
మా కళ్లలో రగిలే ఈ ఆక్రోశపు
జ్వాలలే
మీ ఆధిపత్యానికి ముగింపు పలికే
మృత్యుఘంటికలు!



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645



# జాతీయం-అంతర్జాతీయం



## అతడిని మంత్రిగా ఎలా కొనసాగిస్తారు?

- బీహార్ సర్కార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ విమర్శ





**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్)ః** బీహార్ బీజేపీ ప్రభుత్వంపై దేశ ఉన్నత న్యాయస్థానం తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలింగ్ ద్వారా ఎన్నిక కాని మంత్రిని మంత్రి వర్గంలో ఎలా కొనసాగిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించకుండా సదురు మంత్రిని పదవీలో కొనసాగించడం రాజ్యాంగ ఉల్లంఘనంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. "ఇది పూర్తిగా చట్టపరమైన అంశం. ఎన్నిక కాకుండానే ఒక మంత్రి ఆరు నెలలకు పైగా పదవిలో ఎలా కొనసాగుతున్నారో ప్రభుత్వం వివరించాల్సి ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ కోసం ఈకేసును కోర్టు ఆగస్టు 4వ వాయిదా వేసింది.

నితిష్ కుమార్ సీఎంగా ఉన్నప్పుడు బీహార్ మంత్రివర్గంలో దీపక్ ప్రకాశ్ పంచాయతీ రాజ్ మంత్రి ప్రమాణా స్వీకారం చేశారు.ఏప్రిల్ 15, 2026న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పదవి నుంచి తప్పుకోవడంతో ప్రకాష్ పదవీకాలం ముగిసింది.

అంతకుముందు ఆయన నాలుగు నెలల 26 రోజుల పాటు పంచాయతీ రాజ్ మంత్రిగా పనిచేశారు. మే 7న సామ్రాట్ చౌదరి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, ఎన్నిక కాకపోయినప్పటికీ ప్రకాష్ మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఎన్నికకాకున్న కూడా సదురు మంత్రి ఆరు నెలల కన్నా ఎక్కువగానే కొనసాగుతున్నారు. దీంతో దీపక్ ప్రకాశ్ చట్టవిరుద్ధంగా మంత్రి పదవీలో కొనసాగుతున్నారని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం బీహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికకానీ మంత్రిని ఆరు నెలలపైగా మంత్రి పదవీలో ఎలా కొనసాగిస్తారని, సమగ్ర వివరణ తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

## కకావికలం చేస్తోన్న కార్చిచ్చు




**పారిస్, రెథిమ్నో, జులై 30ః** దక్షిణ ఐరోపా దేశాలను కార్చిచ్చు కకావికలం చేస్తోంది. ఫ్రాన్స్‌లో చెలరేగిన మంటలు అదుపులోకి రాకుండా విస్తరిస్తుండగా, గ్రీస్‌లో విధి నిర్వహణలో ముగ్గురు ఫైర్‌ఫైటర్లు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రమైన వేడి, కరవు, బలమైన గాలుల కారణంగా ఫ్రాన్స్, గ్రీస్, స్పెయిన్ దేశాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

నైరుతి ఫ్రాన్స్‌లోని గిరోండే ప్రాంతంలో రాజుకున్న కార్చిచ్చు పారిస్ నగరానికి నాలుగు రెట్ల విస్తీర్ణంలో వ్యాపించిందని అధికారులు తెలిపారు. మంటలు మరింత విస్తరించే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో కలిపి దాదాపు 3.30 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఒక్క గిరోండే ప్రాంతం నుంచే 2.20 లక్షల మందిని ఖాళీ చేయించారు. 2,200 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, 20కి పైగా విమానాలు మంటలను ఆర్పేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయి. ఇతర యూరోపియన్ దేశాల నుంచి కూడా సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. స్థానిక ప్రజలు కూడా స్వచ్ఛందంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

మరోవైపు, గ్రీస్‌లో పరిస్థితి మరింత విషాదకరంగా మారింది. క్రీట్ ప్రాంతంలోని రెథిమ్నోలో మంటలను ఆర్పే క్రమంలో ఇద్దరు, పెలోపొన్నీస్ ప్రాంతంలో మరొకరు చొప్పున మొత్తం ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది మరణించారు. స్పెయిన్‌లో కొన్ని ప్రాంతాల్లో మంటలు అదుపులోకి రావడంతో ప్రజలు ఇళ్లకు తిరిగి వస్తున్నారు. అయితే, కాస్టెలాన్‌లో ఇంకా 10,000 మంది తరలింపు శిబిరాల్లోనే ఉన్నారు.

తీవ్రమైన వేడి, తేమలేని వాతావరణం కారణంగా గడ్డి, పొదలు వేగంగా మండిపోతున్నాయని అధికారులు వివరిస్తున్నారు.

ఒక బ్రష్‌కటింగ్ యంత్రం నుంచి వచ్చిన నిప్పురవ్వల వల్లే ఫ్రాన్స్‌లో ఈ కార్చిచ్చు మొదలైందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మంటల వల్ల ఫ్రాన్స్‌లో తొలిసారిగా 'పైరోక్యుములోనింబస్' అనే ఉరుములతో కూడిన నల్లటి మేఘం ఏర్పడిందని, ఇది కొత్తగా మంటలను సృష్టిస్తోందని అధికారులు తెలిపారు. యూరప్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండమని, ఇది ప్రపంచ సగటు కంటే రెట్టింపు వేగంతో ఉందని యూరోపియన్ యూనియన్ క్లైమేట్ సర్వీస్ 'కోపర్నికస్' నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దక్షిణ ఐరోపా దేశాలు అగ్నికీలలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

## రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ బిల్లు



- కఠిన చర్యలు తీసుకునేలా రూపకల్పన
- ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్)ః** పబ్లిక్ ఎగ్జామినేషన్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్రం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మంత్రి జితేందర్ సింగ్ సదురు బిల్లును సభ్యుల ముందు ఉంచారు.ఈ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా.. గురువారం ఎగువసభలో దీనిపై సుదీర్ఘ చర్చ జరగనుంది. ఇటీవలి కాలంలో దేశంలోని పలు పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, ప్రశ్నపత్రాల లీకేజీలు, మోసపూరిత చర్యలు, ఇతర అక్రమాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లును రూపొందించారు. పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను లోక్‌సభ బుధవారం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ బిల్లుపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ క్లుప్తంగా సమాధానమిచ్చిన అనంతరం ఈ ఆమోదం లభించింది. ఈ బిల్లుపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన సుదీర్ఘ చర్చ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. బుధవారం నాడు తిరిగి చర్చ ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న మూడేళ్లకు తక్కువ కాకుండా, ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు శిక్షను పొడిగించేలా పెంచాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. గరిష్ఠ జరిమానాను కూడా రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు.

## పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల ఆందోళన



- విద్యార్థులపై లాఠీఛార్జికి ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్)ః** పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్షాలు ఆందోళన బాటపట్టాయి. జంతర్ మంతర్ వద్ద ఈనెల 25న నిరసన చేపట్టిన జెన్ జీ పై లాఠీచార్జీను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశాయి. న్యాయమైన డిమాండ్ల కోసం, యువత భవిష్యత్ కోసం చేపట్టిన శాంతియుత ఆందోళనలపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని విపక్ష ఎంపీలు మండిపడ్డారు. యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు.

జెన్ జీ నిరసనలకు మద్దతుగా నిలిచిన, పాల్గొన్న వారిపై మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎవరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయబోమని జెన్ జీకి హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ జెన్ జీని మోసం చేస్తుందని విపక్షాలు మండిపడ్డాయి. ఉభయసభల్లో అయోధ్య విరాళాల దుర్వినియోగం చర్చ జరపాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

## హాకీ జట్టు జెర్సీపై రాజకీయం

- నీలం రంగు స్థానంలో కాషాయం
- చరిత్రను మారుస్తున్నారంటూ ప్రియాంకా గాంధీ ఆవేదన

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్) :** భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రపంచకప్ కోసం కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై మొదలైన చర్చ రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ విరేన్ రస్కీనా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు.

## కంగనాకు సీజేపీ నేత కౌంటర్

- తనదైన శైలిలో సౌరవ్ దాస్ సెటైర్లు
- చర్చనీయాంశమైన వ్యాఖ్యలు
- కంగనాపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదంటూ క్లారిటీ



**ముంబయి, జులై 30 (ఎ.ఎం.ఎస్)ః** బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన 'పనికిమాలినవాడు', 'నిరుద్యోగి' అనే తీవ్రమైన వ్యాఖ్యలకు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తనదైన శైలిలో, హాస్యాన్ని జోడించి బదులిచ్చారు. తనపై కంగనా వ్యక్తిగత విమర్శలకు దిగడానికి కారణం, తాను "యువ హృతిక్ రోషన్‌లా కనిపించడమే" కావొచ్చని తన స్నేహితులు అంటున్నారని ఆయన చమత్కరించారు. ఇద్దరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధంలో ఈ వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తించాయి. ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖా దత్‌తో మాట్లాడుతూ సౌరవ్ దాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా కంగనా తనను లక్ష్యంగా చేసుకోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "నా స్నేహితులు నాకు టెక్ట్స్ చేసి 'ఆమె నీ వెనుక ఎందుకు పడింది?' అని అడుగుతున్నారు. వారిలో ఒకరు 'నువ్వు బహుశా యువ హృతిక్ రోషన్‌లా కనిపిస్తున్నావేమో' అని అన్నారు. ఇది నిజమేనా? ఈ గొడవ తర్వాత నా స్నేహితులు నాతో చెప్పింది ఇదే. నా లాంటి వ్యక్తిపై ఆమె ఎందుకు దాడి చేయాలనుకుంటుందోనని ఆశ్చర్యపోయాను" అని నవ్వుతూ చెప్పారు. అయితే, కంగనాపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి వ్యతిరేకత లేదని ఆయన స్పష్టం చేశారు. అభిప్రాయ భేదాలను వ్యక్తిగత దాడులతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సౌరవ్ దాస్ సూచించారు. "కంగనా రనౌత్‌పై నాకు వ్యక్తిగతంగా ఏమీ వ్యతిరేకత లేదు. తనే జెన్‌జీ పైనా, ఇప్పుడు నాపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నారు. నేను ఇప్పటికే నా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చెప్పాను, 'యో కంగనా, కాస్త శాంతించు. దీని గురించి మాట్లాడుకుందాం' అని. ఈ దేశంలో ఉన్న సమస్యే ఇది. ప్రజలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు. చర్చలు, సంప్రదింపులు తగ్గిపోయాయి. మనం ఒకరినొకరు గౌరవించుకుంటూ సంభాషణలు జరపగలగాలి" అని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు దేశ యువత గురించి మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, వారి మాటలు నిరాశతో కూడుకున్నవిగా ఉన్నాయని అన్నారు. తాము ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

## వైద్యరంగంలో కీలక సంస్కరణలు



- శ్రీకారం చుట్టిన తమిళనాడు ప్రభుత్వం
- సింగిల్ విండో క్లియరెన్స్‌కు నిర్ణయం
- నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలంటూ ఆదేశాలు

**చెన్నై, జులై 30 (ఎ.ఎం.ఎస్)ః** వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా తమిళనాడు ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం 'సింగిల్ విండో క్లియరెన్స్' (ఏక గవాక్ష) విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

దీనివల్ల ఏళ్ల తరబడి వివిధ ప్రభుత్వ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అనుమతుల ప్రక్రియ కేవలం కొన్ని నెలల్లోనే పూర్తి కానుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో పారిశ్రామికంగా పురోగతి సాధిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల సరసన తమిళనాడు కూడా నిలవనుంది. ప్రస్తుత విధానంలో ఆసుపత్రి భవనాలు, ప్రాజెక్ట్ డిజైన్లకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, కొన్ని సందర్భాల్లో రూ. 4050 లక్షల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ జాప్యం కారణంగా సుమారు 78 మంది వైద్యులు తలపెట్టిన ఆసుపత్రి ప్రాజెక్టులు ప్రస్తుతం పెండింగ్‌లో పడిపోయాయి.

కొత్త సింగిల్ విండో విధానంతో పారదర్శకమైన, నిర్దిష్టమైన ఫీజుల విధానం అమల్లోకి రానుంది. దీనివల్ల అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని, అనుమతుల ప్రక్రియ వేగవంతమై వైద్య రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా పరిశ్రమ వర్గాల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## ఇరాక్‌పై విరుచుకుపడిన అమెరికా, సౌదీ



- 20 మంది మరణం
- ఉగ్రవాదులపైన్నే దాడులంటూ ఇరు దేశాల స్పష్టీకరణ

**బాగ్దాద్, జులై 30 :** ఇరాక్‌పై అమెరికాసౌదీ సేనలు బుధవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడులలో మాజీ పార్లమెంటరీ కూటమికి చెందిన కనీసం 20 మంది చనిపోయారు. ఈ కూటమిలో ఇరాన్ అనుకూల గ్రూపులు కూడా ఉన్నాయి. మాజీ పార్లమెంటరీ గ్రూపులు, ఇరాక్ సాయుధ దళాలలో భాగస్వాములైన వర్గాలతో ఏర్పడిన పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్ (పీఎంఎఫ్) అందించిన సమాచారం ప్రకారం ఏడు రాష్ట్రాలలోని కూటమి స్థావరాలపై అమెరికాసౌదీ జరిపిన దాడులలో కనీసం 20 మంది చనిపోగా 32 మంది గాయపడ్డారు. కాగా అమెరికా సేనల పైన, సౌదీ చమురు స్థావరాల పైన జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఇరాక్‌లో ఇరాన్ మద్దతిస్తున్న ఉగ్రవాదులపై దాడులు చేశామని అమెరికాసౌదీ అరేబియా ఆరోపించాయి. 2014లో జిహాదీలపై పోరాడేందుకు పారామిలటరీలు, వర్గాలతో ఏర్పడిన కూటమే పీఎంఎఫ్. ఇప్పుడది ఇరాక్ సాయుధ దళాలలో కలిసిపోయింది. కూటమిలోని కొన్ని గ్రూపులకు ఇరాన్ మద్దతు ఇస్తున్నప్పటికీ వీటిలో చాలా వరకూ స్వతంత్రంగానే వ్యవహరిస్తున్నాయి. అమెరికాసౌదీ ప్రమాదకరమైన దాడులకు పాల్పడుతున్నాయని, ఇరాక్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తున్నాయని, ఇది తమ అధికారిక భద్రతా సంస్థలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పీఎంఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ఇరాక్‌లో ఇరాన్ మద్దతున్న గ్రూపులు తమ చమురు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్ దాడులు చేశాయని, తమ సేనలు వాటిని నిలువరించాయని సౌదీ అంతకుముందు తెలిపింది.

### ప్రశాంతంగా దతియా ఉప ఎన్నిక



**భోపాల్, జులై 30 (ఎ.ఎం.ఎస్)ః** మధ్యప్రదేశ్ లోని దతియా అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 11 గంటల వరకు సుమారు 32.53 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ, తగిన భద్రతా ఏర్పాట్ల మధ్య నియోజకవర్గ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అంతకుముందు, ఉదయం 9 గంటల వరకు నమోదైన ప్రారంభ పోలింగ్ సరళిలో ఓటింగ్ శాతం 12.94గా ఉంది. ఉదయం 7 గంటలకు అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా మొదలైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. అంతకముందు ఉదయం 5:30 గంటలకు ప్రారంభమైన మాక్ పోల్, 7 గంటల లోపే ముగిసింది. ఓట్ల లెక్కింపు ఆగస్టు 3న చేపడతారు. ఏప్రిల్ 2న కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేంద్ర భారతి అనర్హతకు గురికావడంతో దతియా అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అశుతోష్ తివారీని బరిలోకి దించగా, కాంగ్రెస్ ఘన్‌శ్యామ్ సింగ్‌ను అభ్యర్థిగా నిలిపింది.

## జెలెన్ స్కీ, నెతన్యాహూలతో ట్రంప్ భేటి



- సానుకూలంగా సమావేశాలు
- ఉక్రెయిన్‌కు సాయంపై ఎలాంటి ప్రకటనా చేయని అమెరికా

**వాషింగ్టన్, జులై 30ః** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సమావేశాలు సానుకూలంగా, ఫలప్రదంగా జరిగాయని అధ్యక్షభవనం తెలిపింది. సెనెటర్ లిండ్సే గ్రహమ్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఇరువురు నేతలు వాషింగ్టన్ వచ్చారు. గ్రహమ్ ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతుదారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం అందించాలని ఆయన సూచించే వారు. కాగా గగనతల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసే విషయంలో సాయం చేయాలని ట్రంప్‌ను జెలెన్‌స్కీ కోరారు.

అమెరికా నుంచి పాట్రియాట్ క్షిపణులను ఉక్రెయిన్ చాలా కాలం నుంచి కోరుతోంది. రష్యా డ్రోన్, క్షిపణి దాడుల నుంచి ఉక్రెయిన్ నగరాలను కాపాడుకునేందుకు ఇవి అవసరమని చెబుతోంది. మరోవైపు ఇరాన్ విషయంలో అమెరికాఇజ్రాయిల్ మధ్య సంబంధాలు బెడిసికొట్టిన తరుణంలో ట్రంప్‌తో నెతన్యాహూ చర్చలు జరిపారు.

ఏకాంత సమావేశం బాగానే జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్‌కు సైనిక సాయంపై అమెరికా ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ పాట్రియాట్ క్షిపణులను దేశీయంగా తయారు చేయడానికి లైసెన్సులు ఇచ్చేందుకు ట్రంప్ అంగీకరించారని జెలెన్‌స్కీ చెప్పారు. బాలిస్టిక్ క్షిపణుల దాడిని అడ్డకోగలిగిన అతి కొద్ది గగనతల రక్షణ వ్యవస్థలలో పాట్రియాట్ ఒకటి. అయితే వీటి ధర చాలా ఎక్కువ. ఒక్కో పాట్రియాట్ ఖరీదు మూడు నుంచి ఐదు మిలియన్ డాలర్ల వరకూ ఉంటుంది.

## హార్ముజ్‌లో నౌకలను స్వేచ్ఛగా తిరగనివ్వండి

- ఐరాస భద్రతా మండలిలో భారత్
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన



**న్యూయార్క్, జులై 30 :** పశ్చిమాసియాలో తిరిగి ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇటీవల జరిగిన దాడులను ఖండించింది. ఉద్రిక్తలను నివారించాలని, అంతర్జాతీయ జలమార్గంలో నౌకలు స్వేచ్ఛగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణించేలా చూడాలని కోరింది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితిపై భద్రతా మండలిలో జరిగిన బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి (ఐరాస) పర్వతనేని హరీష్ మంగళవారం ప్రసంగిస్తూ స్వల్ప విరామం తర్వాత తిరిగి శత్రుత్వాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. చర్చలు, దౌత్యానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌కు పశ్చిమాసియా అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని అంటూ ఆ ప్రాంతంలో ఉద్రిక్తతల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. హార్ముజ్‌లో జరిగిన దాడులు భారతీయ పౌరులపై ప్రత్యక్ష ప్రభావం చూపాయని చెప్పారు.

'ఈ దాడులలో పలువురు భారతీయులు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరొకరి ఆచూకీ తెలియడం లేదు. నౌకాయాన సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని జరిపే హింసాత్మక చర్యలను భారత్ నిరంతరం ఖండిస్తూనే ఉంది. హార్ముజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాల ద్వారా స్వేచ్ఛాయుత, సురక్షితమైన నౌకాయానానికి అంతరాయం కల్పించడాన్ని కూడా మేము నిరసిస్తూనే ఉన్నాం' అని హరీష్ తెలిపారు. మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరత పునరుద్ధరించబడాలంటే దౌత్యం ఒక్కటే మార్గమని భారత్ గట్టిగా అభిప్రాయపడుతోందని అన్నారు.

పశ్చిమాసియాలో భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను హరీష్ ఈ సందర్భంగా వివరించారు. పాలస్తీనా ప్రజలకు భారత్ మద్దతు కొనసాగుతుందని, రెండు దేశాల పరిష్కారానికి దీర్ఘకాలంగా మద్దతు ఇస్తోందని తెలిపారు.

## జపాన్‌లో భూకంపం



- 13 మంది మృత్యువాత
- ప్రతిక్షణం విలువైనదేనన్న జపాన్ ప్రధాని

**టోక్యో, జులై 30 :** జపాన్‌లో సంభవించిన భూకంపంలో మరణించిన వారి సంఖ్య 13కు చేరింది. క్షతగాత్రుల సంఖ్య వందలలోనే ఉంది. షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ముగ్గురు, పేపర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అనేక మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. విద్యుత్, మంచినీటి సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాభై వేలకు పైగా కుటుంబాలు కరెంటు లేక అంధకారంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. సుమారు లక్షన్నర ఆవాసాలకు నీటి సరఫరా బంద్ అయింది. భూకంపం సంభవించిన ప్రాంతంలో బుధవారం 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భూప్రకంపనలు సంభవిస్తాయేమోనన్న భయంతో చాలా మంది మంగళవారం రాత్రి తమ కార్లలోనే నిద్రించారు. తొమ్మిది వేల మందికి పైగా బాధితులను అధికారులు సహాయ శిబిరాలకు తరలించారు. భూకంపం సంభవించిన వెంటనే 200 షాపులున్న ఓ షాపింగ్ మాల్‌లో పేలుడు జరిగింది. ప్రధాన భవనంలోని పై అంతస్తు పాక్షికంగా కూలిపోయింది. భూకంపం సంభవించగానే వినియోగదారులను, సిబ్బందిని హుటాహుటిన ఖాళీ చేయించారు. దక్షిణ ప్రాంతంలోని కుమమోటో ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని ప్రధాని సానే టకైచీ బుధవారం తెలిపారు. శిథిలాల కింద చిక్కుబడిన వారి కోసం వేలాది మంది సైనికులు గాలింపు చేపట్టారని, ప్రస్తుత పరిస్థితులలో ప్రతి క్షణం విలువైనదేనని ఆయన అన్నారు. సహాయ కార్యక్రమాల కోసం 2,600 మంది సిబ్బందిని సమీకరించారు. గగనతలం నుంచి నష్టాన్ని అంచనా వేసేందుకు 20 విమానాలను పంపారు. భూకంపం ధాటికి అనేక బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. 2016లో సంభవించిన భూకంపంలో దెబ్బతిన్న ఒక చారిత్రక కోటకు తాజా ఘటనలో మరోసారి నష్టం వాటిల్లింది. భారీ భూకంపం వచ్చిన ప్రాంతాలలో రాబోయే వారం రోజులలో మరింత బలమైన ప్రకంపనలు సంభవించవచ్చునని, కొండ చరియలు విరిగిపడతాయని వాతావరణ విభాగం హెచ్చరించింది. బుధవారం ఉదయానికి 60కి పైగా ప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 14గా నమోదైంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎల్‌నినో వేళ ఆరుతడి పంటలే శ్రీరామరక్ష - కలెక్టర్

**జనగామ/బచ్చన్నపేట జూలై 31(వుదయం ప్రతినిధి) :**



ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక లాభాలనిచ్చే ఆరుతడి పంటల వైపు మళ్లాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. శుక్రవారం బచ్చన్నపేట మండలం ఎద్దుగూడెం గ్రామంలో ఆయన పర్యటించి, పంట పొలాలను పరిశీలించడంతో పాటు రైతులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు బండారి బాలరాజు సాగు చేసిన పెసర, నువ్వుల పంటలను పరిశీలించిన కలెక్టర్, సాగు ఖర్చులు, ఊహిస్తున్న దిగుబడులపై ఆరా తీశారు. అనంతరం సమీకృత వ్యవసాయ విధానం (Integrated Farming), డ్రమ్ సీడింగ్ పద్ధతిని అనుసరిస్తున్న రైతు పరమేశ్వర్ క్షేత్రాన్ని సందర్శించి అభినందించారు. అలాగే పొలాల్లో నాట్లు వేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడి వారి ఉపాధి వివరాలను తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెసర, నువ్వులు, కందులు, మిర్చి వంటి ఆరుతడి పంటలు ఎంతో అనుకూలమని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (DAO) అంబికా సోనీ, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, తేది: 31.07.2026**



విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యార్థులకు మంచి రుచికరమై పోషకాహారం అందించాలని , నాణ్యమైన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శుక్రవారం తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల (కేజీబీవీ), పీఎం శ్రీ మోడల్ స్కూల్ & కాలేజీ, మండల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా కేజీబీవీని సందర్శించిన కలెక్టర్, పాఠశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థుల ఉన్నారని, గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయా అనే వివరాలను అడిగి సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నరని,వారంతా క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ కిచెన్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. వంటచేసే గది పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కూరగాయలను పరిశీలించారు, తాజాగా ఉన్న కూరగాయలనే వాడాలన్నారు, గుడ్లు, వంటనూనె ప్యాకెట్ల గడువు తేదీలను పరిశీలించి, నాణ్యమైన ఆహార పదార్థాలనే వినియోగించాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లడుతూ ప్రతి రోజు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, ఈ వారంలో చికెన్ పెట్టడం జరిగిందా అని,భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఆర్‌బీఎస్‌కే (RBSK) బృందం ఈ విద్యా సంవత్సరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించిరా అని అడిగి తెలుసుకున్నారు,రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థినీల వివరాలను అడిగితెలుసుకున్నారు. వారితో నేరుగా మాట్లాడి ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అటువంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.తదుపరి పీఎం శ్రీ మోడల్ స్కూల్ &కాలేజీని సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య, హాస్టల్, విద్యా భవనాల నిర్వహ ణ ను ప రిశీలించారు. మ రుగుదొడ్లు ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నారా, తగినంత నీటి సరఫరా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఆర్‌బీఎస్‌కే బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించలేదని తెలుసుకుని వెంటనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.కేజీబీవీ, మోడల్ స్కూల్ & కాలేజీలలో 14 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్‌పీవీ (HPV) వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి బాలికకు 100 శాతం టీకా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని (డీఈఓ) ఆదేశించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల హాజరు, పోషకాహార కార్యక్రమాలను పరిశీలించారు. సామ్ (SAM),మామ్ (MAM) కేటగిరీల్లో ఉన్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకుని, మామ్ పిల్లలకు అందిస్తున్న ప్రత్యేక పోషకాహారం గురించి ఆరా తీశారు.చిన్నారులకు బోధిస్తున్న ప్రీ–స్కూల్కార్యకలాపాలు, ఆట వస్తువులు, బాలామృతం ప్లస్, పాల ప్యాకెట్ల గడువు తేదీలను పరిశీలించి నాణ్యతపై రాజీ పడొద్దని సూచించారు. చివరిగా మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలు, గ్రామంలో పాఠశాల వయస్సు పిల్లల సంఖ్యపై ఆరా తీశారు. ప్రతి అర్హ బాలుడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొంతమంది పిచ్చిగా విమర్శించినా పట్టించుకోకుండా ప్రజాసేవ చేయడమే నా లక్ష్యం

**జయశంకర్ భూపాలపల్లి జులై 31 (వుదయం జిల్లా ప్రతినిధి):**

### సువర్ణ వనమాల స్మారకంగా ఉచిత వైద్య శిబిరం

### శిథిలావస్థలో ఉన్న మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిని పునర్నిర్మిస్తాం

### ఆగస్టు 4న ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో మరో ఆరోగ్య శిబిరం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మంథని నియోజకవర్గ ప్రజలు తనకు అవకాశాన్ని కల్పించారని ప్రజలు ఇచ్చిన అవకాశంతోనే పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.శుక్రవారం మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిలో ఐడిబిఐ సహకారంతో ఎంఎన్జె ఆసుపత్రి హైదరాబాద్, ఓమెగా ఆసుపత్రి కరీంనగర్ వైద్యులు మరియు వైద్య సిబ్బందిచే ఉచిత కాన్సర్, కంటి నిర్ధారణ పరీక్షలు వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివంగత నేత ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ శ్రీపాదరావు సోదరీమణి అయినా సువర్ణమాల (తాయి) అనారోగ్యంతో మృతి చెందడం జరిగిందని వారి స్మారకంగా ఉచిత వైద్య శిబిరం మహాదేవపూర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు కొందరు కావల్చుకొని పిచ్చిగా విమర్శించినా పట్టించుకోకుండా ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా దుదిల్ల కుటుంబం ముందుకు సాగుతుందని ఏనాడు ఎవరి గురించి నేను విమర్శించలేదని ఇక ముందు కూడా విమర్శించబోనని ప్రజలు ఇచ్చిన అవకాశంతో ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు.ముఖ్యంగా మహిళలు కాన్సర్ వ్యాధి బారిన పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా సర్వైకల్ పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.పేదోళ్లకు ఉపయోగపడాలని దాని ద్వారా వారు ఆర్థికంగా చితికి పోకుండా ఆదిలోనే వ్యాధిని గుర్తించి,వ్యాధి అంతు చూడాలని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెరి మీటర్, హెల్త్ ఏటిఎం, ఈసీజి వంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ ఏ టి ఎం ద్వారా 64 రకాల వైద్య పరీక్షలను వేగంగా నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. హెల్త్ ఏటియం ద్వారా నిర్వహించిన పరీక్షలకు కార్డు ఇస్తారని తద్వారా 5 సంవత్సరాలు వరకు రిపోర్ట్స్ భద్రంగా ఉంటాయని తెలిపారు. అలాగే కంటి పరీక్షల కోసం ప్రత్యేక యంత్రం, గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు ఈసీజీ యంత్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహిళలను సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు.మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైద్య సేవలు పొందడానికి అవకాశం ఉంటుందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక వసతులతో పునర్నిర్మించి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.ప్రజల సౌకర్యార్థం ఆగస్టు 4వ తేదీన ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో మరో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేపించుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్య పరీక్షలు చేపించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ఇప్పటివరకు కాటారం డివిజన్ పరిధిలో 680 మందికి హైదరాబాద్ లో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించి వారికి చూపు ప్రసాదించినట్లు మంత్రి వెల్లడించారు.మంథని నియోజక వ్యాప్తంగా 45వేల మందికి కంటి చికిత్సలు చేపించినట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ వైద్య క్యాంపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని మంత్రి అభినందించారు. అంతకు ముందు మంత్రి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను పరిశీలించారు.అనంతరం వైద్యులను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో కలెక్టర్రేట్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజా బాబు,వివిజి రాంజీ రాష్ట్రసభ్యులు దండు రమేష్, కాటారం ఆర్డిఓ రవీందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ రవీంద్రనాథ్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల సమ్మయ్య, పిఏసిఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఐడిబిఐ మేనేజర్ చంద్ర మౌళీశ్వర రెడ్డి, పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి- కలెక్టర్




**హనుమకొండ, జూలై 31 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

రానున్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె అధికారులతో ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేదిక, జాతీయ పతాకావిష్కరణ, పరేడ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, భద్రత, పార్కింగ్ ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా ఆకర్షణీయమైన ప్రదర్శన శకటాలు (టేబ్లోలు), అవగాహన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు నిబద్ధతతో పనిచేసి ఈ వేడుకలను జిల్లాకు ఆదర్శంగా నిలిచేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న, అదనపు కలెక్టర్ రవి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ఆర్డీవో వెంకటేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## న్యాయ మౌలిక వసతులపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్న.. కేంద్ర మంత్రి సమాధానం

**వరంగల్, జూలై 31 (వుదయం ప్రతినిధి) :**



వరంగల్ జిల్లాలో న్యాయ మౌలిక వసతుల అభివృద్ధి, ఈ–కోర్టుల విస్తరణ, డిజిటల్ న్యాయ సేవల పురోగతిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వరంగల్‌కు అందించిన ఆర్థిక సాయం, అమలులో ఉన్న ప్రాజెక్టుల వివరాలను తెలుపాల్సిందిగా కోరారు. దీనికి కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ.. రాష్ట్రాలపై ఆర్థిక భారం తగ్గించేందుకు 1993–94 నుంచి కేంద్ర ప్రాయోజిత పథకం అమలవుతోందని తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణకు గత మూడేళ్లలో రూ. 11.16 కోట్లు విడుదల చేసి వినియోగించినట్లు పేర్కొన్నారు. 2024–25లో రూ. 1.96 కోట్లు, 2025–26లో రూ. 9.20 కోట్లు ఇవ్వగా.. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ. 15.79 కోట్ల 'మదర్ శాంక్షన్' మంజూరు చేసినట్లు కేంద్రం వెల్లడించింది.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయ సేవలు అందాలంటే మెరుగైన మౌలిక వసతులతో పాటు ఆధునిక సాంకేతికత అవసరమని స్పష్టం చేశారు. ఈ–కోర్టుల ఫేజ్–3 కింద నిధులు పెంచి డిజిటల్ సేవలు, ఈ–సేవా కేంద్రాలు, వీడియో కాన్ఫరెన్సింగ్ వసతులను మరింత విస్తరించాలని, భవిష్యత్తులో జిల్లాకు కావాల్సిన కొత్త న్యాయ మౌలిక వసతులకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని కోరారు.

## ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు: కమిషనర్ వెంకన్న



**వరంగల్ టౌన్ , జూలై 31 (వుదయం ప్రతినిధి) :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పరిధిలోని ఆసుపత్రులు, ప్రైవేట్ పాఠశాలలు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక భద్రతా (ఫైర్ సేఫ్టీ) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు. శుక్రవారం అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ లింగంతో కలిసి కమిషనర్ నగరంలోని కాజీపేట డి–మార్ట్, రోహిణి ఆసుపత్రితో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలు, కమర్షియల్ కాంప్లెక్స్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ అలారం వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి భవన యాజమాన్యం ఏడాదికోసారి ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను తనిఖీ చేయించి, సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేయించుకోవాలి. నిబంధనలు పాటించని, అనుమతుల గడువు ముగిసిన సంస్థలపై చట్టపరమైన చర్యలు ఉంటాయి. భద్రతా పరికరాలు లేని భవనాలను గుర్తించి తక్షణమే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ ఆస్తుల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర రావు, డీఆర్ఎఫ్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## శబ్ద కాలుష్యానికి చెక్

### - నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు;ట్రాఫిక్ ఎస్.ఐ యాదవేందర్ రెడ్డి

**సూర్యాపేట, జూలై 31:వుదయం ప్రతినిధి**



సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తూ అధిక శబ్దంతో రోడ్లపై సంచరిస్తున్న మోడిఫైడ్ సైలెన్సర్లతో కూడిన బుల్లెట్ మోటార్ బైక్‌లపై సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు.ట్రాఫిక్ ఎస్.ఐ యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టారు.ప్రజల ఫిర్యాదులతో స్పెషల్ డ్రైవ్అధిక శబ్దం వెలువరించే సైలెన్సర్ల కారణంగా ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే నేపథ్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ముఖ్యంగా స్కూల్, కాలేజీల సమయాల్లో, ఆసుపత్రుల సమీపంలో అధిక శబ్దం చేస్తూ యువకులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తుండడంతో ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎలాంటి చర్యలు తీసుకున్నారంటే...తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన బుల్లెట్ బైక్ లను గుర్తించి మోటారు వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించే చర్యలు చేపట్టారు.అధికారులు మాట్లాడుతూ ఇలాంటి వాహనాలు రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయని, రాత్రి సమయాల్లో నిద్రకు భంగం కలిగిస్తున్నాయని అన్నారు.

## రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్

**ములుగు, జూలై 31 (వుదయం ప్రతినిధి) :**



ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలో వరద తీవ్రత వేగంగా పెరుగుతోందని, జిల్లా ప్రజలు, అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.రెండో ప్రమాద హెచ్చరిక దాటిన ప్రవాహం, రామన్నగూడెం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం మధ్యాహ్నానికి 75.47 అడుగులకు (16.97 మీటర్లు) చేరింది. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తుండగా, మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి (75.82 అడుగులు) చేరువలో ఉంది.సమ్మక్క సాగర్ ఇన్ ఫ్లో: తుపాకులగూడెం ప్రాజెక్టులోకి 14.03 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, అంతే మొత్తంలో స్పిల్‌వే ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.హై అలర్ట్ మండలాలు, నదీ పరివాహక ప్రాంతాలైన కన్నాయిగూడెం, ఏటూరు నాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అప్రమత్తం చేశారు.పునరావాస కేంద్రాల ఏర్పాటు, జంపన్నవాగు బ్యాక్‌వాటర్ ప్రభావం పడే లోతట్టు గ్రామాలు, గతంలో ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు సిద్ధం చేశారు. చేపల వేట, ఈత నిషేధం: రానున్న రెండు, మూడు రోజుల పాటు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, చెరువులు, వాగులు, నదుల వద్దకు ఈత లేదా చేపల వేట కోసం వెళ్లవద్దని కోరారు.24/7 కంట్రోల్ రూమ్: ప్రజల సహాయార్థం జిల్లా యంత్రాంగం నిరంతరం పనిచేసే 1800-425-7109 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించవచ్చని తెలిపారు.

## ఆగస్టు 3 లోపు ప్రతి ఓటరు గణన ఫారాన్ని సమర్పించేలా రాజకీయ పార్టీలు సహకరించాలి... కలెక్టర్

**ఖమ్మం, జూలై -31**




ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు గణన ఫారాన్ని ఆగస్టు 3 లోపు తప్పనిసరిగా సమర్పించేలా రాజకీయ పార్టీలు చురుకుగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. 31,967 మంది మృతి చెందిన ఓటర్లు, 10,060 డబుల్ ఎంట్రీలు, 94 వేల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఇంకా సుమారు 31 వేల మంది ఓటర్లు గణన ప్రక్రియకు స్పందించడం లేదని, వీరిలో అధిక సంఖ్యలో ఖమ్మం నగరానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. గణన ఫారాలు పూరించి ఇవ్వని పక్షంలో సంబంధిత ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ పేరు ముసాయిదా జాబితాలో లేకపోతే అనంతరం అవసరమైన ధృవపత్రాలతో ఫారం–6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నమోదు అధికారులు రాజకీయ పార్టీలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారని, రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలు, మద్దతుదారులను చైతన్యపరచి గడువులోగా గణన ఫారాలు సమర్పించేలా చూడాలని కోరారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు ఆయా ప్రాంతాల్లో ఓటరుగా నమోదు అయ్యారా లేదా అనే విషయాన్ని కూడా రాజకీయ పార్టీలు తమ స్థాయిలో నిర్ధారించాలని సూచించారు. జిల్లాలో అందిన సుమారు 10 లక్షల గణన ఫారాల్లో 42 వేల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కాలేదని, వారికి భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించేందుకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ధృవీకరణ పత్రం అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 1,460 పోలింగ్ కేంద్రాల్లో 677 కేంద్రాల్లో 100 శాతం గణన ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, మరో 544 కేంద్రాల్లో 95 శాతం, 158 కేంద్రాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వోలు) సహకరించి ప్రతి ఓటరు సరైన వివరాలతో గణన ఫారం సమర్పించేలా చూడాలని సూచించారు. ఆగస్టు 3 గణన ఫారాల సమర్పణకు చివరి తేదీ అని, ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి, అక్టోబర్ 12, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డీఆర్వో సి.హెచ్. రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి డి. సౌజన్య, బీఆర్ఎస్ ప్రతినిధులు రమేష్, వేణుగోపాల్, వెంకటరావు, బీజేపీ ప్రతినిధి రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి రామయ్య, ఆప్ ప్రతినిధి సుబ్బారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి వరదపై జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తం

### క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్ – లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 31 (వుదయం ప్రతినిధి)**

భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితి, మోటార్ల పనితీరును ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు వేగంగా బయటకు వెళ్లేలా మోటార్లను నిరంతరం నిర్వహించాలని, ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.అనంతరం కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ స్నానఘాట్ల వద్ద పరిస్థితిని సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను గోదావరిలోకి అనుమతించరాదని, ప్రమాద ప్రాంతాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు.కూనవరం–భద్రాచలం ప్రధాన రహదారిపై వరద నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి, రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం వేగంగా పెరుగుతోందన్నారు. శుక్రవారం గోదావరి నీటిమట్టం 48.00 అడుగులకు చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని, నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు వెల్లడించారు.లోతట్టు ప్రాంతాల పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైతే ప్రజలను ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు.వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రజల సహాయార్థం భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్: 08744-241950, వాట్సాప్: 9392919743 ద్వారా సమాచారం అందించాలని కోరారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, గోదావరి వరద ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లరాదని, ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి దిగవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఫ్లడ్ కంట్రోల్ రూమ్ లేదా 100 నంబర్‌కు సమాచారం అందించి పోలీసు సహాయం పొందాలని సూచించారు. ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ ఎస్ఈ మహేశ్వరరావు, దేవస్థానం ఈవో దామోదర్‌రావు, భద్రాచలం తహసీల్దార్ రామకృష్ణ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, ఓ.పి. సేవలు పెరిగేలా చర్యలు చేపట్టాలి : కలెక్టర్

**గర్భిణులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య సేవలు నిరాకరించ వద్దు**

**మానవీయ దృక్పథంతో వైద్యం అందించాలి**

**వైద్యులు, సిబ్బంది విధి సమయాలను కచ్చితంగా పాటిస్తూ రెసిడెంట్ విధులు నిర్వహించాలి**

**టిఫ్ఫా స్కానింగ్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**

**వైద్య శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, జూలై-31 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య, రోగుల ఓపీ, ఇన్‌పేషెంట్ చేరికలను పెంచేందుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ)లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారి విశ్వాసాన్ని మరింత పెంచాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది విధి సమయాలను తప్పనిసరిగా పాటించాలని, విధి సమయంలో రెసిడెంట్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోగితో మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, ముఖ్యంగా గర్భిణులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య సేవలను నిరాకరించవద్దని ఆదేశించారు. 36 వారాల గర్భధారణ పూర్తిచేసుకున్న గర్భిణులకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తప్పనిసరిగా ఆసుపత్రిలో చేర్చుకుని అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.పెద్దపల్లి,గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న టిఫ్ఫా (TIFFA) స్కానింగ్ సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, గర్భిణులకు అవసరమైన పరీక్షలు సకాలంలో నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణుల వైటల్స్, ఫీటల్ హార్ట్ రేట్‌ను వైద్యులే క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, పూర్తిగా మిడ్‌వైఫ్‌లపై ఆధారపడకూడదని సూచించారు. ఆసుపత్రుల్లో అసెప్టిక్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, శస్త్రచికిత్సల అనంతరం గాయాల ఇన్‌ఫెక్షన్లను గైనకాలజిస్టులు ప్రత్యేకంగా పర్యవేక్షించి తగిన చికిత్స అందించాలని ఆదేశించారు.మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంసీపీ/ఎంటీపీ), సర్వికల్ సర్క్లాజ్ (Cervical Cerclage) వంటి వైద్య విధానాలను నిర్దేశిత ప్రోటోకాల్స్ ప్రకారమే నిర్వహించాలని, అవసరమైన రోగులకు టోటల్ అబ్డామినల్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలను కూడా సకాలంలో చేపట్టాలని సూచించారు. విధి రోజుల్లో గైనకాలజిస్టులు ఆసుపత్రిలో తగినంత సమయం అందుబాటులో లేకపోవడం వల్ల సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గుతోందని, రెసిడెంట్ విధులను సమర్థవంతంగా నిర్వహించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పవిత్ర, డా. శ్రీధర్, గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బాధాకరం...

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



**జగిత్యాల జులై 31 (వుదయం ప్రతినిధి)**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం చాలా బాధాకరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాన్నారు.

## స్థంభంపెల్లి పెద్దచెరువు పరిస్థితిని పరిశీలన...

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**ప్రస్తుతం చెరువు కట్ట తూముకు ఎలాంటి నిప్ప లేదు...**

**అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి...**



**జగిత్యాల జులై 31 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో జూలై 29 2026న 175.7 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదవడంతో స్థంబంపల్లి గ్రామ పరిధిలోని పెద్దచెరువుకు అధిక వరద ప్రవాహం చేరింది చెరువు తూముకు ఆనుకుని గతంలో ఏర్పడిన సింక్ హోల్ ప్రాంతంలో పరిస్థితిని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ శుక్రవారం పర్యవేక్షించారు భారీ వరదల నేపథ్యంలో సాండ్ బ్యాగ్స్ దెబ్బతిని చెరువు కట్టకు నష్టం జరిగే అవకాశం ఉన్నందున రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ మేరకు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పెద్దచెరువును సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు అధికారుల నుండి వివరాలు తెలుసుకొని చెరువు భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలు కొనసాగించాలని సూచించారు జూలై 30 సాయంత్రం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు జూలై 31 నాటికి చెరువుకు వస్తున్న వరద ప్రవాహం కూడా పూర్తిగా తగ్గింది అధికారులు చేపట్టిన నిరంతర పర్యవేక్షణ ఫలితంగా గతంలో ఏర్పాటు చేసిన సాండ్ బ్యాగ్స్ ఎటువంటి నష్టం లేకుండా యథాతథంగా ఉన్నాయి ప్రస్తుతం చెరువు కట్ట తూముకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేశారు అయితే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ తహసీల్దార్ శ్రీనివాస్ ఎంపిడివో డీఈఈ ఏఈఈ వర్క్ ఇన్స్పెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మేక మృతి రూ. 25 వేల నష్టం

**ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేదు ఆందోళనలో గ్రామస్థులు**



**ధర్మపురి జూలై 31 (వుదయం ప్రతినిధి):**

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి ఓ మేక ప్రాణాలు కోల్పో యిన సంఘటన మండలంలోని నాగారం గ్రామంలో చోటుచేసు కుంది.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నాగారం గ్రామానికి చెందిన రైతు వెలుగొండ లచ్చయ్యకు చెందిన మేక మేత మేసేందుకు వెళ్లి ప్రమా దవశాత్తు గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లిం ది.ఆ సమయంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ జరగడంతో విద్యుత్ ఘాతానికి గురై మేక అక్కడికక్కడే మృతి చెందింది. చనిపోయిన మేక విలువ సు మారు రూ. 25 వేలు వరకు ఉంటుందని, తనకు తీరని నష్టం వాటిల్లిందని రైతు లచ్చ య్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికా రులు స్పందించి తనను ఆర్థికం గా ఆదుకోవాలని కోరాడు. ప్రస్తు తం వర్షాకాలం కావడంతో వి ద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో తేమ వల్ల విద్యుత్ ప్రసారమయ్యే ప్రమాదం ఉందని స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అధికారులు ఇప్పటికైనా మేల్కొని గ్రామాల్లోని ప్రమాదక రమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ తక్షణమే రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ముందస్తు జాగ్రత్త లు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మరిన్ని జరిగే అవకాశముందని, ఇప్పటి కైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాయపట్నం వద్ద వరద ఉధృ తిని పరిశీలించిన కలెక్టర్

**రహదారులు దెబ్బతిన్న ప్రాంతాల్లో సత్వర మరమ్మ తులకు ఆదేశం**

**నదీ తీరప్రాంత ప్రజలు,మత్స్యకారు లు అప్రమత్తంగా ఉండాలి**



**ధర్మపురి జులై 31(వుదయం ప్రతినిధి):**

గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యం త్రాంగం తీవ్ర అప్రమత్తమైంది. వర్షాల ప్రభావం,గోదావరి నది వరద ప్రవాహాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీ లించారు.ధర్మపురి మండలం రాయపట్నం వద్ద వేగంగా ప్రవ హిస్తున్న గోదావరి నీటి మట్టా న్ని, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో వివరాలను సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద పరిస్థితుల పై అధికారులు నిరంతరం పర్య వేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. లోత ట్టు ప్రాంతాల ప్రజల ను ముందస్తుగా అప్రమత్తం చేయాలని, అవసరమైతే వారిని తక్షణమే పునరావాస కేంద్రాల కు తరలించేలా ఏర్పాట్లు సిద్ధం చేయా లన్నారు. నదిలోకి మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లకూ డదని, వరద ఉధృతిని చూసేందుకు తీర ప్రాంతాలకు ప్రజలు ఎవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్య లు తీసుకోవాలని స్పష్టం చేశారు.రోడ్లు తెగిపోయిన ప్రాంతాల్లో హుటాహుటిన మరమ్మతులు భారీ వర్షాల ధాటికి ధర్మపురి మండలంలోని పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయా యి.నర్సయ్యపల్లి,కొత్త కొరండ్ల పల్లి గ్రామాల మధ్య కల్వర్టు తెగిపోగా, ఆకసాయిపల్లి, నాగా రం గ్రామాల మధ్య ఉన్న రోడ్ డ్యామ్ బ్రేక్ అయిం ది.ఈ సమా చారం అందుకున్న కలెక్టర్ సత్య ప్రసాద్ ఆయా ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అధికారులతో మాట్లాడి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల నష్టాన్ని అంచనా వేయాల్సింది గా ఆదేశించారు.ప్రజల రాకపోక లకు ఇబ్బంది కలగకుండా తక్షణ మే తాత్కాలిక మరమ్మతు పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. అనంతరం బుద్దేశ్‌పల్లి గ్రామంలోని చెరువు మత్తడిని పరిశీలించి నీటి ఇన్‌ఫ్లో వివరాలు సేకరించారు.వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట రోడ్లు దాటే సాహసం చేయవద్ద ని కలెక్టర్ హెచ్చరించారు. ప్రమా దకర ప్రాంతాల వద్ద పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయం తో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ మధుసూదన్,ధర్మ పురి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రస్తుత వరద పరిస్థితులలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నది వరద పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి నదిలో నీటి మట్టం, వరద ప్రవాహం, భద్రతా చర్యలు, భవిష్యత్ పరిస్థితులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాణహిత నదిలో నీటి మట్టం 146.65 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, దిగువకు 7.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వెళుతుందని, ఎగువ ప్రాంతాల నుండి సుమారు 12 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు లేవని, వరద ప్రవాహం మరింత పెరిగినప్పటికీ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం లేదని, అయినప్పటికీ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నది ఒడ్డు, చెక్‌డ్యాంలు, వాగులు, వంతెనల వద్దకు సరదాగా వెళ్లడం, సెల్ఫీలు దిగడం, ఈత కొట్టేందుకు ప్రయత్నించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని సూచించారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రతిష్ఠాత్మక ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న పనుల పురోగతి వివరాలను ఇరిగేషన్ టెక్నికల్ కన్సల్టెంట్ సత్యానంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులు నాణ్యతతో, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగవంతం చేయాలని తెలిపారు.పంట సాగులో నాట్ల పరిస్థితిని రైతు కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మెరుపులు, ఉరుములు, వరద ప్రవాహాలు ఉన్న సమయంలో పొలాలలో పని చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో కొందరు రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ వరితో పాటు పత్తి, మిరప తదితర పంటలను సాగు చేస్తున్నారని, ఇలాంటి పంటల మార్పిడి విధానం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం సిర్పూర్ (టి) మండలం వెంకట్రావుపేట్ వద్ద పెన్‌గంగా నదిపై ఉన్న వంతెన వద్ద వరద పరిస్థితులు, నీటి ప్రవాహంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు వంతెన మార్గంలో ఒక వ్యాన్ నిలిచిపోవడంతో పాటు, ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓవర్‌లోడ్ వాహనాల రాకను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను తొలగించడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్‌గంగా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి ప్రవాహంపై విచారించి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వంతెన వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి, వరద ప్రభావిత ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్.సి. వినయ్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, తుమ్మిడి హెట్టి సర్పంచ్ సూరజ్, సంతోష్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం.. కలెక్టర్



**జగిత్యాల జులై 31 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్ లోని పాత ఎస్పీ కార్యాలయ భవనంలో తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయం 2026–27 విద్యా సంవత్సరానికి బాలవాటిక–1 (నర్సరీ) నుంచి ఐదవ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 1 2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14, 2026 వరకు కొనసాగుతుందని ప్రతిరోజూ ఉదయం 9 గంటల 30 నిముషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల 40 నిముషాల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు దరఖాస్తులను పూర్తిగా పూరించి అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి కేంద్రీయ విద్యాలయం చలిగల్ తాత్కాలిక క్యాంపస్ పాత ఎస్పీ కార్యాలయ భవనం ధరూర్ క్యాంప్ జగిత్యాల చిరునామాలో సమర్పించాలని సూచించారు ప్రవేశాలు బాలవాటిక–1, బాలవాటిక–2, బాలవాటిక–3, ఒకటవ తరగతి, రెండవ తరగతి, మూడవ తరగతి,నాల్గవ తరగతి , ఐదవ తరగతుల్లో ఖాళీలకు మాత్రమే నిర్వహించబడతాయని తెలిపారు. ప్రవేశాలకు కేవీఎస్ ప్రవేశ మార్గదర్శకాలు–2026–27లో నిర్దేశించిన వయోపరిమితి నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు దరఖాస్తుతో పాటు విద్యార్థి జనన ధృవీకరణ పత్రం ఆధార్ కార్డు కుల ధృవీకరణ పత్రం (వర్తిస్తే) రేషన్ కార్డు/బీపీఎల్/ఆదాయ ధృవీకరణ పత్రం (వర్తిస్తే) రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవా ధృవీకరణ పత్రం/బదిలీ వివరాలు, అలాగే కేవీఎస్ ప్రవేశ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ఇతర పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు ప్రవేశాలు కేంద్రీయ విద్యాలయ సంస్థ (కేవీఎస్) ప్రవేశ మార్గదర్శకాలు–2026–27కు అనుగుణంగా మాత్రమే నిర్వహించబడతాయని పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయాన్ని లేదా కేవీఎస్ మార్గదర్శకాలను సంప్రదించాలని కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం: కలెక్టర్



**కామారెడ్డి, జూలై 31 (వుదయం ప్రతినిధి):**


భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారంకామారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై గత కొన్ని రోజులుగా నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి ఆవరణలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.భారీ వర్షాలతో పెద్ద చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో చెరువు వద్ద సంప్రదాయ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చెరువు పరిసరాలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని జాలర్లను హెచ్చరించారు. ప్రజలు ప్రమాదవశాత్తు చెరువు వైపు వెళ్లకుండా తగిన బారికేడ్లు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. జీఆర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.."ప్రజల ప్రాణ భద్రతే జిల్లా యంత్రాంగం తొలి ప్రాధాన్యం.

## కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలి**

**రాత్రి గస్తీ, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేయాలి**

**పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలి**




**కామారెడ్డి, జూలై 31 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర శుక్రవారం సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై స్టేషన్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలు, నేర నియంత్రణ, దర్యాప్తు తదితర అంశాలను ఎస్పీకి వివరించారు. గతంలో ఎస్ఐలకు జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాలు సిబ్బంది వరకు సక్రమంగా చేరాయా లేదా అనే విషయాన్ని ఎస్పీ ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందికి వ్యక్తిగతంగా లేదా విధుల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలించి, అవి ఏయే నేరాలకు సంబంధించిన కేసుల్లో స్వాధీనం చేసుకున్నవో టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించా రు. తరువాత పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, మాల్ఖానా, టెక్నికల్ రూమ్, పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల స్వభావం, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితునితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలను పూర్తిగా తెలుసుకొని చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీసులు తమ పరిధిలోని కాలనీలు, నివాస ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఉండకూడదని, పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు. డయల్–100 కాల్స్‌పై వేగంగా స్పందించి సంఘటన స్థలానికి వెంటనే చేరుకొని బాధితులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేసి దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాలను నియంత్రించాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, యూనిఫాం టర్నౌట్, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అవార్డులు, రివార్డులతో ప్రోత్సహిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి - కలెక్టర్



**మంచిర్యాల/జూలై 31(వుదయం ప్రతినిధి)**

వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్‌లతో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజు చెత్త సేకరణ, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని తెలిపారు. త్రాగునీటి సరఫరా లో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామంలోని చెరువును మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ తో కలిసి పరిశీలించారు. చెరువు పరిస్థితి, నీటి నిల్వలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు తమ ఇండ్లను నిర్ణీత విస్తీర్ణంలో త్వరగా నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఎన్నుమరేషన్ ఫారం తప్పనిసరి అప్పుడే ఓటరు నమోదు

- **ఆగస్టు 3లోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలి ప్రత్యేక సమగ్ర సవరణలో అలసత్వానికి తావులేదు: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, జూలై 31 (వుదయం బ్యూరో)**

ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకోవాలంటే అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నుమరేషన్ ఫారాన్ని పూరించి బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) అందజేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని 17వ వార్డు భీమ్‌నగర్, రెవెన్యూ కాలనీల పరిధిలోని పోలింగ్ స్టేషన్-256లో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్ర పరిధిలోని మొత్తం ఓటర్ల సంఖ్య, పంపిణీ చేసిన ఎన్నుమరేషన్ ఫారాలు, తిరిగి సేకరించిన పూరించిన ఫారాలు, డిజిటలైజేషన్ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 3వ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి వాటిని సేకరించాలని బీఎల్ఓలకు సూచించారు. మరణించిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు కలిగిన వారు, చిరునామా మార్చుకున్న వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని ఆదేశించారు. ఓటరు జాబితాల తయారీలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, లోపాల్లేని ఓటరు జాబితాను రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, ఉప తహసీల్దార్ అజిత్, సూపర్వైజర్ తిమ్మప్ప, బీఎల్ఓ సునీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టు పనులను పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట/వర్గల్, జూలై 31**

ఆగస్టు 15 నాటికి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు మరియు గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఒక జత యూనిఫాంను తప్పనిసరిగా అందజేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో యూనిఫాం స్టిచ్చింగ్ కోసం జరుగుతున్న క్లాత్ కటింగ్ ప్రక్రియను ఆమె క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్గల్ మండలంలో 3,830 మంది విద్యార్థులకు యూనిఫాంలు కుట్టేందుకు హైదరాబాద్ నుండి వచ్చిన గుడ్డ (క్లాత్)ను నిర్దేశించిన కొలతల ప్రకారం, వృథా కాకుండా జాగ్రత్తగా కటింగ్ చేయాలని సూచించారు. కటింగ్ పూర్తి చేసిన క్లాత్ సమగ్రంగా, వెంటనే మండలంలోని వివిధ గ్రామాల స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేసి, స్టిచ్చింగ్ పనులను వేగవంతం చేయాలని ఏపీఎంను ఆదేశించారు. విద్యార్థులు ధరించేందుకు వీలుగా యూనిఫాంలు చాలా నీట్‌గా, సౌకర్యవంతంగా కుట్టేలా మహిళా సంఘాల సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 15 నాటికి పంపిణీకి సిద్ధం చేయాలనే లక్ష్యంతో పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిరణ్ కుమార్, సీసీలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



- **లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదు: టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్**

**వికారాబాద్, జూలై 31: (వుదయం జిల్లా ప్రతినిధి):**

జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా ఇళ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJH143) ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈరోజు వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ ఆసీఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వికారాబాద్, కోడంగల్, పరిగి, తాండూర్ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపును ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం విచారకరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం జరిగిన సమావేశంలో టీయూడబ్ల్యూజే సంస్థ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, జిల్లా వ్యాప్తంగా మండల మరియు డివిజన్ స్థాయి కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.
ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి యేగానంద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు తిరుపతి నాయక్, జిల్లా నాయకులు రవీందర్, ఆసీఫ్ హుస్సేన్, ప్రహ్లాదాచారి, శ్రీనివాస్, నర్సిములు, ఆనంద్, జావీద్, రాజు, బస్వరాజ్, సంతోష్, మల్కయ్య గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
వికారాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే నూతన అడహాక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
ఈ సమావేశంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJH143) వికారాబాద్ జిల్లా నూతన అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
జిల్లా కన్వీనర్‌గా:
ఎం. రవీందర్
కోకన్వీనర్లుగా: ప్రహ్లాదాచారి, శ్రీనివాస్, నర్సిములు, ఆనంద్, జావీద్, రాజు, బస్వరాజ్, సంతోష్, మల్కయ్య గౌడ్, కృష్ణ, రాజేందర్ గౌడ్లను జిల్లా జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టీయూడబ్ల్యూజేను మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సభ్యత్వ విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది.

## గీతంలో ఘనంగా అచీవర్స్ డే వేడుకలు

- **విజేతలకు నియామక పత్రాల అందజేత**

**పటాన్చెరు (వుదయం):**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ప్రాంగణ నియామకాలు, ఉన్నత విద్యలో విద్యార్థులు సాధించిన అద్భుతమైన విజయాలను గుర్తిస్తూ, శుక్రవారం అచీవర్స్ డే 2026ను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంది. వృత్తి మార్గదర్శక కేంద్రం (కెరీర్ గైడెన్స్ సెంటర్ - సీజీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, విద్యా నైపుణ్యం, పరిశ్రమకు సన్నద్ధత, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి పట్ల విశ్వవిద్యాలయానికి ఉన్న బలమైన నిబద్ధతను ప్రతిబింబించింది.
ఈ సందర్భంగా, 2026లో గ్రాడ్యుయేట్ అయ్యే బ్యాచ్ కు సంబంధించిన ప్రాంగణ నియామక ఫలితాలను గీతం ప్రకటించింది. జూలై 2026 నాటికి, ప్రాంగణ నియామకాలను ఎంచుకున్న 1,347 మంది విద్యార్థులలో 771 మంది (60 శాతం) ప్లేస్ మెంట్లు సాధించారు. విశ్వవిద్యాలయంలోని ఏడు స్కూళ్లలో 324 ప్రముఖ నియామక సంస్థల ద్వారా వెయ్యికి పైగా ఉద్యోగ ఆఫర్లు అందించారు.
గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) 97.5 శాతం ఓవరాల్ ప్లేస్ మెంట్ రేటుతో అగ్రగామిగా నిలిచింది. ఇది అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో వంద శాతం, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయిలో 95.8 శాతం ప్లేస్ మెంట్లను సాధించింది. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (జీఎస్ఏ) కూడా వంద శాతం ప్లేస్ మెంట్లను నమోదు చేసింది. స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు 6.94 లక్షల వార్షిక ప్యాకేజీతో అత్యధిక సగటును సాధించగా, గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 544 ఉద్యోగ ఆఫర్లతో, 443 మంది విద్యార్థుల ప్రాంగణ నియామకాలతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ సీజన్ లో అత్యధికంగా 16 లక్షల రూపాయల వార్షిక జీతం ప్యాకేజీని గీతం విద్యార్థులు సాధించారు. ఈ కార్యక్రమానికి పీడబ్ల్యూసీ ఏసీ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆపరేషన్స్ లీడర్ (టాక్స్) జీ.టీ. కృష్ణ చైతన్య, టీసీఎస్ ప్రాంతీయ అధిపతి (అకడమిక్ అలయన్సెస్) రిచర్డ్ కింగ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నిరంతర అభ్యాసం, ఆవిష్కరణ, వృత్తిపరమైన నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులను వారు ప్రోత్సహించారు. విజేతలకు కెరీర్ ఫుల్ ఫిల్ మెంట్ సర్టిఫికెట్లను అందజేశారు.



తొలుత, స్వాగతోపన్యాసంలో గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు మాట్లాడుతూ, "గీతం విద్యా ప్రమాణాలు, కెరీర్‌సిద్ధత కార్యక్రమాలపై పరిశ్రమకు ఉన్న నిరంతర విశ్వాసాన్ని ఈ ఏడాది ప్లేస్ మెంట్ సీజన్ ప్రతిబింబిస్తోంది. వెయ్యికి పైగా ఉద్యోగ ఆఫర్లు, 16 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో, మా విద్యార్థులు పోటీతో కూడిన ప్రపంచ ఉద్యోగ మార్కెట్ లో రాణించగల తమ సామర్థ్యాన్ని మరోసారి ప్రదర్శించారు. పరిశ్రమ భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి, మా విద్యార్థులకు మరిన్ని కెరీర్ అవకాశాలను కల్పించడానికి మేము కట్టుబడి ఉన్నాం" అని అన్నారు. విజేతలైన జి.సృజన్ (సీఎస్ఈ), డి.వీణాశ్రీ (సీఎస్ఈఏఐఎంఎల్), ఇ.జె. సంఘమిత్ర (ఈఈసీఈ), నిహారిక నోముల (ఎంబీఏ), పమిశెట్టి ప్రేమ్ కుమార్ (ఎమ్మెస్సీ డేటా సైన్స్) తమ ప్లేస్ మెంట్ అనుభవాలను, విజయ గాథలను పంచుకున్నారు. తల్లిదండ్రుల తరపున జి.సృజన్ తండ్రి ఎన్.వి. శ్రీనివాస్ స్వరూప్, విశ్వవిద్యాలయ విద్యా వ్యవస్థను, కెరీర్ మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు.
ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, అధ్యాపక సభ్యులు, విభాగాధిపతులు, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు తదితరులు హాజరయ్యారు. వీరిలో డాక్టర్ రమేష్ వడ్డి, ప్రొఫెసర్ జి.శివకుమార్, డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, డాక్టర్ మోతహర్ రెజా, డాక్టర్ బందన్ కుమార్ మిశ్రా, డాక్టర్ శామ్యూల్ ధరు, కెరీర్ గైడెన్స్ సెంటర్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఎడ్విన్ ఆంథోనీ, డైరెక్టర్ డాక్టర్ కె.మమత కూడా ఉన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి**
- **లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, జూలై 31:-వు దయం.**

రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.
ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని సూచించారు.
శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్య, మత్స్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
జిల్లాలో నమోదైన వర్షపాతం, రానున్న రోజుల వర్ష సూచనలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.
గ్రామాలు, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాత భవనాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా పూర్తి వివరాలను అన్ని శాఖలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వరదలు లేదా ఇతర



నష్టాలు సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, పశుసంపద, పంటలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రత్యేక మండల అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.
త్రాగునీటికి ప్రాధాన్యతనివ్వాలని, జిల్లాలో ప్రజలకు ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.
ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు చేయకుండా, భూగర్భ జలాల లభ్యత, ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.
పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, వరదనీటి పారుదల, అత్యవసర సేవలకు సంబంధించి ముందస్తు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, రాత్రికి రాత్రే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి మండలంలో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాటు చేసి తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదకర చెరువులు, కాలువలు, కాజ్‌వేలు, ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**వనపర్తి జులై 31 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో డెంగ్యూ కేసులు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోండి
ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీసం 300 మందికి రక్త పరీక్షలు నిర్వహించాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్య పెంచండి ప్రతినెల మొదటి స్థానంలో నిలిచిన పి.హెచ్.సి.కి లక్ష రూపాయల మంజూరు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభివర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సీజనల్ వ్యాధులు, టి.బి నిర్మూలన, ఎ.ఎన్.సి నమోదు, పి.హెచ్.సి లలో ప్రసవాల సంఖ్య పెంచటం పై సమీక్ష నిర్వహించారు.
వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులతో పాటు డయేరియా కేసులు పెరిగే అవకాశం ఉంటుందని అందువల్ల వీటిని అరికట్టడానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైతే గత సంవత్సరం డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా కేసులు నమోదు అయ్యాయో అక్కడ ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.
పాము కాటు, కుక్క కాటు వంటి ప్రమాదాలు జరిగినప్పుడు చికిత్సలు అందించే విధంగా మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.
క్షయ వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎ.ఎన్.సి నమోదు పెరిగే విధంగా



చూడాలని అదే విధంగా ఏ.ఎన్.సి నమోదు సకాలంలో జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని పేద గర్భిణులకు ప్రైవేట్ హాస్పిటల్ లో కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు.
ప్రతి నెల ప్రసవాల రికార్డులు చూస్తామని, అత్యధికంగా ప్రసవాలు నిర్వహించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లక్ష రూపాయల నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరికరాలు ఏమైనా కావాలి అంటే అట్టి ప్రతిపాదనలు పెట్టాలని సూచించారు.
జిల్లా వైద్యాధికారి డా. సాయినాథ్ రెడ్డి, ప్రభుత్వ వైద్యశాల సుపరిండెంట్ డా. చంద్రమోహన్, ఆర్.యం.ఓ డా. జావిద్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. భాస్కర్, డాక్టర్ పరిమళ, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో వైన్ టూరిజం అభివృద్ధికి కొత్త అవకాశాలు

- **అమెరికా వైనరీలను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్ జిల్లా 31జూలై (వుదయం బ్యూరో )**

తెలంగాణ రాష్ట్రంలో వైన్ టూరిజం అభివృద్ధికి విశాలమైన అవకాశాలు ఉన్నాయని అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియా రాష్ట్రంలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీను సందర్శించిన మంత్రి, అక్కడి నిర్వహణ విధానం, వైన్ తయారీ ప్రక్రియలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే అష్‌బర్న్‌లోని మరొక వైనరీని సందర్శించి, ద్రాక్ష సాగు నుండి వైన్ తయారీ వరకు జరిగే ప్రతి దశపై అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో సమావేశమై ద్రాక్ష రకాలు, ప్రాసెసింగ్ విధానాలు, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యత ప్రమాణాలు మరియు మార్కెటింగ్ వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ సేవలు, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులు కల్పించే విధానాన్ని మంత్రి ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ తరహా మోడల్‌ను తెలంగాణలో అమలు చేయవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి తెలిపారు. వాతావరణ పరిస్థితులు, భూసంపద, పెట్టుబడి అవకాశాలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వైన్ టూరిజం ద్వారా ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం లభించడంతో పాటు స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షితమవడంతో ప్రాంతీయ అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా వినూత్న పర్యాటక ఉత్పత్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో ద్రాక్ష సాగు నుండి వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను ప్రత్యక్షంగా సందర్శకులు అనుభవించవచ్చు. అదనంగా సంప్రదాయ పద్ధతిలో ద్రాక్ష తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా అందించనున్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలను పరిశీలించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ పర్యటనలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కూడా మంత్రితో పాటు పాల్గొన్నారు.



## పురపాలికల పాలనపై వార్డు సభ్యులకు శిక్షణ



**నాగర్ కర్నూల్ రూరల్, జులై 31 (వుదయం ప్రతినిధి) :**

హైదరాబాదులో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ మున్సిపాలిటీల వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.
ఈ శిక్షణలో పట్టణాభివృద్ధి, పారదర్శక పాలన, పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరా, వీధిదీపాల నిర్వహణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. పురపాలికల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడం వంటి అంశాలపై అధికారులు దిశానిర్దేశం చేశారు.

## ఆటో డ్రైవర్లకు నష్టపరిచే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి

- **టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కే కాశీనాథ్**

**నారాయణపేట జులై 31 (వుదయం ప్రతినిధి)**



ఆటో డ్రైవర్లకు నష్టపరిచే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే కాశీనాథ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ సంస్థ ద్వారా ఆటోలను నడిపిస్తామని, బస్సు టికెట్ బుక్ చేసినప్పుడే ఆటో టికెట్ కూడా బుక్ చేసుకోవచ్చని ప్రకటించి నేడు ఆర్టీసీ వైపే ఎక్కువ దృష్టిసారించి ఆటో డ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఇది ఆటో కార్మికుల పొట్టకొట్టే చర్య, ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సు పెట్టినప్పటి నుండి మహిళా ప్రయాణికులు ఆటోలలో ప్రయాణించడం తగ్గిందన్నారు. దీంతో తీవ్రమైన ఆర్థిక భారంతో ఆటో కార్మికులు తమ జీవితాలను వెలదీస్తున్నారు. ఆటో కార్మికులకు 12 వేల ఆర్థిక సహాయం చేస్తామని ఎన్నికల హామీలు భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన అది ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి లేదంటే ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సంస్థతో ఎలక్ట్రికల్ వెహికల్ సంస్థ దగ్గర తీసుకునేటువంటి ఒప్పందం రద్దు చేసుకొని ఇప్పటికే ఆటోలు నడిపిస్తున్నటువంటి ఆటోడ్రైవర్లకే ఆ అవకాశం కల్పించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కింద రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి చూపించి ఏ సంస్థలకు కాంట్రాక్టు అప్పగించకుండా ఆటో డ్రైవర్లని భాగస్వాములు చేసి ఉపాధి కల్పించాలన్నారు. రోడ్డు మీద ఆటోలు నడుపుతున్న ప్రతి ఆటో కార్మికునికి రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ వెహికల్ ఆటో లను మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమంలో ఆటో కార్మికుల్ని భాగస్వాములు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు సాబేర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆటో కార్మిక సంఘాలని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.




## టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు

**గద్వాల జూలై 31 (వుదయం కరస్పాండెంట్)**

గద్వాల మండల పరిధిలోని పుటాన్‌పల్లి గ్రామంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలుర) జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, మానవ అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు వి. రాజేందర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అనేది చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని అన్నారు. విద్యార్థులు పరస్పరం గౌరవం, సహకారం, స్నేహభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, అలాంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా తీవ్రమైన సామాజిక నేరమని, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, బలహీన వర్గాల ప్రజలు దీని బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఉద్యోగాలు, విద్య, ఉపాధి అవకాశాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేదా అక్రమ కార్యకలాపాలు ఎదురైనా భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. ర్యాగింగ్, మానవ అక్రమ రవాణా వంటి నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు బి. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కె. రాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదమ్ముల ఆస్తి వివాదంపై డీఎల్‌పీఓ యాదయ్య విచారణ

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం డీఎల్‌పీఓ యాదయ్య అన్నదమ్ముల మధ్య నెలకొన్న ఆస్తి వివాదంపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదమ్ముల ఆస్తి తగాదా విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో ఇరు వర్గాల వాదనలు విని, సంబంధిత స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం నివేదికను సిద్ధం చేసి పై అధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రజినీకాంత్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు సరితా దేవి, యాదవ లక్ష్మి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులు



**వెల్దండ జులై 31 (వు దయం)**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ జంగిలి నిరంజన్ పేర్కొన్నారు.శుక్రవారం శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగిలి నిరంజన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన త్యాగాలు, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం అనేక కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నాయకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన కోసం ఆయన చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన విశిష్ట సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగం విజయ్ గౌడ్, కానుగుల జోగయ్య, మొక్తల శేఖర్ ముదిరాజ్, పోలే అశోక్ కుమార్, గుద్దటి ప్రభాకర్, ధ్యాప ఆనంద్ రెడ్డి,లింగం ముదిరాజ్,జంగిలి యాదగిరి,డీలర్ వెంకటయ్య,గోరటి అశోక్, లక్ష్మారెడ్డి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ మరో ముందడుగు

- **పెద్దకంజర్ల పాఠశాలల్లో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు, క్రీడా సామగ్రి పంపిణీ**

**పటాన్‌చెరువు, జూలై 31:వుదయం:**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో పార్కర్ హనీ ఫిన్ ఇండియా సంస్థ సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్‌చెరువు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాల పెద్దకంజర్లలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు,క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిల్లు, షార్పనర్లు, రబ్బర్లు, పలకలు తదితర విద్యా సామగ్రితో కూడిన ఎడ్యుకేషన్ కిట్లను అందజేశారు. అలాగే విద్యార్థుల శారీరక వికాసానికి ఉపయోగపడే స్పోర్ట్స్ మెటీరియల్‌ను కూడా పంపిణీ చేశారు.కార్యక్రమంలో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేయాలని, అందుకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.గత ఐదేళ్లుగా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా తమ సంస్థ విశేషంగా సహకరిస్తోందన్నారు. తాము ఎంపిక చేసిన పాఠశాలల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని, అలాంటి విజయాలకు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కమ్యూనిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారమే ప్రధాన కారణమని అన్నారు.




తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకోవడం వల్ల విద్యార్థుల నమోదు కూడా పెరుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. సంస్థ అందిస్తున్న సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల స్థాయి సౌకర్యాలు పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తరపున మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థకు, పార్కర్ హనీ ఫిన్ ఇండియా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. విద్యాసాగర్, రాములు, పార్కర్ కోఆర్డినేటర్ హాఫీజ్ అహ్మదయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# దశాబ్దాల సేవలకు వీడ్కోలు


- **పదవీ విరమణ పొందిన పోలీసులను సత్కరించిన అదనపు ఎస్పీ**

**నాగర్‌కర్నూల్ జిల్లా, జులై 31 (వుదయం బ్యూరో) :**

నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం విశిష్ట సేవలందించిన చారకొండ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఏ. గోపాల్, ఊరకొండ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ పాషా గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందిన అధికారులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం ఎన్నో సంవత్సరాల పాటు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పోలీసు శాఖలో వారు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వృత్తి జీవితంలో సాధించిన విజయాలు, సంపాదించిన గౌరవం, ప్రజల అభిమానమే వారి సేవలకు నిదర్శనమని కొనియాడారు.పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమే, జీవితానికి కాదని, ఇకపై వారు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డి.ఎస్.పి సాయి వెంకట్ రెడ్డి, అచ్చంపేట డి.ఎస్.పి శ్రీనివాసులు, సీసీఎస్ సీఐ శంకర్, ఏఓ కృష్ణయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏఎస్ఐ గునవర్ధన్ తో పాటు వారి కుటుంబ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా..?

- **మార్కెట్ రోడ్డులో భారీ గుంత.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**
- **రద్దీ మార్గంలో నిత్యం ప్రాణాలతో చెలగాటం.. వాహనదారులు, పాదచారుల అవస్థలు**
- **పలుమార్లు సమస్యను తెలియజేసినా స్పందన కరువు**
- **ప్రమాదం జరిగాక కాదు.. వెంటనే గుంతను పూడ్చాలని స్థానికుల విజ్ఞప్తి**



**(వుదయం)పెద్ద శంకరంపేట ప్రతినిధి జులై 31**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని రద్దీగా ఉండే మార్కెట్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంత రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. నిత్యం వందలాది మంది వాహనదారులు, పాదచారులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ, సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంత మరింత లోతుగా మారి నీటితో నిండిపోవడంతో దాని లోతు గుర్తించడం కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని వాపోతున్నారు.ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ప్రజలు, స్థానిక మీడియా దృష్టికి తీసుకువచ్చినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "ఎవరైనా ప్రాణాలు కోల్పోయిన తర్వాతే చర్యలు తీసుకుంటారా?" అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.మార్కెట్ ప్రాంతంలో ఉన్న ఈ గుంతను తక్షణమే పూడ్చి, రహదారిని మరమ్మతు చేయాలని స్థానికులు ఆర్అండ్‌బీ, గ్రామపంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకముందే అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



# జూరాలపై ఎస్పీ అప్రమత్తం

- **కర్ణాటక నుంచి ఉద్ధృతంగా వరద ప్రవాహం..**
- **24 గేట్ల ద్వారా నీటి విడుదల**
- **ప్రజల భద్రతే తొలి ప్రాధాన్యం..**
- **లోతట్టు గ్రామాలపై ప్రత్యేక నిఘా**
- **ఎస్పీ టి. శ్రీనివాసరావు**

**గద్వాల, జులై 31 (వుదయం బ్యూరో)**

కృష్ణా నదికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉండాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశించారు. వరద పరిస్థితులను ప్రత్యక్షంగా అంచనా వేసేందుకు శుక్రవారం జూరాల ప్రాజెక్టును సందర్శించిన ఆయన, ప్రాజెక్టు అధికారులతో కలిసి నీటి ప్రవాహం, గేట్ల నిర్వహణ, భవిష్యత్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు సుమారు 1.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 1,15,515 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 64 గేట్లలో ప్రస్తుతం 24 గేట్లను ఎత్తి వరద నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ఆరు గ్రామాల్లో ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వరదల సమయంలో రెవెన్యూ, ఇరిగేషన్, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు ఎప్పటి కప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఏఈలు సుదర్శన్, సిద్దయ్య, కిషోర్ కుమార్, గద్వాల రూరల్ ఎస్ఐ సీహెచ్. శ్రీకాంత్, ధరూర్ ఎస్ఐ నందికర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు వెంటనే పంపాలి



- **అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలి**
- **జిల్లాకలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, జులై 31 (వుదయం బ్యూరో) :**

ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసి, అర్హుల వివరాలను నిర్ణీత గడువులోగా పంపాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఇన్చార్జి పిడి హౌసింగ్ గోపాల్ నాయక్, హౌసింగ్ ఏఈలు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, పథకం అమలులో పారదర్శకత, వేగం ఉండాలని చెప్పారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, ఫీల్డ్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

గుడిసెల్లో ఉండే నిరుపేదలు, గృహరహితులు, అత్యంత వెనుకబడిన వర్గాల అర్హులకు రెండో విడతలో ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనర్హులు జాబితాలోకి రాకుండా, అర్హులు ఎవరూ మిగిలిపోకుండా చూడాలని స్పష్టం చేశారు.సమాచారం పంపడంలో జాప్యం వద్దని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గడువులోగా జాబితాలు జిల్లా కేంద్రానికి పంపాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో డిపిఓ శ్రీరాములు, హౌసింగ్ ఏఈలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్**

**నాగర్ కర్నూల్, జులై 31 (వుదయం ప్రతినిధి) :**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8000 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్ మాట్లాడుతూ, పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఆధారమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. నిధులు అందక కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులే ఈ పథకంపై ఎక్కువగా ఆధారపడుతున్నారని, దీన్ని ఎత్తివేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. విద్యాశాఖకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. రూ.8000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి
2. ఈ ఏడాది నుంచే పథకాన్ని కొనసాగించాలి



3. ఫీజుల కోసం విద్యార్థులను వేధించవద్దు

ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాచూరి బాల్‌రాజు, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్ళ నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్, జిల్లా బిసి మహిళా అధ్యక్షురాలు సిహెచ్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

- **తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలి : డీఎంహెచ్‌వో డా. సంధ్యా కిరణ్మయి**
- **జిల్లాలోని అన్ని డెలివరీ పాయింట్లలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశం**

**గద్వాల, జూలై 31 (వుదయం కరస్పాండెంట్)**

ప్రపంచ తల్లిపాల వారోత్సవంను ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు, డెలివరీ పాయింట్లలో ఘనంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సంధ్యా కిరణ్మయి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, తల్లిపాల అందించే విధానాలను సంరక్షించడం, ప్రోత్సహించడం, మరింత బలోపేతం చేయడం ప్రపంచ తల్లిపాల వారోత్సవం ప్రధాన లక్ష్యమని తెలిపారు. తల్లిపాలు నవజాత శిశువుల ప్రాణరక్షణతో పాటు వారి ఆరోగ్యకరమైన ఎదుగుదల, వ్యాధినిరోధక శక్తి పెంపు, భవిష్యత్తులో అంటువ్యాధులు కాని వ్యాధులు (ఎన్‌సీడీలు) వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవం థీమ్ "జీవితానికి సుస్థిరమైన ఆరంభం కోసం తల్లిపాలు - ఇప్పటికే ఫలితాలిచ్చిన చర్యలను మరింత బలోపేతం చేద్దాం" అనే సందేశంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు



తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే అందించడం వంటి నిరూపితమైన ఆరోగ్య చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆమె వివరించారు. ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి ఉత్తమ ఆరంభాన్ని అందించడంలో తల్లిపాలు కీలకమని అన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, డెలివరీ పాయింట్లలో వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, తల్లులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, ఇతర ఆధారాలతో కూడిన నివేదికలను జిల్లా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. అస్గర్ అలీ మాట్లాడుతూ, ప్రపంచ తల్లిపాల వారోత్సవం-2026 సందర్భంగా విడుదల చేసిన మార్గదర్శకాలను జిల్లాలోని అన్ని డెలివరీ పాయింట్లలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి తల్లి, శిశువుకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కోరారు.

# 'గులాబీ' గూటిలో రాజుకున్న తిరుగుబాటు ప్రయోజ్వాల!



- **మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్ణయాలపై సొంత పార్టీ కౌన్సిలర్ల బహిరంగ సమరశంఖం**
- **9 అజెండా అంశాలపై ససేమిరా.. 'డిసెంట్' అస్త్రంతో బిఆర్ఎస్ కౌన్సిలర్ల విరుచుకుపాటు!**

**గద్వాల జులై 31 (వుదయం బ్యూరో)**

గద్వాల పురపాలక వర్గాల్లో చాన్నాళ్లుగా లాలూచీ రాజకీయాల వెనుక దాగి ఉన్న అంతర్గత అసంతృప్తి ఒక్కసారిగా అగ్నిపర్వతంలా బద్దలైంది! శుక్రవారం నిర్వహించిన సాధారణ మండలి సమావేశం వేదికగా అధికార బీఆర్ఎస్ పార్టీలో ముసుగున రాజకీయం రచ్చకెక్కింది. చైర్‌పర్సన్ పోకడలపై విసుగెత్తిన సొంత పార్టీ కౌన్సిలర్లే ప్రత్యక్ష పోరాటానికి దిగి, తిరుగుబాటు జెండా ఎగరవేసారు. కౌన్సిల్ ఆమోదం కోసం తెరపైకి తెచ్చిన అజెండాలోని 9 కీలక అంశాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ, 'డిసెంట్' (అసమ్మతి) అస్త్రాన్ని ప్రయోగించడం స్థానిక రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపింది. పలు వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన 3, 6, 7, 9, 11, 15, 18, 19, 22 అంశాలపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిప్పులు చెరిగారు. పారదర్శకతకు పెద్దపీట వేయకుండా, నిబంధనలను అటకెక్కించే యత్నాలను తమ ప్రాణం ఉన్నంతవరకు అంగీకరించ బోమని తెగేసి చెప్పారు. ఈ మేరకు తమ అభ్యంతరాల లేఖను చైర్‌పర్సన్ ముఖాన పెట్టి, రికార్డుల్లో నమోదు చేయాల్సిందేనని పట్టుబట్టారు. పైగా, ఈ మున్సిపల్ లొల్లిని జిల్లా కలెక్టర్ దర్బార్‌లోనే తేల్చుకుంటామని హెచ్చరించడం గులాబీ శ్రేణుల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

# దద్దరిల్లిన గద్వాల.. శివమెత్తిన బోనాల జాతర!

- **డప్పుల మోత.. పోతురాజుల వీరంగం.. మార్మోగిన పురవీధులు**
- **సత్యసాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శోభాయాత్ర**
- **తెలంగాణ ఆత్మగౌరవానికి అద్దం పట్టిన విద్యార్థుల విన్యాసాలు**
- **గ్రామదేవత సుంకులమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ**


**గద్వాల జులై 31 (వుదయం కరస్పాండెంట్)**

జోగులాంబ గద్వాల గడ్డపై బోనాల జాతర శివమెత్తింది! డప్పుల రణగొణ ధ్వనులు, పోతురాజుల వీరంగాలు, శివసత్తుల పూనకాలతో జిల్లా కేంద్రం భక్తిపారవశ్యంలో తడిసిముద్దయింది. స్థానిక సత్యసాయి విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆషాఢ మాస బోనాల శోభాయాత్ర పట్టణ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల ఆత్మగౌరవాన్ని చాటుతూ సాగిన ఈ ఉత్సవం పురవీధులను ఊపేసింది. పట్టువస్త్రాలు ధరించిన బాలికలు శిరస్సుపై నిప్పుల బోనాలు ధరించి దేదీప్యమానంగా కదలివస్తుంటే, గుండెలు అదిరిపోయేలా పడిన డప్పు దెబ్బలు పట్టణాన్ని ఊపేశాయి. పోతురాజుల వేషధారణలో విద్యార్థులు చేసిన రౌద్ర, రసవత్తర నృత్యాలు, భక్తి పారవశ్యం




నిండిన జైజైధ్వానాలు ఊరేగింపునకు రౌద్ర తేజస్సును తెచ్చిపెట్టాయి. ఊరేగింపు సాగినంత మేరా స్థానిక ప్రజలు నీరాజనాలు పడుతూ పూలవర్షం కురిపించారు. అనంతరం సకల సుంకులమ్మ ఆలయానికి చేరుకుని గ్రామదేవతకు నైవేద్యాలు సమర్పించారు. పాశ్చాత్య ధోరణుల్లో కొట్టుకుపోతున్న నేటి తరానికి మన మట్టి వాసనల సంస్కృతిని, వీరత్వాన్ని, ఆధ్యాత్మికతను నూరిపోసేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు పాఠశాల ఇంచార్జ్ అర్చన ఘంటాపథంగా తెలిపారు. ఈ జాతర మహోత్సవంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది జయసింహ, సుచిత్ర, రాజేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



- **ఆరోగ్య మంత్రి ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పరిశుభ్రత చర్యలు : డీఎంహెచ్‌వో డా. సంధ్యా కిరణ్మయి**

**గద్వాల, జూలై 31 (వు దయం కరస్పాండెంట్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సంధ్యా కిరణ్మయి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ వైద్య సంస్థల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని గౌరవ ఆరోగ్య మంత్రి ఇటీవల అధికారులను ఆదేశించిన నేపథ్యంలో, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ప్రత్యేకంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలు, వార్డులు, ఓపీ విభాగాలు, మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రపరిచి, రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగిస్తూ రోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్‌వో డా. సంధ్యా కిరణ్మయి వైద్య సిబ్బందికి సూచించారు.

# బైక్ చోరీ కేసును చేదించిన పోలీసులు

- **నిందితుడికి రిమాండ్ వాహనం స్వాధీనం**

**దౌల్తాబాద్, ఆగస్టు 01(వుదయం):**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగిన ద్విచక్రవాహన చోరీ కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ జి. అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్‌లోని ఎల్లమ్మ ఆలయం సమీపంలోని కల్లు దుకాణం వద్ద పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన వరదం యాదగిరి అపహరించాడు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రజలకు పలు




సూచనలు చేశారు. వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా లాక్‌తో పాటు ఇతర భద్రతా పరికరాలను వినియోగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతికి ఎమ్మెల్యే సంతాపం

- **తెలంగాణ ఉద్యమంలో.. బిఆర్ఎస్ పార్టీ బలోపేతంలో ఆయన సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**

**పటాన్చెరు (వుదయం):**



నర్సంపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బిఆర్ఎస్ పార్టీకి,తెలంగాణ రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్న ఎమ్మెల్యే జిఎంఆర్.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# హమాలీ కి లయన్స్ క్లబ్ అండ

**నారాయణపేట జూలై 31 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట పట్టణానికి చెందిన హమాలీ కార్మికుడు సాయిలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ మార్కెట్ ప్రాంతం లో ఒంటరిగా ఉంటూన్నాడు. మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించడంతో,సాయిలు కుటుంబ సభ్యుల కోరిక మేరకు లయన్స్ క్లబ్ కు చెందిన అంబులెన్స్ ద్వారా ఉచితంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఈ సంద ర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట



అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలవడం నిజమైన మానవత్వమన్నారు. లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ మానవతా దృక్పథంతో సేవా కార్యక్ర మాలు కొనసాగిస్తూ ఆపద ఉన్న వారికి మా వంతు సహాయం అందిస్తామని రవికుమార్ గౌడ్ తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

# అందంగా ఉండాలంటే.. ఒత్తిడి వద్దు!



దీర్ఘకాలిక ఒత్తిడి, ఆందోళనలు మన అందంపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు సౌందర్య నిపుణులు. టెన్షన్ పడినప్పుడు చర్మంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అలాగే ఒత్తిడికి గురైనప్పుడు ఏది పడితే అది తింటుంటారు. ఇదీ ఒక రకంగా సౌందర్యంపై ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ఒత్తిడి, ఆందోళనలకు గురైనప్పుడు ముఖ సౌందర్యం విషయంలో కొన్ని మార్పులు గమనించచ్చంటున్నారు నిపుణులు.

ఒత్తిడి, ఆందోళనలకు గురైనప్పుడు శరీరంలో ఎక్కువ మొత్తంలో కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) విడుదలవుతుంది. ఇది చర్మంపై ఉండే నూనె గ్రంథుల్ని (సెబేషియస్ గ్రంథులు) ప్రేరేపించి ఎక్కువ మొత్తంలో నూనెలు విడుదలయ్యేలా చేస్తుంది. తద్వారా చర్మ గ్రంథులు మూసుకుపోయి మొటిమలొస్తాయంటున్నారు నిపుణులు. సాధారణంగా వయసు పైబడే కొద్దీ కళ్ల కింద వాపు (ఐ బ్యాగ్స్), కనురెప్పలు ఉబ్బడం.. వంటి సమస్యలొస్తాయి. అయితే ఒత్తిడి వల్ల నిద్ర లేకపోవడం కూడా ఈ సమస్యను తెచ్చిపెడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. చర్మం స్థితిస్థాపకతను కోల్పోవడం, పిగ్మెంటేషన్, చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు దరిచేరడం.. ఇలా ఒత్తిడి అందంపై పలు రకాలుగా ప్రతికూల ప్రభావం చూపుతుందట! చర్మం కింద ఉండే ప్రొటీన్, లిపిడ్స్ చర్మ కణాలు తేమగా ఉండడంలో సహకరిస్తాయి. అయితే ఒత్తిడి కారణంగా వాటి పనితీరు దెబ్బ తింటుంది. ఫలితంగా చర్మం పొడిబారిపోవడం, దురద రావడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. ఒత్తిడి కారణంగా సౌందర్యంపై ఇంతలా ప్రభావం పడుతుంది కాబట్టే ఇలాంటి మానసిక సమస్యలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొన్ని చిన్న చిన్న చిట్కాల్ని పాటించాల్సి ఉంటుంది. ఖాళీగా ఉంటే ఏవేవో ఆలోచనలతో మనసంతా అయోమయంగా ఉంటుంది. ఇలాంటప్పుడు మీకు ఏ పనైతే ఇష్టంగా చేయాలనిపిస్తుందో ఆ పనిలో బిజీగా మారిపోమంటున్నారు నిపుణులు. తద్వారా మనసు ప్రశాంతంగా ఉండడంతో పాటు ఏదో తెలియని సంతృప్తి కలుగుతుంది. మనం రోజూ తీసుకునే ఆహారం ద్వారా కూడా ఒత్తిడిని అదుపు చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. ఈ క్రమంలో డార్క్ చాక్లెట్, గుడ్లు, ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే చేపలు, చామొమైల్ టీ.. వంటివి చక్కగా పనిచేస్తాయట! వీటిలో ఉండే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లే అందుకు ప్రధాన కారణమంటున్నారు నిపుణులు. ఒత్తిడిని కలుగజేసే కార్టిసాల్ హార్మోన్ స్థాయుల్ని అదుపులో ఉంచడంలో వ్యాయామం, యోగా, ధ్యానం.. వంటివి చక్కగా ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు. అందుకే రోజూ ఉదయం లేదా సాయంత్రం ఓ అరగంట పాటు మీకు నచ్చిన వ్యాయామాలు చేయాలంటున్నారు. ఒత్తిడిగా అనిపించినప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు, మీ మనసుకు నచ్చిన వారితో కాసేపు సమయం గడిపి చూడండి.. మంచి ఉపశమనం లభిస్తుంది. ఒకవేళ ఈ చిట్కాలన్నీ పాటించినా ఒత్తిడి, ఆందోళనల నుంచి బయటపడట్లేదనిపిస్తే మాత్రం వెంటనే మానసిక నిపుణుల్ని సంప్రదించడం ఉత్తమం. తద్వారా మొదట్లోనే సమస్య నుంచి బయటపడచ్చు. తద్వారా ఇతర మానసిక, శారీరక సమస్యల్లోకి కూరుకుపోకుండా జాగ్రత్తపడచ్చు.



# మలబద్ధకం సమస్య అసలు ఎందుకు వస్తుంది..

మలబద్ధకం చాలా మందిని ఇబ్బంది పెట్టే సాధారణ జీర్ణ సమస్య. సాధారణంగా వారానికి మూడు సార్ల కంటే తక్కువగా మల విసర్జన జరగడం లేదా మలం గట్టిపడి బయటకు రావడానికి ఇబ్బంది కలగడం మలబద్ధకానికి సంకేతంగా భావిస్తారు. ఇది కడుపు ఉబ్బరం, గ్యాస్, వెన్నునొప్పి, అలసట వంటి సమస్యలకు కూడా దారి తీస్తుంది. తగినంత నీరు తాగకపోవడం, తక్కువ పీచు పదార్థాలు తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం మాత్రమే కాదు, మనం రోజూ తినే కొన్ని ఆహారాలు కూడా మలబద్ధకాన్ని పెంచే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



పాలు, చీజ్, వెన్న వంటి పాల ఉత్పత్తులను అధికంగా తీసుకోవడం కొందరిలో మలబద్ధకానికి కారణమవుతుంది. వీటిలో ఉండే లాక్టోజ్ కొంతమందిలో అజీర్ణం, కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. అలాగే వీటిలో కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అయితే అన్ని పాల ఉత్పత్తులను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. ప్రోబయోటిక్స్ ఉన్న పెరుగు జీర్ణక్రియకు సహాయపడుతూ మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.రెడీమేడ్ భోజనాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, తెల్ల బియ్యం, మైదాతో చేసిన పాస్తా వంటి శుద్ధి చేసిన ధాన్యాలు పీచు పదార్థాలు తక్కువగా కలిగి ఉంటాయి. పీచు మలానికి పరిమాణాన్ని పెంచి సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుంది. అందువల్ల వీటి స్థానంలో తృణధాన్యాలు, బ్రౌన్ రైస్, గోధుమ ఉత్పత్తులను తీసుకోవడం మంచిది. పూర్తిగా పండని ఆకుపచ్చ అరటిపండ్లలో టానిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మందగించి ఇప్పటికే ఉన్న మలబద్ధకాన్ని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంటుంది. అయితే పూర్తిగా పండిన పసుపు రంగు అరటిపండ్లు మాత్రం పీచు పదార్థం కారణంగా మల విసర్జనను సులభతరం చేయడంలో సహాయపడతాయి. మాంసంలో ప్రొటీన్, కొవ్వు ఎక్కువగా ఉన్నప్పటికీ పీచు పదార్థం ఉండదు.

# అందుకోసమే 'న్యాపుచినో'..!

కొంత మందికి మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత బద్ధకంగా అనిపిస్తుంటుంది. అందుకే వీలైతే ఓ కునుకు తీస్తుంటారు కూడా. దీనివల్ల ప్రయోజనాలున్నాయని పలు అధ్యయనాల్లోనూ



రుజువైంది. అయితే ఈ చిట్కాకు కొన్ని మార్పులతో 'న్యాపుచినో' అనే పద్ధతిని పాటించడం వల్ల మరింత ఉత్సాహంగా పనిచేయచ్చంటున్నారు నిపుణులు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత చాలామందికి నిద్ర ముంచుకొస్తుంటుంది. ఈ క్రమంలో కొంతమంది కొద్దిసేపు కునుకు తీస్తుంటారు. దీనివల్ల చురుగ్గా పనిచేయగలుగుతారు కూడా. అయితే నిద్రకు ముందు కొంచెం కాఫీ తాగితే మరింత ఉత్సాహంగా పనిచేయగలుగుతారట. ఈ చిట్కానే 'న్యాపుచినో' అంటారట. పగటి నిద్ర (న్యాప్), కాఫీ (క్యాపుచినో).. ఈ రెండూ కలిసి దీనికి 'న్యాపుచినో' అనే పేరొచ్చిందట. సాధారణంగా కొంచెం అలసటగా, బద్ధకంగా ఉన్నప్పుడు టీ, కాఫీ తాగుతుంటాం. ఇందులోని కెఫీన్ కేంద్ర నాడీ వ్యవస్థను ప్రేరేపించి నిస్సత్తువను దూరం చేస్తుందట. మెదడు కూడా చురుకుగా పనిచేస్తుంది. అయితే న్యాపుచినోలో భాగంగా మధ్యాహ్నం నిద్రకు ముందు కాఫీ తాగాలి. ఇందులోని కెఫీన్ ప్రభావం చూపించడానికి 20 నుంచి 30 నిమిషాలు పడుతుంది. సరిగ్గా అదే సమయానికి నిద్రలేవడం వల్ల చురుకుదనం, హుషారు వస్తుందంటున్నారు నిపుణులు. న్యాపుచినోలో భాగంగా కేవలం కాఫీ మాత్రమే కాకుండా ఎస్‌ప్రెసో, ఐస్డ్ టీలు కూడా తాగచ్చు. అయితే కెఫీన్ మోతాదు సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసుకోవాలి. కాఫీ తాగిన వెంటనే విశ్రాంతి తీసుకోవాలి. మరీ ఆలస్యంగా కునుకు తీసినా ప్రభావం ఉండదు.

# ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్

కండలు పెంచాలన్నా, కొవ్వును కరిగించాలన్నా తక్కువ కార్బోహైడ్రేట్‌లు, ఎక్కువ ప్రొటీన్‌లు ఉన్న ఆహారం తీసుకోవాలి. మార్కెట్లో ప్రొటీన్ పౌడర్లు, ఇతర ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్‌ని తయారు చేసుకోవచ్చు.



అర కప్పు శనగ పప్పు, అర కప్పు బాదాం, పావు కప్పు కాజు, పావు కప్పు గుమ్మడి గింజలు, రెండు టేబుల్ స్పూన్ల అవిసె గింజలు లేదా చియా గింజలతో ప్రొటీన్ పౌడర్ తయారు చేసుకోవచ్చు. కండలు పెంచాలన్నా, కొవ్వును కరిగించాలన్నా తక్కువ కార్బోహైడ్రేట్‌లు, ఎక్కువ ప్రొటీన్‌లు ఉన్న ఆహారం తీసుకోవాలి. మార్కెట్లో ప్రొటీన్ పౌడర్లు, ఇతర ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్‌ని తయారు చేసుకోవచ్చు. అర కప్పు శనగ పప్పు, అర కప్పు బాదాం, పావు కప్పు కాజు, పావు కప్పు గుమ్మడి గింజలు, రెండు టేబుల్ స్పూన్ల అవిసె గింజలు లేదా చియా గింజలతో ప్రొటీన్ పౌడర్ తయారు చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో తేలికగానే ఈ ప్రొటీన్ పౌడర్ తయారవుతుంది. ఈ గింజలు, విత్తనాలను వేర్వేరుగా పెనం మీద మూడు నుంచి నాలుగు నిమిషాలు వేయించాలి. చల్లబడ్డాక వాటిని మిక్సీలో పిండి చేయాలి. గాలి చొరబడని గాజు సీసాలో ఈ ప్రొటీన్ పిండిని నిల్వ చేసుకోవాలి. ఒకటీ రెండు వారాలపాటు వాడుకోవచ్చు. ఇలా చేస్తే డబ్బులు ఆదా అవుతాయి. రుచి కోసం కలిపే రసాయనాల నుంచి తప్పించుకోవచ్చు. కిడ్నీలను కాపాడుకోవచ్చు.

# యాంటీ బయాటిక్స్ మందులను వాడుతున్న వారు ఈ జాగ్రత్తలను పాటించడం తప్పనిసరి..

యాంటీ బయాటిక్స్ బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈ మందులు తీసుకునే సమయంలో ఆహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరం. సరైన ఆహారాన్ని తీసుకోకపోతే మందుల ప్రభావం తగ్గడమే కాకుండా విరేచనాలు, జీర్ణాశయ అసౌకర్యం వంటి దుష్ప్రభావాలు కూడా పెరిగే అవకాశం ఉంది. అందుకే యాంటీ బయాటిక్స్ వాడుతున్నప్పుడు ఏ ఆహారాలు తీసుకోవాలి, వేటిని నివారించాలి అనే విషయాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యం. యాంటీ బయాటిక్స్ ను వాడే సమయంలో శరీరంలోని మంచి బ్యాక్టీరియా కూడా కొంత మేర దెబ్బతింటుంది. దీంతో విరేచనాలు వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితిలో ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే పెరుగు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల పేగుల్లో మంచి బ్యాక్టీరియా తిరిగి పెరగడానికి సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థ త్వరగా కోలుకోవడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. చాలా రోజుల పాటు యాంటీ బయాటిక్స్ తీసుకోవాల్సి వస్తే శరీరంలో విటమిన్ కె స్థాయిలు తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆకుకూరలు, ఆస్పరాగస్, గ్రీన్ టీ, బీఫ్ లివర్ వంటి విటమిన్ కె అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. అవసరమైతే వైద్యుల సలహాతో విటమిన్ కె సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు. యాంటీ బయాటిక్స్ వల్ల కొన్నిసార్లు ఈస్ట్ పెరుగుదల ఎక్కువై ఈస్ట్ ఇన్‌ఫెక్షన్లు లేదా జీర్ణాశయ అసౌకర్యం ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాంటి సమయంలో



ఉల్లిపాయ, వెల్లుల్లి వంటి ఆహారాలు కొంత ఉపశమనం కలిగిస్తాయి. అలాగే ఈ మందుల వల్ల విటమిన్ బి స్థాయిలు కూడా తగ్గే అవకాశం ఉండటంతో బ్రోకోలీ వంటి ఆకుపచ్చ కూరగాయలను ఆహారంలో చేర్చడం ప్రయోజనకరం. యాంటీ బయాటిక్స్ తీసుకునే సమయంలో కొన్ని ఆహారాలను వీలైనంత వరకు దూరంగా ఉంచడం మంచిది. నిమ్మ, నారింజ, స్ట్రాబెర్రీ వంటి సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉండే పండ్లు, టమాటో కెచప్, చాక్లెట్లు, శీతల పానీయాలు వంటి ఆమ్ల గుణాలు ఉన్న ఆహారాలు మందుల శోషణకు ఆటంకం కలిగించే అవకాశం ఉంటుంది. దీంతో యాంటీ బయాటిక్స్ ప్రభావం తగ్గుతుంది.

# నలభైల్లోకి అడుగుపెడితే!

ఉదయం లేవగానే అద్దంలో చూసుకుంటే, సన్నని గీతలు, కళ్ల కింద వలయాలు ముఖంపై కనిపిస్తూ మనకి 'హాయ్' చెబుతాయి. ఇట్టే అలసిపోవడం, చిన్న విషయానికే కోపం రావడం, మరుసటి క్షణమే కారణం లేకుండా కళ్లు చెమర్చడం వంటి మార్పులెన్నో కనిపిస్తాయి. ఇవన్నీ మన ప్రమేయం లేకుండా జరిగిపోవడమే ఇక్కడ విషయం. హార్మోన్ల హెచ్చు తగ్గులే ఇందుకు కారణం. బరువు విషయానికొస్తే... ఇరవైల్లో ఉన్నప్పుడు ఒక్క పూట అన్నం మానేస్తే అర కేజీ తగ్గిపోయే శరీరం, నలభై దాటాక కొందరిలో గాలి పీల్చినా బరువు పెరుగుతామేమో అనేలా మారిపోతుంది. కారణం మెటబాలిజం వేగం మందగించడమే. ఎముకలు కూడా 'నన్ను కాస్త పట్టించుకో తల్లీ!' అంటూ నడుము, మోకాళ్ల నొప్పుల రూపంలో కాల్షియం కొరతను పదే పదే గుర్తుచేస్తాయి. వీటికి తోడు థైరాయిడ్, బీపీ, షుగర్ వంటివీ తలుపు తట్టడానికి సిద్ధంగా ఉంటాయి. 40ల్లోకి అడుగుపెట్టడమంటే బలహీనతకు సంకేతం కాదు. కానీ, శరీరం ఇచ్చే చిన్న చిన్న హెచ్చరికలనూ, సూచనల్నీ వినాల్సిన సమయం. సరైన ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, నిద్ర, మానసిక ప్రశాంతత ఇవే ఈ దశలో మహిళలకు అవసరమయ్యే నిజమైన మందులు. వయసు పెరుగుతున్నా, జీవన నాణ్యత పెరగాలంటే రాకెట్ సైన్స్ లాంటి క్లిష్టమైన పరిష్కారాలు అక్కర్లేదు. కాస్త మీపై మీరు శ్రద్ధ పెడితే చాలు. ముఖ్యంగా 'ఇన్నాళ్లూ అందర్నీ చూసుకున్నాను, ఇప్పుడు నా వంతు' అంటూ సెల్ఫ్ లవ్‌ని పెంపొందించుకోవాలి. రోజూ ఓ అరగంట పాటు వేగంగా నడవడం, నచ్చిన పాటలకి డాన్స్ చేయడం, యోగా వంటివి ప్రయత్నించండి. ఇవి తగ్గిన మెటబాలిజాన్ని పెంచుతాయి. కండరాల రక్షణకు స్ట్రెంత్ ట్రైనింగ్, ఎముక బలానికి వెయిట్ –బేరింగ్ కసరత్తులు చేస్తే... క్రమంగా శరీరంలో ఇన్సులిన్ పనితీరు మెరుగవుతుంది. ఇవి మనసును తేలికపరిచే హార్మోన్లను విడుదల చేసి, మంచి నిద్రకు దోహదపడతాయి. కండరాల క్షీణత మొదలయ్యే ఈ దశలో ప్రొటీన్ అవసరం అధికం. ప్రతి పూటా ఆహారంలో కొద్దిగా ప్రొటీన్ ఉండేలా చూసుకుంటే... దాంతోపాటు కాల్షియం కూడా అందుతుంది. ఫలితంగా నొప్పులూ తగ్గుతాయి. పప్పులు, గుడ్లు, పనీర్, చేపలు, మాంసం, పెరుగు, మొలకలు... వంటివాటి ద్వారా ఇవి సమృద్ధిగా లభిస్తుంది. కార్బోహైడ్రేట్ల కోసం... వైట్ రైస్, మైదా వంటి శుద్ధి చేసిన పదార్థాల స్థానంలో దంపుడు బియ్యం, రాగులు, జొన్నలు, సజ్జలతో చేసిన వంటకాలను చేర్చండి. ఇవి నెమ్మదిగా జీర్ణమై, రక్తంలో చక్కెర స్థాయులను స్థిరంగా ఉంచుతాయి. హార్మోన్ల సమతుల్యతకు కావలసిన మంచి కొవ్వులను తీసుకోవడం పూర్తిగా మానొద్దు. విటమిన్ బి12, ఇనుము, జింక్ వంటి పోషకాల లోపం ఈ వయసులో సాధారణం. పాలకూర, బీట్‌రూట్, ఖర్జూరం వంటి ఇనుము సమృద్ధిగా ఉండే ఆహారాలను విటమిన్ సి లభించే పదార్థాలతో కలిపి తీసుకుంటే పోషకాలను శరీరం సరిగా గ్రహిస్తుంది. పసుపు, అల్లం, వెల్లుల్లి వంటివి ఒంట్లోని దీర్ఘకాలిక వాపును తగ్గించడంలో సహాయపడతాయి. నీళ్లు ఎక్కువగా తాగుతూ, రోజూ కాసేపు ఉదయాన్నే ఎండలో నిలబడితే విటమిన్ డి మీ సొంతం. అలానే, ఏటా ఒకసారి క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకోవడం వల్ల రాబోయే సమస్యలను ముందే అడ్డుకోవచ్చు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది, కాబట్టి మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడాన్ని నిర్లక్ష్యం చేయకండి.



# తులసి ఆకుల్లో ఎలాంటి సమ్మేళనాలు ఉంటాయి..


తులసి భారతీయ సంస్కృతిలో పవిత్రమైన మొక్కగా మాత్రమే కాకుండా, ఆయుర్వేదంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ఔషధ మూలికగా కూడా గుర్తింపు పొందింది. భారత ఉపఖండంలో సులభంగా పెరిగే ఈ మొక్క ప్రధానంగా ఆకుపచ్చ రంగులో ఉండే లక్ష్మీ తులసి, ఊదా రంగులో కనిపించే కృష్ణ తులసి అనే రెండు రకాలుగా లభిస్తుంది. భారత్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాల ఉష్ణమండల ప్రాంతాల్లో కూడా తులసి విస్తృతంగా పెరుగుతుంది. హిందూ సంప్రదాయంలో తులసిని పూజించడం, ఇళ్లలో పెంచడం వెనుక ఆధ్యాత్మిక కారణాలతోపాటు ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని భావిస్తుంటారు. తులసి ఆకులను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడం, బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభించడం, చర్మం, జుట్టు సమస్యలు తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.ఆయుర్వేదంలో తులసి ఆకులు, విత్తనాలు, ముఖ్యంగా తులసి నుంచి తీసే ఎసెన్షియల్ ఆయిల్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇవి శ్వాసకోశ సంబంధిత సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయని నిపుణులు పేర్కొంటున్నారు. తులసిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంతో పటు మధుమేహం, రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని నియంత్రించడంలో దోహదపడతాయి.



తులసిలో ఉండే లినోలిక్ యాసిడ్ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఈ ఆకుల్లోని సహజ నూనెలు అలర్జీలు, బ్యాక్టీరియా, వైరస్‌లు, ఇతర సూక్ష్మజీవులపై పోరాడే లక్షణాలు కలిగి ఉంటాయి. అందుకే తులసి పేస్ట్, తులసి పొడిని అనేక హెర్బల్, సౌందర్య ఉత్పత్తుల్లో ఉపయోగిస్తుంటారు. వేప, తిప్పతీగ, పసుపు వంటి ఔషధ మూలికలతో కలిపి మొటిమలపై రాస్తే చర్మం శుభ్రపడటంతోపాటు మళ్లీ మొటిమలు వచ్చే అవకాశాన్ని కూడా తగ్గించవచ్చు. భారతీయ ఇంటి వైద్యంలో తులసికి ప్రత్యేక స్థానం ఉంది. జ్వరం, జలుబు వంటి సాధారణ సమస్యల నుంచి కొన్ని వైరల్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ల వరకు తులసిని సంప్రదాయంగా ఉపయోగిస్తుంటారు. తులసి ఆకులను నీటిలో మరిగించి అందులో సుమారు రెండు గ్రాముల మిరియాల పొడి కలిపి తాగితే రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు శరీరానికి యాంటీ బ్యాక్టీరియల్ రక్షణ లభిస్తుంది. అల్లం, తులసి ఆకులు, మిరియాలను కలిపి తయారు చేసే కషాయం జలుబు, దగ్గు వంటి సమస్యల్లో ఉపశమనం కలిగిస్తుంది. తులసి శరీరంలోని విషపదార్థాలను తొలగించే డిటాక్సిఫైయింగ్, శుద్ధి చేసే గుణాలను కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్లే కాకుండా చర్మంపై ఉపయోగించడం వల్ల కూడా ప్రయోజనం కలుగుతుంది. దురద, రింగ్‌వార్మ్ వంటి కొన్ని చర్మ సమస్యల ఉపశమనానికి కూడా తులసిని సంప్రదాయంగా ఉపయోగిస్తున్నారు. తులసిని తాజాగా కోసిన ఆకుల రూపంలో నేరుగా నమలవచ్చు.

# ఒత్తిడిని చిత్తు చేసేద్దాం

జీవితంలో పెండ్లి, పిల్లలు, ఫైనాన్షియల్ సమస్యలు, కెరీర్ ఇలా ఏదో ఒక విషయంలో ఆందోళన చెందుతూనే ఉంటాం. ఆందోళన అనేది ఒత్తిడికి రియాక్షన్. ఇది కొన్ని సందర్భాల్లో మీకు ఉపయోగకరంగా, మిమ్మల్ని అప్రమత్తంగా,



ఆర్గనైజ్డ్‌గా ఉండటానికి సాయపడుతున్నట్లుగా ఉన్నా ప్రతి విషయానికి ఎక్కువ స్ట్రెస్ తీసుకుంటే మాత్రం అది క్రమంగా యాంగ్జయిటీ డిజార్డర్‌కు దారితీస్తుంది. కారణం లేకుండా భయపడితే.. అది యాంగ్జయిటీ డిజార్డర్ అవుతుంది. ఆందోళనగా ఉన్నప్పుడు హార్ట్ బీట్ పెరుగుతుంది, శ్వాస వేగవంతం అవుతుంది, అశాంతి, ఏకాగ్రత లోపించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్యను సకాలంలో తగ్గించుకోకపోతే తీవ్ర సమస్యగా మారే అవకాశం ఉంది. ఇందుకోసం దవాఖాన మెట్లెక్కకుండా మన ఇంట్లో ఉండే అశ్వగంధ, బ్రహ్మి, తులసి వంటి ప్రకృతి సిద్ధమైన పదార్థాలు ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి సహాయపడతాయని జేఏఐ ఎమ్ఎస్ అధ్యయనం పేర్కొంది. బ్రహ్మి : అద్భుతమైన ఆయుర్వేద మూలిక ఇది. ఆందోళన, ఒత్తిడిని తగ్గించడంలో ఎఫెక్టివ్‌గా సహాయపడుతుంది. దీనిని ఒక అడాప్టోజెనిక్ మూలికగా పరిగణిస్తారు. ఒత్తిడికి కారణం అయిన కార్టిసాల్ స్థాయులను తగ్గించి స్ట్రెస్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది, ఆందోళనను తగ్గిస్తుంది. ఇటీవల జరిగిన ఓ అధ్యయనంలో 4 వారాల పాటు రోజుకు రెండుసార్లు 500 ఎంజీ బ్రహ్మి ఇచ్చిన వారిలో డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి తగ్గినట్లు గుర్తించారు.

అశ్వగంధ : అశ్వగంధ వేర్ల సారాన్ని రోజువారీగా నిర్దిష్ట మోతాదులో తీసుకుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. 2023లో జరిగిన ఓ అధ్యయనంలో.. 60 రోజుల పాటు 500 మిల్లీగ్రాముల అశ్వగంధ వేరు సారాన్ని అందించిన 54 మందిలో ఒత్తిడి, ఆందోళన తగ్గినట్లు గుర్తించారు. ఒత్తిడిని కంట్రోల్‌లో ఉంచే కార్టిసాల్‌ను తగ్గించడంలో, సెరోటోనిన్‌ను పెంచడంలో అశ్వగంధ ఘనంగా పనిచేస్తుందని పరిశోధకులు గుర్తించారు.

పసుపు : మనం రోజూ వంటల్లో ఉపయోగించే పసుపు ఆందోళన తగ్గించడంలో అద్భుతంగా సాయపడుతుంది. ఆందోళన, ఒత్తిడి నుంచి ఉపశమనం ఇవ్వడానికి పసుపులో ఉండే బయోయాక్టివ్ కాంపౌండ్ కరుమిన్ సాయపడుతుంది. ఇది సెరోటోనిన్, డోపమైన్ స్థాయులపై ప్రభావం చూపి, ఒత్తిడి స్థాయులను కంట్రోల్‌లో ఉంచుతుంది. తీవ్రమైన కుంగుబాటు లక్షణాలను తగ్గించడానికి పసుపు నేచురల్ మెడిసిన్.

## స్టీరింగ్ వీల్ లేకుండానే రోబో ట్యాక్సీలు..ఎక్కడంటే..?



మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక అభివృద్ధి చెందుతోంది. అమెరికాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైవర్ లెస్ ట్యాక్సీ కార్లు రోడ్లపై దూసుకెళ్తున్నాయి. ఇప్పుడు స్టీరింగ్ వీల్ లేకుండానే రయ్ రయ్ మంటూ దూసుకెళ్లే రోబోట్యాక్సీలు ప్రపంచంలోనే తొలిసారిగా అగ్రరాజ్యంలో తిరగనున్నాయి. అమెజాన్ అనుబంధసంస్థ 'జూక్స్' పూర్తి అటానమస్ కారు వాణిజ్య వినియోగానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో ఆ సంస్థ ఛార్జీలు వసూలు చేసుకునేలా అమెరికా ఫెడరల్ రెగ్యులేటర్లు అనుమతినిచ్చారు.




# మూడో రోజూ లాభాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (Stock market) లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో వరుసగా మూడో రోజూ రాణించాయి. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. సెన్సెక్స్ 166 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన స్థిరపడింది.సెన్సెక్స్ ఉదయం 77,998.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,928.15) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు నష్టాల్లోకి జారుకున్న సూచీ.. తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 78,272.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 166.49 పాయింట్ల లాభంతో 78,094.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 66.45 పాయింట్ల నష్టంతో 24,383.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.41గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ లాభాల్లో ముగిశాయి. టీసీఎస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, టెక్ మహీంద్రా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4055 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# సంపదలో రోష్ని.. సీఈఓల్లో ప్రియా నాయర్



సంపదను ఇంతలింతలు చేయడంలో హెచ్‌సీఎల్ టెక్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ అగ్రస్థానంలో నిలిచారు. గురువారం విడుదలైన 'కాండీర్ హురున్ ఇండియా ఉమెన్ లీడర్స్ లిస్ట్' ఈ విషయాన్ని వెల్లడిస్తోంది. అదే సమయంలో ప్రొఫెషనల్ సీఈఓల విభాగంలో రూ.5,06,600 కోట్ల కంపెనీ అయిన హిందుస్థాన్ యునిలీవర్‌కు సీఈఓ, ఎండీగా ఉన్న ప్రియా నాయర్ తొలి స్థానం దక్కించుకున్నారు. ఈ ఏడాది జాబితాలో మొత్తం 117 మంది చోటు చేసుకున్నారు. 2025లోని 97 మందితో పోలిస్తే 21% పెరుగుదల కనిపించింది. వీరిలో అత్యధికులు (12 మంది) వృశ్చిక రాశి వారని నివేదిక తెలిపింది. 2025లో తొమ్మిది విభాగాల్లో ఈ జాబితా వెలువడగా, ఈ ఏడాది అది 12కు విస్తరించింది. తద్వారా మహిళా నాయకత్వం వివిధ రంగాలకు చేరినట్లయింది. ఫిన్లాండ్ జీడీపీ కంటే ఎక్కువగా..: జాబితాలోని మొత్తం మహిళలు రూ.39 లక్షల కోట్ల సంపదకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది ఫిన్లాండ్ దేశ జీడీపీ కంటే అధికం. వీరి సగటు వయసు 48 ఏళ్లు. జాబితాలో అత్యంత పిన్నవయస్కురాలు శీతల్ దేవి(19) కాగా, ఎక్కువ వయసున్న వ్యక్తిగా రజని బెక్టర్(86) నిలిచారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్‌మజుందార్‌షా, నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణి నాయర్, సుధామూర్తి, నిసాబా గోద్రేజ్ వంటి ప్రముఖులూ ఈ జాబితాలో ఉన్నారు. రూ.1,21,000 కోట్ల విలువైన అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన ప్రీతా రెడ్డి(68), సునీతా రెడ్డి(67) సంయుక్తంగా దిగ్గజ విభాగంలో అగ్రస్థానంలో నిలిచారు. రూ.22,230 కోట్ల విలువైన రెన్యూ పవర్‌కు సహ వ్యవస్థాపకురాలైన వైశాలి నిగమ్‌సిన్హా(56) న్యూ ఎకానమీ విభాగంలో ముందున్నారు. ఇండియన్ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంగా మీనా బింద్రా (83), సోషియల్ చేంజ్ మేకర్స్‌లో తుషారా శంకర్(46), సోషియల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌లో అనన్య బిర్లా(32), అంకుర వ్యవస్థాపకుల్లో కనిక గుప్తా షోరి(41) అగ్రస్థానంలో నిలిచారు.

# ప్రపంచ ఉత్పాదకతలో భారత్ హవా



ప్రపంచ ఉత్పాదకత రంగంలో భారత్ పాత్ర అధికమవుతోందని మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థ.. ఎంపిక చేసిన భాగస్వామ్యాల దిశగా కదులుతోంది. సరఫరా వ్యవస్థల్లో మార్పులు వస్తున్నాయి. దేశాలు తయారీ విస్తరణ కోసం స్థిరత్వం, ఉత్పాదక సామర్థ్యం, ప్రతిభ, విశ్వాసం కోసం చూస్తున్నాయి. వీటన్నింటినీ అందించే నమ్మకమైన పరిష్కారంగా భారత్‌ను అవి పరిగణిస్తున్నాయ'ని ఎంఅండ్ఎం 80వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదార్లను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగిస్తూ మహీంద్రా అన్నారు. అనిశ్చితులు, ఉద్రిక్తతలు సర్వసాధారణం అయ్యాయనే విషయాన్ని పశ్చిమాసియా సహా ఇటీవలి కొన్ని పరిణామాలు గుర్తు చేస్తున్నాయని వివరించారు. అనిశ్చితితో కూడిన ప్రపంచంలో, భారత్ తన ప్రాముఖ్యాన్ని పెంచుకుంటోందని తెలిపారు. గత దశాబ్దకాలంలో ఎంఅండ్ఎంకు మంజూరైన పేటెంట్లు 56 నుంచి 1,300కు పైగా పెరిగాయని వెల్లడించారు. నాగ్‌పూర్‌లో రూ.15,000 కోట్ల పెట్టుబడిని కంపెనీ ప్రకటించిందని తెలిపారు. గత పదేళ్లలో తమ అత్యధిక పెట్టుబడుల్లో ఇది ఒకటని పేర్కొన్నారు.మహీంద్రా లాభంలో 34% వృద్ధి: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), జూన్ త్రైమాసికంలో రూ.5,455 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2025–26 ఇదే కాల లాభం రూ.4,083 కోట్ల కంటే ఇది 34% అధికం. ఆదాయం రూ.45,529 కోట్ల నుంచి రూ.58,188 కోట్లకు పెరిగింది. వృద్ధి, మార్జిన్ల పరంగా వాహన, వ్యవసాయ విభాగాలు రాణించాయని కంపెనీ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తం వాహన విక్రయాలు 23% పెరిగి 3,04,000కు చేరాయి. స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల అమ్మకాలు 1,75,000 మైలురాయిని తాకినట్లు కంపెనీ తెలిపింది. ఆర్థిక సేవలు – ఆస్తుల నిర్వహణ వ్యాపారంలో 13% వృద్ధి ఉండగా.. టెక్ మహీంద్రా ఎబిటా 300 బేసిస్ పాయింట్లు పెరిగింది. మహీంద్రా లాజిస్టిక్స్ ఆదాయంలోనూ 23% వృద్ధి నమోదైంది. 2026–27 త్రైమాసికంలో ట్రాక్టర్ల వ్యాపార మార్కెట్ వాటా 280 బేసిస్ పాయింట్లు పెరిగి 44.9 శాతానికి చేరింది.

## మా ఏఐ మోడల్.. 3 కంపెనీలను హ్యాక్ చేసింది: ఆంథ్రోపిక్

క్లాడ్ చాట్‌బాట్ సృష్టికర్త, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సంస్థ ఆంథ్రోపిక్ సంచలన విషయాన్ని బయటపెట్టింది. టెస్టింగ్ దశలో ఉన్న తమ ఏఐ మోడళ్లు పొరపాటున మూడు ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లలోకి ప్రవేశించి హ్యాక్ చేశాయని ప్రకటించింది. తమ ఏఐ వ్యవస్థ ఇంకో ఏఐ కంపెనీ మోడల్‌ను హ్యాక్ చేసిందని చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. తాము కూడా అప్రమత్తమై సైబర్‌సెక్యూరిటీ సమీక్ష చేపట్టినట్లు తెలిపింది. రికార్డులు పరిశీలిస్తుండగా.. ఈ ఏడాది ప్రారంభంలో హ్యాకింగ్ జరిగినట్లు గుర్తించామంది. హ్యాంకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను తాము ఇప్పటికే సంప్రదించామని ఆంథ్రోపిక్ వెల్లడించింది. అయితే వాటి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల వాటి మౌలిక సదుపాయాలను క్లాడ్ దెబ్బతీసిందని పేర్కొంది. ఇది దురుద్దేశంతో చేసిన పని కాదని.. ఒక మోడల్ సామర్థ్యం ఏమిటో తెలియాలంటే దానిని విడుదల చేయడానికి ముందు భద్రతా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. ఆ సమయంలో అనుకోకుండా ఈ సైబర్ భద్రత ఘటన చోటుచేసుకున్నట్లు వివరించింది. దీంతో అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు ఏర్పడవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




# మైక్రోసాఫ్ట్.. ఒక్కరోజే రూ.42లక్షల కోట్లు పెరిగిన సంపద




టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్లలో చరిత్ర సృష్టించింది. కనీవిని ఎరుగని రీతిలో ఈ కంపెనీ మార్కెట్ విలువ కేవలం ఒక్క రోజే 450 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.42లక్షల కోట్లకు పైమాటే) పెరిగింది. గురువారం నాటి (అమెరికా కాలమానం ప్రకారం) ట్రేడింగ్‌లో మైక్రోసాఫ్ట్ షేర్లు రికార్డు స్థాయిలో 16శాతం పెరిగాయి. దీంతో భారీగా సంపద సృష్టి జరిగింది.
ఒక కంపెనీ మార్కెట్ విలువ కేవలం ఒక్క రోజులో ఈ స్థాయిలో పెరగడం అమెరికా స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. గతేడాది ఏప్రిల్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచదేశాలపై విధించిన టారిఫ్‌లను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో ఎన్విడియా షేర్లు నాడు భారీగా పెరిగాయి. దాంతో ఈ చిప్ కంపెనీ మార్కెట్ విలువ ఒక ట్రేడింగ్ సెషన్‌లో 440 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. ఇప్పుడు దీన్ని మైక్రోసాఫ్ట్ అధిగమించి.. సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ భారీ లాభంతో టెక్ దిగ్గజం మార్కెట్ విలువ 3.35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. మైక్రోసాఫ్ట్ బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. అజ్యూర్ క్లౌడ్ విభాగ ఆదాయం అంచనాలకు మించి 43శాతం వృద్ధి నమోదుచేసినట్లు వెల్లడించింది. ఇక, తమ ఏఐ అసిస్టెంట్ మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌కు విశేష ఆదరణ లభిస్తోందని, దీని యూజర్ల సంఖ్య 3 కోట్లు దాటిందని తెలిపింది. దీంతో ఈ కంపెనీ షేర్లు దాదాపు 16శాతం లాభంతో రాణించాయి. షేరు విలువ ఒక రోజులో ఈ స్థాయిలో పెరగడం 2008 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం.
మరోవైపు, అటు మెటా (Meta) షేర్లు 8శాతం మేర కుంగాయి. ఈ కంపెనీ త్రైమాసిక ఫలితాల అంచనాలు మదుపర్లను నిరాశపర్చాయి. మరోవైపు, ఏఐలో మెటా పెట్టుబడులు పెరుగుతుండటం కూడా షేరు విలువపై ప్రభావం చూపించింది. దీంతో వరుసగా 11 రోజు మెటా షేర్లు పతనమయ్యాయి.




## దిలీప్ పరుగు బంగారం




కామన్వెల్త్ క్రీడల్లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం, రెండు రజత పతకాలు చేరాయి. పారా పురుషుల 100మీ టీ47పరుగులో దిలీప్ మహాదు గావిత్ స్వర్ణం చేజిక్కించుకున్నాడు. గేమ్స్ రికార్డును నెలకొల్పుతూ అతడు 10.71 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని, అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత అథ్లెట్ మహ్మద్ బసిల్ రజత పతకం గెలుచుకున్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన కెవిన్ సాంటోస్ కాంస్యం సాధించాడు. దిలీప్ స్వర్ణం ఈ కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు మూడో బంగారు పతకం. మహిళల 48కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను, పారా మహిళల షాట్‌పుట్ లో షర్మిల ధన్‌ఖడ్‌లు దిలీప్ కన్నా ముందు గ్లాస్గో క్రీడల్లో పసిడి పతకాలు నెగ్గారు. మరోవైపు లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ అదరగొట్టాడు. వరుసగా రెండు కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు గెలుచుకున్న తొలి భారత అథ్లెట్‌గా అతడు రికార్డు సృష్టించాడు.

# అభిమానులకు గుడ్ న్యూస్..




భారత క్రికెట్ అభిమానులకు శుభవార్త. జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ విషయంలో నెలకొన్న సందిగ్ధత తొలగింది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినా.. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైతేనే ఆడతాడని బీసీసీఐ సెలక్షన్ కమిటీ ముందే చెప్పింది. ఈ క్రమంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తాజాగా తీపి కబురు అందించింది. జస్‌ప్రీత్ బుమ్రా ఫుల్ ఫిట్‌గా ఉన్నాడని స్పష్టం చేసింది. దీంతో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో అతడు ఆడటం ఖాయమే.
''జస్‌ప్రీత్ బుమ్రా గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఫిట్‌నెస్ టెస్టులను క్లియర్ చేశాడు. ఇప్పటికే స్క్వాడ్‌లో ఉన్న అతడు.. రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు'' అని బీసీసీఐ అధికారి వెల్లడించారు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా బుమ్రా గాయం తిరగబెట్టిన సంగతి తెలిసిందే. దీంతో మూడో వన్డేలో బెంచ్‌కే పరిమితమయ్యాడు. అతడి లేని లోటు స్పష్టంగా కనిపించింది. పెద్దగా అనుభవం లేని భారత పేస్ ఎటాక్‌పై ఇంగ్లాండ్ బ్యాటర్లు విరుచుకుపడ్డారు. భారీ స్కోర్లు నమోదైన ఆ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌నే విజయం వరించింది. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడటం భారత్‌కు అత్యంత కీలకం. ఇద్దరు ప్రధాన పేసర్లు మాత్రమే తుది జట్టులో ఉండే అవకాశం ఉంది. బుమ్రా ఉంటే ప్రత్యర్థి లంక బ్యాటర్లు హడలెత్తడం ఖాయం. అంతే కాకుండా.. గతంలో శ్రీలంక చేతిలో టీమ్‌ఇండియాకు ఓటమి ఎదురైంది. దీంతో ఆ జట్టుపై ప్రతీకారం తీర్చుకోవడంతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉంది. నాలుగో డబ్ల్యూటీసీ సీజన్‌లో భారత్ ఇంకా తొమ్మిది టెస్టులను ఆడనుంది. ఇందులో కనీసం ఏడు మ్యాచుల్లో గెలిస్తేనే ఫైనల్‌కు చేరేందుకు ఛాన్స్ ఉంటుంది. ఆగస్టులో శ్రీలంకతో సిరీస్ తర్వాత న్యూజిలాండ్‌తో అక్కడి గడ్డపైనే భారత్ తలపడాలి. అందుకే, ఇక్కడి నుంచి ప్రతి మ్యాచ్ విజయమూ భారత్‌కు కీలకం.

## సుదీర్ఘ ఫార్మాట్‌లో వైభవ్‌ను ఎలా వైస్ కెప్టెన్ చేశారు?: హర్షా భోగ్లే




దులీప్ ట్రోఫీ 2026–27 సీజన్ కోసం ఈస్ట్ జోన్ స్క్వాడ్‌ను ప్రకటించింది. అనూహ్యంగా వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. సారథిగా ఇషాన్ కిషన్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన వైభవ్‌ను డిప్యూటీ చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆ నిర్ణయాన్ని స్వాగతించగా.. మరికొందరేమో సెలక్టర్లు తొందరపడ్డారని పేర్కొంటున్నారు. ఈ జాబితాలో క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే కూడా చేరారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు నేర్చుకోవాల్సింది చాలా ఉందని.. వైస్ కెప్టెన్సీ అప్పగించడం సరైనదిగా అనిపించడం లేదని వెల్లడించారు.

రహానే ఎంతగా శ్రమిస్తాడో నాకు తెలుసు: రోహిత్ శర్మ

''రెడ్ బాల్ క్రికెట్‌లో.. అదీనూ సీనియర్లు ఉండే జట్టుకు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా ఎలా నియమించారనేది నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. అతడు ఫస్ట్‌క్లాస్‌లో ఇప్పటి వరకు సుదీర్ఘ ఫార్మాట్‌లో కేవలం 12 ఇన్నింగ్స్‌లు మాత్రమే ఆడాడు. 17.25 సగటుతో 207 పరుగులు చేశాడు. నేను అతడి టాలెంట్‌ను తక్కువ చేయడం లేదు. అద్భుతమైన నైపుణ్యం కలిగిన ప్లేయర్. కానీ, అతడు నేర్చుకోవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి'' అని హర్షా భోగ్లే పోస్టు పెట్టారు.

## ఆగిన అజింక్య

భారత టెస్టు జట్టులో పదేళ్ల పాటు ప్రధాన బ్యాటర్లలో ఒకడిగా ఉన్న అజింక్య రహానె క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ ఏడాది మే 24న ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున దిల్లీ క్యాపిటల్స్‌పై ఆడిందే రహానె చివరి మ్యాచ్. ఆ మ్యాచ్‌లో 63 పరుగులు చేసిన 38 ఏళ్ల అజింక్య.. తర్వాత దేశవాళీల్లో కూడా బరిలోకి దిగలేదు. 2011 ఆగస్టు 31న మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20తో రహానె అంతర్జాతీయ కెరీర్ మొదలైంది. అదే పర్యటనలో అతను వన్డే అరంగేట్రం కూడా చేశాడు. 2013లో ఆస్ట్రేలియాపై దిల్లీలో తొలి టెస్టు ఆడాడు. తర్వాత ఆ ఫార్మాట్లోనే ఎక్కువ పేరు సంపాదించాడు.



రహానె చివరి అంతర్జాతీయ మ్యాచ్‌ను 2023లో ఆడాడు. వెస్టిండీస్‌పై భారత్ 1–0తో గెలిచిన రెండు టెస్టుల సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో 3, 8 పరుగులే చేసిన అజింక్య.. తర్వాతి సిరీస్‌కు జట్టులో చోటు కోల్పోయాడు. మళ్లీ టీమ్‌ఇండియాలోకి రాలేకపోయిన అతను.. ఐపీఎల్‌లో గత రెండు సీజన్లలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2024లో టైటిల్ గెలిచిన కేకేఆర్.. రహానె సారథ్యంలో నిరాశపరిచింది. వరుసగా 8, 7 స్థానాల్లో నిలిచింది. 2023–24 సీజన్లో ముంబయిని రంజీ ఛాంపియన్‌గా (42వ టైటిల్) నిలిపిన రహానె.. తర్వాతి సీజన్ వరకు ఆ జట్టు కెప్టెన్‌గా కొనసాగాడు. గత సీజన్ నుంచి అతను రంజీల్లోనూ ఆడట్లేదు.

# బిడ్డకు జన్మనిచ్చిన 11 నెలలకే బరిలోకి..

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. మహిళల డిస్కస్ త్రో విభాగంలో సీమా కళిరామన్ కాంస్య పతకం సాధించింది. మూడో రౌండ్‌లో 58.65 మీటర్లు విసిరిన సీమా.. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు ఫౌల్ అయింది. అయినా, కాంస్యం వరించింది. జమైకాకు చెందిన సమంత హాల్ (61.66 మీటర్లు), కెనడా అథ్లెట్ జులియా టంక్స్ (60.67 మీటర్లు) స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. అయితే, కాంస్యం నెగ్గిన కళిరామన్ ప్రయాణం ప్రతి అథ్లెట్‌కు స్ఫూర్తిదాయకం.. హరియాణాకు చెందిన 27 ఏళ్ల సీమా కేవలం అథ్లెట్ మాత్రమే కాదండోయ్.. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేసిన చదువుల తల్లి. చదువు, క్రీడలను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తుండగా.. ఈలోగా కొత్త పాత్ర పోషించాల్సి వచ్చింది. అమ్మగా మారిన ఆమె కేవలం 11 నెలల వ్యవధిలోనే డిస్కస్ త్రో పోటీలకు సిద్ధమైంది. ఆమెకు కోచింగ్ ఇచ్చింది మరెవరో కాదు.. ఆమె భర్త రవీందర్. జాతీయ స్థాయిలో డిస్కస్ త్రో మాజీ అథ్లెట్ అయిన రవీందర్.. మోను కళిరామన్‌గా సుపరిచితుడు. అయితే, ప్రసవం తర్వాత కోలుకోవడానికి సీమా చాలా శ్రమించింది. ప్రసవానంతరం ఆర్థిరిటిస్ సమస్య తలెత్తడంతో కొన్నాళ్లపాటు చిన్న బరువు ఎత్తేందుకూ ఇబ్బంది పడింది. స్ట్రెంత్ అండ్ టెక్నిక్‌తో మళ్లీ తన రిథమ్‌ను అందుకుంది. గతేడాది జాతీయ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. దీంతో కామన్వెల్త్ గేమ్స్‌లో తప్పకుండా పతకం సాధిస్తుందని అప్పుడే అనుకున్నారు. అందుకు తగ్గట్టుగానే కాంస్యం దక్కించుకుని సత్తా చాటింది.



# వుదయం సినిమా

MOVIE TIME!

## 'అమీర్ లోగ్' చూసి హైదరాబాదీల మీద మరింత గౌరవం పెరుగుతుంది

**వుదయం సినిమా** 'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం 'అమీర్ లోగ్'. ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో MC హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూ వీ ని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఆగస్ట్ 21న ఈ మూవీని విడుదల చేయబోతోన్నట్టుగా శనివారం నాడు ప్రకటించారు. రిలీజ్ డేట్‌తో పాటుగా 'అవ్వల్ దావత్' సాంగ్‌ని కూడా విడుదల చేశారు.



## ఘనంగా 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రీమియర్



**వుదయం సినిమా:** ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూసిన 'స్పైడర్–మ్యాన్: బ్రాండ్ న్యూ డే' విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని అల్లు సినిమాస్ (భారతదేశంలోనే అతిపెద్ద, అత్యాధునిక డాల్బీ సినిమా స్క్రీన్)లో గ్రాండ్ ప్రీమియర్ నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రీమియర్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన భార్య స్నేహా రెడ్డి, పిల్లలతో కలిసి హాజరై సందడి చేశారు. అభిమానులు ఈ అరుదైన ఫ్యామిలీ మూమెంట్‌ను ఆసక్తిగా స్వాగతించగా, సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్‌గా మారాయి.ఈ వేడుకకు అల్లు అరవింద్, అల్లు శిరీష్, బన్నీ వాస్, దర్శకులు చందూ మొండేటి, సాయి రాజేష్, హరీష్ శంకర్, బోయపాటి శ్రీను, నటి రష్యా గోరక్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత రవి, హారిక & హాసిని క్రియేషన్స్‌కు చెందిన నిర్మాత చిన్నబాబు, ఆస్కార్ విజేత నిర్మాత గునీత్ మోంగా తదితరులు హాజరయ్యారు. సినీ ప్రముఖుల సందడితో ప్రీమియర్ మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తెలుగు రాష్ట్రాల్లో స్పైడర్–మ్యాన్: బ్రాండ్ న్యూ డే' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, విడుదలైన తొలి రోజే పలు ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ ప్రద ర్శనలతో సినిమా దూసుకుపోతోంది. ప్రస్తుతం ఈ చిత్రం ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో దేశవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.


## రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'లెనిన్'..

**వుదయం సినిమా:** అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. మొదటి రోజు నుంచే 'లెనిన్' రికార్డుల్ని సృష్టించడం ఆరంభమైంది. ఇక ఇప్పుడు ఈ చిత్రం ఏకంగా వంద కోట్ల క్లబ్బులోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ ఇప్పటి వరకు వంద కోట్ల కలెక్షన్స్‌ను రాబట్టిందని మేకర్స్ అధికారికంగా పోస్టర్‌ను రిలీజ్ చేశారు.'లెనిన్' మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు అందించిన కథ, కథనం అన్నీ కూడా సినిమాకి ప్రధాన బలం. ఇక ఇందులో ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ తమ అద్భుతమైన పర్ఫామెన్స్‌ను ప్రదర్శించారు. లెనిన్ పాత్రలో అఖిల్ నెవ్వర్ బిఫోర్ అనే రేంజ్‌లో మెప్పించాడు. ఇక భాగ్యశ్రీ బోర్సే, శివాజీ, ఈశ్వరీ రావు, ప్రమోద్ అందరూ అద్భుతం చేశారు.ఇక ఈ సినిమాకు తమన్ ఇచ్చిన సంగీతం, నేపథ్యం సంగీతం ప్రధాన ఆకర్షణ అని చెప్పుకోవచ్చు. లియోన్ బ్రిట్టో కెమెరావర్క్, నవీన్ నూలి ఎడిటింగ్ సినిమాని నిలబెట్టాయి. అఖిల్ అక్కినేని 'లెనిన్' చిత్రం వంద కోట్ల క్లబ్‌లో చేరడంతో అక్కినేని అభిమానులంతా సంతోషిస్తున్నారు.



## 'అగధ' ట్రైలర్ ఆగస్టు 3న విడుదల!

**వుదయం సినిమా:** ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందిన మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ 'అగధ' పై ప్రేక్షకుల్లో రోజు రోజుకీ ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే విడుద లైన టీజర్‌కు, పోస్టర్స్ కు అద్భుత స్పందన రావడంతో సినిమా చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి.ఆ ఉత్కంఠను మరిం త పెంచుతూ 'అగధ' ట్రైలర్‌ను ఆగస్టు 3న మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో అడవి నడుమ మర్మమైన వాతావరణంలో నిలబడి ఉన్న స్త్రీ సాధువు రూపం సినిమా కథలో దాగి ఉన్న రహస్యాలపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్ చూస్తుంటే 'అగధ' ప్రేక్షకులను ఓ విభిన్న మైన ఆధ్యాత్మిక మిస్టరీ ప్రపంచంలోకి తీసుకెళ్లబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ LLP బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తు న్న ఈ చిత్రాన్ని అజయ్ కె.ఆర్. సమర్పిస్తున్నారు. కథ, కథనం, దర్శకత్వ బాధ్య తలను ఎం.ఎస్. రాజు స్వయంగా నిర్వ హించారు.తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రూపొందిన 'అగధ' ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 14న గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే టీజర్ తో సంచలనం సృష్టిం చిన ఈ చిత్రం, ఇప్పు డు ట్రైలర్‌తో అంచనాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని చిత్ర యూని ట్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది.



## 'కాళాంకి భైరవుడు'నుంచి 'ఏంటో ఏమో' పాట

**వుదయం సినిమా:** విభిన్న మైన గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్ 'కాళాంకి భైరవుడు' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చేత బడులు, క్షుద్ర పూజలు, నిజ జీవితంలో చోటు చేసుకున్న కొన్ని ఆశ్చర్యకర సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించనుంది. దర్శకుడు హరిహరన్.వి తన ప్రత్యేక కథన శైలితో ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రొడ్యూసర్ రాచమల్ల శ్రీనివాస రావు గారు మాట్లాడుతూ.. "అందరికి నమస్కారం, మా సినిమా కాన్సెప్ట్ బ్లాక్ మేజిక్, ఈ సినిమా మీ అందరకి నచ్చుతుంది అని ఆశిస్తున్నాను. థాంక్ యూ".దర్శకుడు హరిహరన్ వి మాట్లాడుతూ.. "ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. విజయవాడ అనేది ఒక ఎమోషన్. అందుకే మా సినిమా సాంగ్ లాంచ్‌ను ఇక్కడ నిర్వహిస్తున్నాం.'కాళాంకి భైరవుడు' సినిమా ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. కాష్మోరా సినిమా ఇక్కడ ఎంతమంది చూశారో తెలియదు. హీరో రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ, "విజయవాడ అంటే నాకు చాలా ఎమోషన్. నేను ఇక్కడే చదువుకున్నాను. అందుకే ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. సినిమా పరిశ్రమలో నిర్మాతల సపోర్ట్ లేకుండా మంచి సినిమాలు రావు. ఇలాంటి నిర్మాతలు మరిన్ని మంచి చిత్రాలను నిర్మిస్తూ ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, దర్శకుడు హరిహరన్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ.. "నాకు తెలుగు చాలా బాగా వచ్చు. మీ విలువైన సమయాన్ని కేటాయించి ఇక్కడికి వచ్చి మా సినిమాకు సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మా మొదటి పాటకు మీరు అందించిన ఆదరణలాగే, ఈ కొత్త పాటను కూడా ఆదరిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ పాటను కూడా రీల్స్ ద్వారా వైరల్ చేసి మరింత మంది ప్రేక్షకులకు చేరేలా చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మా దర్శకుడు హరి గారు ఈ సినిమాను ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు.



## నేను ప్రేమికుడ్ని చిత్ర ఫస్ట్ లుక్

**వుదయం సినిమా:** ఆల్మెటి క్రియేషన్స్ బ్యానర్ లో శ్రీ వి చిన్న శ్రీశైలం యాదవ్ సమర్పణలో వడిగేపల్లి కృష్ణ నిర్మాతగా వి రమేష్ యాదవ్, కాకర్లమూడి రామకృష్ణ సహ నిర్మాతలుగా రామ్ భారధరం దర్శ కత్వంలో దేవర పల్లి రేవంత్ ఎల్సా ఘోస్ హీరో హీరోయిన్లు గా తెరకెక్కుతున్న చిత్రం నేను ప్రేమికుడ్ని నేను ప్రేమికుడ్ని చిత్ర ఫస్ట్ లుక్ కార్యక్రమం హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగింది ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కోదండ రామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నేను ప్రేమికుడ్ని ఫస్ట్ లుక్ విడుదల చేశారు ఈ సందర్భంగా కోదండరామిరెడ్డి మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్ తో రాబోతున్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలి అన్నారు. హీరో రేవంత్ దేవరపల్లి మాట్లాడుతూ 'లవ్, హారర్ ఎలిమెంట్స్ తో రాబోతున్న మా సినిమా ఫస్ట్ లుక్ కోదండరామిరెడ్డి గారు విడుదల చెయ్యడం సంతోషంగా ఉంది, త్వరలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రాబో తోంది, నేను ప్రేమికుడ్ని సినిమా అందరికి నచ్చే ఫ్యామిలీ సినిమా అవుతుంది అన్నారు. ఈ సినిమాకు సిని మాటోగ్రఫీ ప్రసాద్ ఈదర, ఎడిటర్ నందమూరి హరి, ఆర్ట్ విజయకృష్ణ, ఫైట్స్ అవినాష్, డాన్స్ బండ్ల రామా రావు.



## "సుధీర్స్ జోకర్" లో నటి అభిరామి

**వుదయం సినిమా:** సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "సుధీర్స్ జోకర్". బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అందరి ప్రశంసలు అందుకున్న పరదా లాంటి విభిన్నమైన చిత్రం తర్వాత ఆనంద మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి., విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు "సుధీర్స్ జోకర్" మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రముఖ నటి అభిరామి నటిస్తున్నట్లు ప్రకటించారు. "సుధీర్స్ జోకర్" సినిమాలో అభిరామి గాయత్రీ దేవి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా అభిరామి పోషిస్తున్న గాయత్రీ దేవి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. 'అమ్మకు ఇచ్చిన మాట చిరకాలం మిగిలి పోతుంది..' అంటూ ఈ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ హార్ట్ టచింగ్ గా ఉంది.



## "నిరమ్" ట్రైలర్, ఆడియో లాంచ్



**వుదయం సినిమా:** ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "నిరమ్". ఈ చిత్రాన్ని కె. స్క్వేర్ సినిమాస్ సమర్పణలో యూనిట్ ఆఫ్ కె స్క్వేర్ వెంచర్స్ బ్యానర్ పై కె. బిందుమాధవి నిర్మిస్తున్నారు. పి.రాజేష్ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ దర్శకుడు బలరామ్ కృష్ణ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "నిరమ్" సినిమా తెలుగు ట్రైలర్, ఆడియో లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోలిరిసిస్ట్ భారతీబాబు మాట్లాడుతూ – ఈ చిత్రంలో నేను రెండు సాంగ్స్ రాశాను. వనమాలి గారు రెండు సాంగ్స్ రాశారు. డైరెక్టర్ బలరామ్ కృష్ణ గారికి తెలుగు బాగా తెలుసు. ఆయన మాతో మంచి సాంగ్స్ రాయించుకున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.